సంపుటి : 21 సంచిక : 9

ఫిబ్రవరి 2026

238

# మార్క్సిస్టు

వెల రూ. 15/-

## సైద్ధాంతిక మాసపత్రిక

## ఫిబ్రవరి 12 అఖిల భారత కార్మిక సమ్మె ప్రత్యేక సంచిక




ఈ సంచికలో........


- శ్రామిక హక్కులపై దాడిని తిప్పికొట్టాలి!
- కార్మిక హక్కులు కాలరాసే 'లేబర్ కోడ్'లు
- లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా 25 కోట్ల కార్మికులను ఏకం చేసిన జూలై 9 సమ్మె
- దోపిడీ యజమానుల హక్కు, సమ్మె కార్మికుల నేరమా ?
- కార్మిక వర్గం : నయా-ఫాసిజం
- ఆర్థిక సమ్మెలు, రాజకీయ సమ్మెలు
- హక్కులు కోల్పోతున్న తెలంగాణా కార్మికవర్గం
- ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక వ్యతిరేక విధానాలు-ప్రతిఘటన
- మోడీ పాలనలో గ్రామీణ కార్మికుల దుస్థితి
- నాయకుల హత్యల నుండి లేబర్ కోడ్‌ల వరకు..
- కార్మికవర్గాన్ని విపత్కర పరిస్థితుల్లోకి నెట్టిన ప్రభుత్వం
- పోరాడ్డం నేర్పే పాఠశాల సమ్మె

**ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం**

# పోరాడ్డం నేర్పే పాఠశాల సమ్మె

**విఐ లెనిన్**



"....తమను తీవ్రమైన ఈతిబాధలకు గురిచేసే పీడననుండి రక్షించుకునేందుకు కార్మికులు తాడోపేడో అనే రీతిలో పోరాటానికి దిగుతారు. ఒక్కొక్కరుగా ఉంటే తాము శక్తిహీనులమని, పెట్టుబడిదారీ పీడన తమను అణగదొక్కేస్తుందని గుర్తించే కొద్దీ వారు తమ యజమానులపై ఐక్యంగా తిరగబడతారు. ఆ విధంగా కార్మికుల సమ్మెలు ప్రారంభమవుతాయి...

"అన్ని దేశాల్లోనూ కార్మికుల ఆగ్రహం తొలుత విడివిడి తిరుగుబాట్లుగా ప్రారంభమవుతుంది. రష్యాలో పోలీసులూ, ఫ్యాక్టరీ యజమానులూ వీటిని "మ్యుటినీలు" అన్నారు. అన్ని దేశాల్లోనూ ఈ విడివిడి తిరుగుబాట్లు ఒకవైపు శాంతియుత సమ్మెలకూ, మరోవైపు కార్మికవర్గం తన విముక్తికోసం చేసే సర్వతోముఖ పోరాటాలకూ దారితీస్తాయి....

"అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణం నుండి ఉద్భవించే సమ్మెలు, ఆ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికవర్గం సాగించే పోరాటానికి నాంది అవుతాయి. ధనిక పెట్టుబడిదారులతో ఆస్తిపాస్తుల్లేని కార్మికులు వ్యక్తిగతంగా తలపడితే కార్మికులు బానిసలుగా మారిపోతారు. కానీ ఆస్తిపాస్తుల్లేని ఆ కార్మికులే ఐక్యమైతే పరిస్థితి మారిపోతుంది.....

"...ప్రతి సమ్మె.... పెట్టుబడిదారులకు నిజమైన యజమానులు కార్మికులేగానీ తాము కాదన్న విషయాన్ని గుర్తుచేస్తుంది. కార్మికులు రానురాను తమ హక్కులగురించి గొంతెత్తుతారు. ప్రతి సమ్మె కార్మికులకు... తమ పరిస్థితి నిరాశాజనకంగా లేదని, తాము ఒంటరి వాళ్లం కాదన్న విషయాన్ని గుర్తుచేస్తుంది.....

"సమ్మె కార్మికులకు యజమానుల బలాన్నీ, కార్మికుల్లో ఉన్న బలాన్నీ అర్థంచేసుకోవడమెలాగో నేర్పుతుంది. తమ యజమానుల గురించి మాత్రమే కాక, తమచెంతనున్న కార్మికులను గురించి మాత్రమే కాక మొత్తం యజమానులగురించీ, మొత్తం పెట్టుబడిదారీ వర్గం గురించీ, మొత్తం కార్మికవర్గం గురించీ ఆలోచించడం నేర్పుతుంది. అనేక తరాల కార్మికుల శ్రమను దోచుకుని కోట్లు గడించిన ఫ్యాక్టరీ యజమాని కొంచెం వేతనం పెంచడానికి నిరాకరిస్తే, వేతనాన్ని ఇంకా తగ్గించేయడానికి ప్రయత్నిస్తే, దానికి కార్మికులు అడ్డం తిరిగినప్పుడు ఆకలిగొన్న వేలాదిమంది కార్మికుల కుటుంబాలను రోడ్లపాలు చేస్తే, అప్పుడు మొత్తం పెట్టుబడిదారీ వర్గం మొత్తం కార్మిక వర్గానికి శత్రువని కార్మికులకు స్పష్టమైపోతుంది. కార్మికులు తమ కాళ్లమీద, తమ సంఘటిత శక్తిమీద తాము నిలబడాలన్న విషయం కూడా వారికి స్పష్టమైపోతుంది. ఫ్యాక్టరీ యజమాని కార్మికులను తరచు మోసగిస్తుంటాడు. తాను వారిని ఉద్ధరించేవాడిలా పోజుపెడుతుంటాడు, చిన్న చిన్న రాయితీలు, పనికిరాని వాగ్దానాలతో తన దోపిడీని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తుంటాడు. ఒక్క సమ్మె ఈ మోసాన్ని ఒక్క దెబ్బతో బట్టబయలు చేస్తుంది. తమను ఉద్ధరించేవారు మేకతోలుకప్పుకున్న పులులన్న విషయాన్ని కార్మికులకు స్పష్టం చేస్తుంది.

"అంతేకాదు, సమ్మె పెట్టుబడిదారుల సహజలక్షణం పట్లనే కాకుండా ప్రభుత్వ, దాని చట్టాల లక్షణాలపట్ల కూడా కార్మికుల కళ్లు తెరిపిస్తుంది....ప్రతి సమ్మె – ప్రభుత్వం తమ శత్రువన్న అవగాహననూ, కార్మికవర్గం ప్రజల హక్కులకోసం పోరాడ్డానికి సిద్ధపడాలన్న అవగాహననూ కార్మికుల్లో అభివృద్ధిచేసి, పటిష్టపరుస్తుంది.

"అందువల్ల సమ్మెలు, కార్మికులకు ఐక్యం కావడాన్ని నేర్పుతాయి. తాము ఐక్యంగా ఉంటేనే పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడ గలమని వారికి తెలియజెప్పుతాయి. మొత్తం ఫ్యాక్టరీ యజమానుల వర్గానికి వ్యతిరేకంగా, ఏకపక్ష పోలీసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొత్తం కార్మిక వర్గం పోరాడాలన్న ఆలోచనను సమ్మెలు కార్మికులకు నేర్పుతాయి. ఈ కారణం చేతనే సోషలిస్టులు సమ్మెలను "యుద్ధ పాఠశాల"గా పేర్కొంటున్నారు. మొత్తం ప్రజానీకాన్ని, శ్రమజీవులందరినీ ప్రభుత్వాధికారుల కబంధ హస్తాలనుండి, పెట్టుబడి పీడననుండి విముక్తి చేయడానికి శత్రువుపై పోరాడ్డం ఎలాగో కార్మికులు నేర్చుకునే పాఠశాల సమ్మె."

**(వి.ఐ. లెనిన్ కలెక్టెడ్ వర్క్ ప్రోగ్రెస్ పబ్లిషర్స్,1964, మాస్కో, వాల్యూమ్ 4, పేజీ 310-319 నుండి)**

**చదవండి! చదివించండి!!**

**Marxist**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక**

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist

## ఈ సంచికలో...


1. పోరాడ్డం నేర్పే పాఠశాల సమ్మె
వి.ఐ లెనిన్.........2

2. శ్రామిక హక్కులపై దాడిని తిప్పికొట్టాలి!
పినరయి విజయన్.....4

3. కార్మిక హక్కులు కాలరాసే 'లేబర్ కోడ్'లు
దీపక్ భలేరావు......8

4. లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా 25 కోట్ల కార్మికులను ఏకం చేసిన జూలై 9 సమ్మె
వేదాంత్ లఖేరా.....11

5. దోపిడీయజమానులహక్కు సమ్మెకార్మికులనేరమా?
మైత్రేయి కృష్ణన్.....13

6. కార్మిక వర్గం: నయా-ఫాసిజం
ప్రభాత్ పట్నాయక్ .......16

7. ఆర్థిక సమ్మెలు, రాజకీయ సమ్మెలు
లెనిన్........18

8. హక్కులు కోల్పోతున్న తెలంగాణా కార్మికవర్గం
ఎస్ వీరయ్య .....21

9. ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక వ్యతిరేక విధానాలు-ప్రతిఘటన
సిహెచ్ నర్సింగరావు.....24

10. మోడీ పాలనలో గ్రామీణ కార్మికుల దుస్థితి
ప్రభాత్ పట్నాయక్ .....27

11. నాయకుల హత్యల నుండి లేబర్ కోడ్‌ల వరకు..
సుధా భరద్వాజ్ .....29

12. కార్మికవర్గాన్ని విపత్కర పరిస్థితుల్లోకి నెట్టిన ప్రభుత్వం
టికె రాజలక్ష్మి.....32



సంపాదకుడు :
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# సార్వత్రిక ప్రతిఘటనకు సిద్ధం

ఫిబ్రవరి 12వ తేదీన భారత దేశం ఒక మహా ప్రతిఘటనను చూడబోతోంది. కార్మికవర్గంతోపాటు, వ్యవసాయ కార్మికులు, రైతాంగం, ఇతర సెక్షన్ల ప్రజలు ఆ రోజున కార్మిక సమ్మె రూపంలో ప్రదర్శితమయ్యే ఈ ఐక్య ప్రతిఘటనలో పెద్ద ఎత్తున పాల్గొనబోతున్నారు. దేశ స్వాతంత్ర్యానికి ముందూ, తరువాతా కార్మికవర్గం ఎన్నో త్యాగాలతో పోరాడి సాధించుకున్న హక్కులను వారి నుండి లాక్కోడానికి కార్పొరేట్-మతోన్మాద కూటమిని అనుమతించే ప్రసక్తి లేదని సమ్మెకు సన్నాహకంగా జనవరి 9వ తేదీన దేశ రాజధానిలో జరిగిన జాతీయ కార్మిక సమ్మేళనం గర్జించింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో అత్యంత నిరంకుశ పద్ధతిలో తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను తిప్పికొట్టేవరకు తమ పోరాటం కొనసాగుతుందనీ, దానికి ఫిబ్రవరి 12 సమ్మె ఒక మహా ప్రారంభం కానుందనీ పేర్కొంది.

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభ దశకు చేరుకుంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విఫలమయిందని దాన్ని నడుపుతున్న శక్తులే ఒప్పుకుంటున్నాయి. సంక్షోభ ప్రభావం భారత దేశం మీదకూడా పెద్ద ఎత్తున పడింది. ఏటా 6 శాతం అభివృద్ధి సాధిస్తున్నామనీ, భారత దేశం నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందనీ పాలక వర్గాలు చెబుతున్న మాటల్లోని డొల్లతనాన్ని మన దేశంలో పెరుతున్న పేదరికం, నిరుద్యోగం, ఆకలి, అనారోగ్యాలే బట్టబయలు చేస్తున్నాయి. దక్షిణాసియాలోని ఇతర చిన్న దేశాలతో పోల్చుకున్నా కూడా భారతీయ రూపాయి విలువ వేగంగా పతనమవుతోంది. స్టాక్ మార్కెట్లు డోలాయమానంలో పడ్డాయి. అమెరికన్ సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా పనిచేయడానికి అంగీకరించిన భారత పాలక వర్గాలకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది.

ఈ సంక్షోభాన్ని భారత దేశంలోని కార్మికవర్గం, ఇతర శ్రామిక ప్రజలమీదకు నెట్టేసి తాము మాత్రం తమ గరిష్ట లాభాలు నిలుపుకోవాలని పాలక వర్గాలు తాపత్రయ పడుతున్నాయి. అందులో భాగమే ఒకవైపు కార్మిక చట్టాలు రద్దు చేసి 4 కోడ్‌లు ప్రవేశపెట్టడం, మరోవైపు గ్రామీణ కార్మిక వర్గమైన వ్యవసాయ కార్మికులకు మేలు చేసే ఎన్ రెగాను రద్దు చేసి వారి ఉపాధి ఊపిరి తీసే జీ రామ్ జీ పథకాన్ని ప్రవేశపెట్టడం.

భారతీయ కార్మికవర్గాన్ని యజమానుల వద్ద బానిసలుగా మార్చే విధంగా, వారి ట్రేడ్‌యూనియన్ హక్కులను కాలరాసే విధంగా 4 లేబర్ కోడ్‌లు రూపొందించబడ్డాయి. ఇవి దేశంలోని కార్మికుల శ్రమనే కాకుండా గ్రామీణ శ్రామికులు, రైతులనూ మొత్తంగా దేశ ప్రజానీకాన్ని మరింతగా దోచుకోడానికి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ లేబర్ కోడ్‌లు దోపిడీ యజమానుల హక్కు, సమ్మె కార్మికుల నేరంగా మార్చేస్తున్నాయి. కార్మికవర్గపు ప్రజాతంత్ర హక్కులే మన దేశంలో ప్రజాస్వామ్యానికి పునాది. ఆ కార్మిక హక్కులను హరించడం ద్వారా మోడీ ప్రభుత్వం ఈ దేశంలో ప్రజాస్వామ్య పునాదినే పెకిలించి వేస్తున్నది.

శ్రామిక ప్రజానీకం మీద పాలక వర్గాలు చేస్తున్న ఎదురుదాడిని అంతే మోతాదులో ప్రతిదాడితో తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమయింది. అందుకే రానున్న సమ్మెలో కార్మికవర్గమే కాకుండా శ్రామికుల్లోని అన్ని సెక్షన్లూ తమ సర్వశక్తులూ ఒడ్డాల్సిన అవసరం ఉంది. 12వ తేదీన జరిగే సమ్మె భారత దేశంలో నయా-ఉదారవాదం అమల్లోకి వచ్చిన తరువాత జరుగుతున్న 24వ కార్మిక సమ్మె. బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత జరుగుతున్న 9వ సమ్మె. లేబర్ కోడ్‌లను నిరంకుశంగా పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకునే వరకు గడచిన కాలంలో జరుగుతున్న 5వ సమ్మె. రానున్న కాలంలో ఒక రోజు కాకుండా అనేక రోజుల సమ్మెలు చేయాలనీ, సెక్టర్ల వారీగా సమ్మెపోరాటం నిర్వహించాలని ట్రేడ్ యూనియన్లు యోచిస్తున్నాయి.

ప్రధాన ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో జరుగుతున్న కార్మిక సమ్మెకు పూర్తి సహకారం అందించడానికి సంయుక్త కిసాన్ మోర్చా ముందుకొచ్చింది. జీ రామ్ జీ పథకానికి వ్యతిరేకంగా దేశవ్యాపిత ఉద్యమానికి సిద్ధమవుతున్న వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త ఫ్రంట్ కూడా సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఇటీవల జరిగిన అఖిల భారత వర్గ, ప్రజాసంఘాలు, వేదికల సమావేశం సమ్మె కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయినుండి సంయుక్త క్యాంపెయిన్ నిర్వహించాలని నిర్ణయించింది. మొత్తం మీద శ్రామిక ప్రజలు సమ్మెలోకి పెద్ద ఎత్తున వస్తున్నారు. దేశంలోని ప్రజాతంత్ర, దేశభక్త శక్తులన్నీ వీరితో భుజం భుజం కలిపి ప్రతిఘటలో పాల్గొనాలి. కోడ్‌లు ఉపసంహరించేవరకు పోరాటం కొనసాగించాలి.

ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం

# శ్రామిక హక్కులపై దాడిని తిప్పికొట్టాలి!

పినరయి విజయన్



రచయిత కేరళ ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

**(కేరళ రాజధాని తిరువనంతపురంలో 2025 డిసెంబర్ 19 న కార్మిక జాతీయ సదస్సును కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగపాఠాన్ని మార్పిపిస్టు పాఠకులకు అందిస్తున్నాం)**

కార్మిక చట్టాలను సులభతరం చేయాలనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా గుదిగుచ్చింది. వేతనాలపైన, పారిశ్రామిక సంబంధాల పైన, సాంఘిక భద్రత పైన, పని ప్రదేశంలో భద్రత పైన వాటిని రూపొం దించింది.

ఈ కోడ్ల వలన కార్మిక హక్కులకు భంగం వాటిల్లుతుందని సాధారణ ప్రజానీకం భావిస్తున్నారు. ఈ అంశాలను చర్చించడానికి, అవి తెచ్చిపెట్టే సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ సదస్సు జరుగుతోంది.

మన దేశ కార్మిక రంగం నేడు ఒక క్లిష్టమైన, చారిత్రిక దశగుండా సాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చింది మొదలు బహుశా ఇంతటి క్లిష్ట పరిస్థితిని ఎదుర్కోవడం ఇదే మొదటిసారి. ఈ క్లిష్ట పరిస్థితిలో రాష్ట్ర కార్మిక శాఖ ఈ సదస్సును నిర్వహిస్తున్నది. దీనిని ఒక సాధారణ సమావేశంగా భావించవద్దు. దేశ ఆర్థిక వ్యవస్థకు కార్మికులే పునాది. అటువంటి కార్మికుల అస్థిత్వాన్ని, గౌరవాన్ని, హక్కులను కాపాడుకోడానికి జరిగే చట్టపరమైన, రాజకీయ పరమైన, ప్రజాస్వామిక ప్రతిఘటనకు ఈ సదస్సు ఒక వేదిక. నేటి ప్రపంచంలో కార్మిక వర్గానికి, పెట్టుబడిదారులకు నడుమ అసమానత తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితిలో మనం కార్మికవర్గం వైపు నిలవాలి. ప్రజల ఆందోళనను, బాధలను పంచుకుంటూ వారికి అండగా నిలవడం ఒక ప్రజాస్వామిక ప్రభుత్వపు రాజకీయ, నైతిక బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడానికి మనం ఇక్కడ సమావేశమయ్యాం.

మన చుట్టూ వున్న ప్రపంచం వేగంగా మారుతోంది. సాంకేతికపరంగా ఉత్పత్తి విధానంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పులు ఎవరికోసం అన్నది ఒక ప్రధానమైన ప్రశ్న. ఈ మార్పులు సామాన్య ప్రజల జీవితాల్లో మెరుగుదలకా? లేక బడా కార్పొరేట్ల ప్రయోజనాలకోసమా?

కేంద్ర ప్రభుత్వం కార్మికుల ప్రాథమిక హక్కులను హరించేలా, బడా కార్పొరేట్ల ప్రయోజనాలకు పెద్ద పీట వేసేలా విధానపరమైన చర్యలతో ముందడుగు వేసినపుడు తన హేతుబద్ధమైన, ప్రజాతంత్రయుతమైన నిరసనను ప్రకటించడం ఒక బాధ్యతాయుతమైన సమాజపు కర్తవ్యం.

ఉద్యోగ భద్రత, సాంఘిక సంక్షేమం కల్పించలేని ఆర్థికాభివృద్ధి విధానాల పంథా నిలకడగా కొనసాగజాలదని ఈ రాష్ట్ర ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. కేవలం జిడిపి వృద్ధి ప్రాతిపదికనో, లేక కార్పొరేట్ల లాభాల ఖాతాలలో నమోదైన వృద్ధి ప్రాతిపదికనో కాక, మానవ జీవన ప్రమాణా లలో గుణాత్మకమైన అభివృద్ధిని, సామాజిక న్యాయం మీద ఆధారపడిన ఆర్థిక విధానాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలన్నదే మా ప్రభుత్వ నిర్వచనం.

కార్మిక చట్టాలు గాని, హక్కులు గాని పాలకవర్గాల ప్రభుత్వాల దయతో వచ్చినవి కావన్న చారిత్రిక సత్యాన్ని మనం మరిచిపోకూడదు. మనకి వాటిని ఎవరూ ఓ వెండి పళ్ళెంలో పేర్చి అందించలేదు. నిజానికి అవి మన రక్తాన్ని, కష్టాన్ని ధారపోసి పోరాడి సాధించుకున్నవి. సామ్రాజ్యవాద పెత్తనానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటఫలితంగా, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో జరిగిన ఉద్యమాల ఫలితంగా మనం దక్కించుకున్నాం.

దేశవ్యాప్తంగా శ్రామిక వర్గం చారిత్రాత్మక పోరాటాలు జరిపింది. బొంబాయి జౌళి కార్మికులు, కలకత్తా జనపనార మిల్లుల కార్మికులు, కాన్పూర్, అహ్మదాబాద్ నగరాల కార్మికులు నిర్వహించిన పోరాటాలు ఆనాడు జరిగిన భారత స్వాతంత్ర్య పోరాటం నుండి విడదీయలేని అంతర్భాగం.

కేరళలో పున్నప్ర-వయలార్, కయ్యూర్, కరివెల్లూర్ పోరాటాలు, కొబ్బరిపీచు, జీడి, చేనేత, టీ, రబ్బరు, కాఫీ తోటలు వంటి రంగాల కార్మికులు సాగించిన పోరాటాలు కార్మిక హక్కులను సాధించుకునే లక్ష్యంతో, భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించే లక్ష్యంతో జరిగాయి. అవన్నీ సామ్రాజ్యవాద వ్యతిరేకత అనే రాజకీయ స్వభావాన్ని కలిగినవే. చారిత్రికంగా సంతరించుకున్న ఈ చైతన్యం మనకి నేడు అవసరమైన బలాన్ని అందిస్తుంది.

స్వాతంత్ర్యం అనంతరం భారత దేశంలో కార్మిక చట్టాలు భారత రాజ్యాంగ పీఠిక ప్రకటించిన 'సోషలిజం', ఆదేశ సూత్రాలు ప్రస్తావించిన 'సంక్షేమరాజ్యం' అనే భావనలకు అనుగుణంగా రూపొందాయి.

ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనం, బోనస్, ఇఎస్ఐ, పిఎఫ్ వగైరాలు ఉమ్మడి బేరసారాల ద్వారా, చట్టపరమైన పోరాటాల ద్వారా సాధించుకున్నవి. 1947లో వచ్చిన పారిశ్రామిక వివాదాల చట్టం, 1948 లో వచ్చిన ఫాక్టరీల చట్టం, కనీసవేతనాల చట్టంవంటివి కార్మికులంటే కేవలం ఉత్పత్తిలోని పనిముట్టు కాదని, హక్కులు కలిగిన ఒక పౌరుడని గుర్తించాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాల కోసం ఉండే అత్యాశను కొంతవరకూ నియంత్రించి సంపద పంపిణీ సక్రమంగా జరిగేందుకు దోహదం చేశాయి.

ఐతే, 1990 దశకంలో మొదలైన నయా-ఉదారవాద విధానాలు కార్మిక

రంగంలో వ్యవస్థీకృత మార్పులకు దారి తీశాయి. ఈ విధానాలను తొలుత ప్రారంభించినది కాంగ్రెస్ ప్రభుత్వాలు. వాటినే బిజెపి ప్రభుత్వాలు మరింత వేగంగా, దూకుడుగా అమలు చేస్తున్నాయి. పౌరుల రక్షణ ప్రధాన బాధ్యతగా పరిగణించే స్థితి నుండి మార్కెట్ శక్తులకు ఊడిగం చేసే పాత్ర లోకి ప్రభుత్వం ఏ విధంగా మారి పోయిందో మనం చూస్తున్నాం. ఈ పరిస్థితి కార్మికుల ఉద్యోగ భద్రతకు, జీవన పరిస్థితులకు ప్రతికూలంగా పరిణమించింది.

> “ గతంలో లే-ఆఫ్, రిట్రెంచిమెంట్, మూసివేత వంటి చర్యలకు యజమానులు పూనుకునేముందు వారు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉండేది. పాత చట్టాల ప్రకారం 100 మంది కార్మికులు ఉన్న ప్రతీ సంస్థకూ ఈ నిబంధన వర్తించేది. ఇప్పుడు 300 మంది కార్మికలు ఉన్న సంస్థ వరకూ ఇటువంటి ముందస్తు అనుమతి అవసరం లేదు. అంటే దేశంలోని ఫాక్టరీలు, పారిశ్రామిక సంస్థల్లో దాదాపు 90 శాతానికి పభుత్వ అనుమతి లేకుండానే కార్మికులను యధేచ్ఛగా తొలగించే అధికారం సంక్రమించింది. ”

ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను అమ్మకానికి పెట్టడం, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో దేశ ప్రజానీకానికి చెందిన ఆస్తులను అమ్మకానికి పెట్టడం మనం చూస్తున్నాం. లాభాలనార్జిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను సైతం అమ్మేస్తున్నారు.

శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల నియామకాలు చేపట్టడానికి బదులు కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించడం వలన లేబర్ మార్కెట్‌లో అనిశ్చిత పరిస్థితి నెలకొంది. ‘సమాన పనికి సమాన వేతనం’ సూత్రాన్ని ఉల్లంఘిస్తూ ఒకే తరహా పనిని చేస్తున్నప్పటికీ పర్మనెంట్ కార్మికులకు వేరుగా, కాంట్రాక్ట్ కార్మికులకు వేరుగా జీతాలు చెల్లించడం నానాటికీ విస్తృతమౌతోంది. ఇటువంటి చర్యలు “అందరికీ గౌరవ ప్రదమైన పని కల్పించాల”న్న లక్ష్యా న్నుంచి మనల్ని దూరం చేస్తాయి. కార్మికుల ఉమ్మడి బేరసారాల హక్కును బలహీనపరుస్తాయి.

ఈ విధానాల కొనసాగింపుగానే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశాెట్టింది. కార్మిక చట్టాలను సరళతరం చేసేందుకే వీటిని తెచ్చినట్టు చెప్తోంది. కాని ఈ మార్పులు మౌలికమైనవని, తిరోగమన స్వభావం కలిగినవని కార్మికుల భద్రతకు, పని నిబంధనలకు చేటు తెస్తాయని చాలా పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్మిక చట్టాలను “సరళతరం” చేసే ముసుగులో ఇప్పటివరకూ ఉన్న 29 కార్మిక చట్టాలలో కార్మికులకు చట్టబద్ధంగా కల్పించిన రక్షణను తొలగించివేస్తున్నారని కార్మిక సంఘాలు ఎత్తిచూపాయి. అందుచేత ఈ విషయాన్ని తీవ్రంగా పరిశీలించాలి.

ఈ లేబర్ కోడ్‌లను పార్లమెంటులో ప్రతిపక్షం లేని సమయంలో, ఎటువంటి ప్రజాస్వామ్యయుత చర్చా జరపకుండానే ఆమోదింపజేసుకోవడం చూస్తే దీని వెనుక దాగివున్న దురుద్దేశ్యం వెల్లడౌతోంది. కార్మికుల శ్రమ శక్తి మార్కెట్ మీద కార్పొరేట్లకు పూర్తి పెత్తనం కల్పించడం కోసమే ముందస్తు పథకం ప్రకారం తీసుకున్న చర్య ఇది.

కొత్త లేబర్ కోడ్‌లలో “పారిశ్రామిక సంబంధాల కోడ్” ఒకటి. అందులోని అంశాలను పరిశీలిస్తే అవి ఉద్యోగ భద్రతకు ఎసరు పెట్టేవిగా ఉన్నాయని కనిపిస్తోంది. మరీ ముఖ్యంగా గతంలో లే-ఆఫ్, రిట్రెంచిమెంట్, మూసివేత వంటి చర్యలకు యజమానులు పూనుకునేముందు వారు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉండేది. పాత చట్టాల ప్రకారం 100 మంది కార్మికులు ఉన్న ప్రతీ సంస్థకూ ఈ నిబంధన వర్తించేది. ఇప్పుడు ఈ కోడ్ ప్రకారం 300 మంది కార్మికలు ఉన్న సంస్థ వరకూ ఇటువంటి ముందస్తు అనుమతి అవసరం లేదు. అంటే దేశంలోని ఫాక్టరీలలో, పారిశ్రామిక సంస్థలలో దాదాపు 90 శాతం సంస్థలకు ఎటువంటి ప్రభుత్వ అనుమతీ లేకుండానే కార్మికులను యధేచ్ఛగా తొలగించే అధికారం సంక్రమించింది.

యజమాని ఇష్టానుసారం కార్మికులను తొలగించేయడం అంటే అది “ హైర్ అండ్ ఫైర్” (ఎప్పుడు బడితే అప్పుడు పనిలో పెట్టుకోవడం, ఎప్పుడు వద్దనుకుంటే అప్పుడు తొలగించివేయడం) పద్ధతికి చట్టబద్ధత కల్పించడమే. ఉద్యోగభద్రత అనేది ఇకపైన గతకాలపు చరిత్ర అయిపోతుంది. అంతేగాక, “పరిమిత కాలం వరకు ఉద్యోగం” లేదా “పరిమిత కాలం పని కోసం లేబర్ కాంట్రాక్టు” విధానాలు చట్టబద్ధం అయిపోతున్నాయి. ఇక పర్మనెంటు ఉద్యోగం అనే భావనకే చెల్లుచీటీ ఇచ్చేస్తున్నారన్నమాట.

పర్మనెంటు స్వభావం కల పనులలో సైతం కాంట్రాక్టు పద్ధతిన నియామకం చేయడానికి అనుమతించడం వలన కార్మికుల మెడపై కత్తి నిరంతరం వేలాడుతూనే వుంటుంది. దీని ప్రభావంతో వారు కార్మిక సంఘాల కార్యకలాపాలలో భాగస్వాములు కాలేకపోతారు. కాంట్రాక్టు కాల పరిమితి తీరిపోగానే ఎటువంటి పరిహారమూ లేకుండానే కార్మికులను తొలగించి వేయవచ్చు. కాంట్రాక్టు పునరుద్ధరణ కాకుంటే ఎక్కడ పని ఊడిపోతుందోనన్న భయంతో కార్మికులు తమపై సాగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా నోరెత్తేందుకు సిద్ధపడరు. అంతేగాక, ఒక ఏడాది లేదా రెండేళ్ళ తర్వాత తన ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో తెలియని స్థితిలో ఉండే కార్మికుడు తన భవిష్యత్తు జీవితం గురించి ఎటువంటి ముందస్తు ప్లానూ రూపొందించుకోలేడు.

అంతేకాదు, ఈ కోడ్ సమ్మె హక్కును చాలా తీవ్రంగా కట్టడి చేస్తోంది. సమ్మె చేయాలంటే 14 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వడం తప్పనిసరి నిబంధనగా ఉంది. దానితోబాటు సంప్రదింపులు జరుగుతున్న కాలంలో ఎటువంటి సమ్మెలూ చేయడం నిషేధం. అలాగే ట్రిబ్యునల్ ముందు కేసు పరిశీలనలో ఉన్న కాలంలో సైతం సమ్మెలు నిషేధించబడ్డాయి. 50 శాతానికి మించి కార్మికులు ఒకేసారి శలవులో వెళ్ళితే దానిని కూడా సమ్మె గానే పరిగణిస్తారు. అంటే ఆచరణలో సమ్మె చేసే హక్కును చట్టబద్ధంగా వినియోగించుకోవడం కార్మికులకు అసంభవం అయిపోతుంది.

ఇలా కార్మికుల ప్రాథమిక హక్కు అయిన “సమ్మె హక్కు” మీద కట్టడి చేయడం అంటే అది ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘించడమే ఔతుంది. సూపర్వైజర్ హోదాలో పని చేస్తూ నెలకు రు.18,000 దాటి జీతం పొందుతున్నవారిని ‘‘కార్మికుడు’’ గా ఇకపై పరిగణించరు. ఈ విధంగా వారిని వేరుగా ఉంచడం ద్వారా వారికి పారిశ్రామిక వివాదాల కోడ్‌లోని రక్షణ లేకుండా చేస్తున్నారు.

వేతనాల కోడ్‌లో చేసిన ప్రతిపాదనలు కూడా చాలా ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. “ఫ్లోర్ వేజ్” విధానం (మార్కెట్ లో ఎంత తక్కువ జీతానికి పనిచేయడం కోసం కార్మికుడు సిద్ధపడతాడో దానిని ఫ్లోర్ వేజ్ అంటారు)

❝ ప్రస్తుతం ఉనికిలో ఉన్న సంక్షేమ బోర్డులదగ్గర ఉండే నిధులను ఇతర అవసరాలకోసం కేంద్ర ప్రభుత్వం మళ్ళించే అవకాశం ఈ కోడ్‌లో కల్పించారు. బిల్డింగ్ తదితర నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి వగైరాలను ప్రభుత్వం వేరే అవసరాలకు మళ్ళించవచ్చు. అంటే, కార్మికులకు చెందిన ధనాన్ని వారి సంక్షేమం కోసం కాకుండా ఇతర అవసరాలకు వాడుకోవచ్చును. ఇపిఎఫ్ నిధుల విషయంలో కూడా ఇటువంటి అవకాశాలు కల్పించారు. ❞

అంటూ ఇందులో ప్రతిపాదించినది కనీస వేతనాలను శాస్త్రీయంగా నిర్ణయించే విధానాన్ని దెబ్బ తీస్తుంది. ఈ విధానం 15వ భారత లేబర్ కాన్ఫరెన్స్‌లో రూపొందింది. ఆ తర్వాత రెప్టకోస్‌బ్రెట్ కేసులో సుప్రీం కోర్టు ఈ విధానాన్ని సమర్ధించింది. దీని ప్రకారం కార్మికుడికి, అతడి కుటుంబానికి కనీసమైన ఆహారం, దుస్తులు, గృహ వసతి, విద్య, వైద్యం వంటి అవసరాలను తీర్చగలిగేదిగా కనీస వేతనం ఉండాలి.

ఈ కనీస అవసరాలను వేటినీ పరిగణన లోకి తీసుకోకుండా, జీవన వ్యయంలో ఆయా ప్రాంతాన్ని బట్టి ఉండే తేడాలను కూడా పట్టించుకోకుండా ఏకపక్షంగా "ఫ్లోర్ వేజ్" ను నిర్ణయించే అధికారాన్ని కేంద్రీకరించడం జరిగింది. దీని ఫలితంగా కార్మికుల కొనుగోలుశక్తి, వారి జీవన ప్రమాణాలు దెబ్బ తింటాయి.

ఇప్పుడు ప్రామాణికంగా ఉన్న 8 గంటల పని దినాన్ని 9 గంటలకు పెంచే మార్పులు ఈ కోడ్‌లో ఉన్నాయి. ఐతే, పని మధ్యలో విశ్రాంతి తీసుకునే సమయాన్ని పని సమయంలో భాగంగా లెక్కించరు. దీని వలన కార్మికులు ఎటువంటి అదనపు పరిహారమూ పొందకుండానే పని ప్రదేశంలో ఎక్కువ సమయాన్ని గడపవలసి వస్తుంది.

ఇక "సామాజిక భద్రత కోడ్" ను చూస్తే, "అందరికీ సామాజిక భద్రత కల్పిండం జరుగుతుంది" అని అందులో ప్రకటించినప్ప టికీ, ఆచరణలో అది ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలను దెబ్బ తీస్తోంది. అసంఘటిత రంగ కార్మికులకు గాని, గిగ్ వర్కర్లకు గాని సామాజిక భద్రత కల్పించే విషయంలో ఎటువంటి స్పష్టతా ఇందులో లేదు.

స్విగ్గీ, జొమాటో, ఉబర్ వంటి వేదికల ద్వారా లక్షల సంఖ్యలో యువతను పనుల్లో పెట్టుకుంటున్న ఈ "గిగ్ ఆర్థిక వ్యవస్థ" లో యజమానికి, కార్మికుడికి నడుమ ఉండే సంబంధం ఏమిటో ఎక్కడా స్పష్టం చేయలేదు. దాని ఫలితంగా ఆ కార్మికుల సంక్షేమం కోసం నిర్వహించే పథకాలకు నిధులను ఏ విధంగా సమీకరించాలన్న విషయంలో ఎటువంటి నిర్దేశిత విధానమూ లేకుండా పోయింది. కేవలం టర్నోవర్ పై 1 నుండి రెండు శాతం సెస్ (సుంకం) విధిస్తామన్న ప్రస్తావన మాత్రం ఇందులో ఉంది. అది ఏ మూలకూ చాలదు.

ప్రస్తుతం ఉనికిలో ఉన్న సంక్షేమ బోర్డులదగ్గర ఉండే నిధులను ఇతర అవసరాలకోసం కేంద్ర ప్రభుత్వం మళ్ళించే అవకాశం ఈ కోడ్‌లో కల్పించారు. బిల్డింగ్ తదితర నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి వగైరాలను ప్రభుత్వం వేరే అవసరాలకు మళ్ళించవచ్చు. అంటే, కార్మికులకు చెందిన ధనాన్ని వారి సంక్షేమం కోసం కాకుండా ఇతర అవసరాలకు వాడుకోవచ్చును. ఇపిఎఫ్ నిధుల విషయంలో కూడా ఇటువంటి అవకాశాలు కల్పించారు.

ఇప్పటివరకు ఉన్న చట్టాల ప్రకారం పిఎఫ్ చట్టం వర్తించాలంటే కనీసం 20 మంది ఉద్యోగులు సంస్థలో పని చేస్తూవుండాలి. దీని వలన చిన్న, మధ్యతరహా పరిశ్రమలు చాలావాటిలో ఉద్యోగులు పిఎఫ్ సదుపాయాన్ని పొందలేకపోతున్నారు. కొత్త లేబర్ కోడ్‌లలో ఈ నియమాన్ని యధాతథంగా కొనసాగి ంచారు.

అంతేగాక, రోజుకు 12 గంటలవరకూ పనిదినాన్ని పొడిగించే అధికారాన్ని ప్రభుత్వా నికి కట్టబెట్టారు. రోజుకు 12 గంటల పాటు పని చేయడం అంటే దాని వలన కార్మికులు భౌతికంగా, మానసికంగా పూర్తిగా శక్తి ఉడిగిపోయి బలహీనపడిపోతారు. "వారంలో 6 రోజుల కన్నా ఎక్కువ పని చేయకూడదు" అని ఓ పక్కన అంటూనే, ఆ తర్వాత వాక్యంలోనే అవసరమైనప్పుడు ఈ నియమాన్ని సవరించే హక్కు ప్రభుత్వానికి ఉంటుంది అని కూడా చేర్చారు.

తోటల కార్మికుల చట్టం, గని కార్మికుల చట్టం, బీడి కార్మికుల సంక్షేమ చట్టం వంటి చట్టాలు ఆయా రంగాలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించడం గతంలో జరిగింది. ఇటువంటి 13 రంగాల ప్రత్యేక చట్టాలరు ఇప్పుడు రద్దు చేశారు. ఆయా రంగాలలో పనికి సంబంధించిన ప్రత్యేకతలను, ప్రత్యేక సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం తప్ప ఇది వేరొకటి కాదు.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య గ్రామీణ ఉపాధి రంగంలో తీవ్రమైన సమస్యలు ఉత్పన్నం కావడానికి దారి తీస్తుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును, దాని స్వరూపాన్ని మొత్తంగా మార్చివేయడానికి కేంద్రం పూనుకుంటోంది.

దీనిని వ్యతిరేకిస్తూ బలమైన నిరసనలు వెల్లువెత్తాయి. ఈ పథకం పేరును సైతం మార్చివేయడం చూస్తే సంఘపరివారానికి మహాత్మా గాంధీ పేరు అన్నా, ఆయన ఆదర్శాలన్నా ఎంత ద్వేషమో వెల్లడౌతోంది. విబి గ్రామ్ జి (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఎండ్ అజీవిక మిషన్, (గ్రామీణ్) పేర ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఉపాధి పథకాన్ని రద్దు చేయడమే దీని లక్ష్యం. ఉపాధిహామీ పథకంలోని మౌలిక లక్ష్యాలను దెబ్బ తీయడం మీద వారు గురి పెట్టారు.

ఈ బిల్లు సారాంశం చూస్తే అది రాష్ట్రా ల మీద చాలా భారీ ఆర్థిక భారాన్ని మోపుతుం దని అర్థమౌతోంది. కూలీలు కోరుకున్న మేరకు వారికి ఉపాధి కల్పించడం అనే ప్రాతిపదిక నుండి ప్రభుత్వానికి కుదిరిన మేరకు మాత్రమే ఉపాధి కల్పించే ప్రాతిపదికకు మార్పు చేశారు.

ప్రస్తుతం అమలులో ఉన్న పద్ధతి ప్రకారం అయితే, నిరుద్యోగులు పని కోరిన మేరకు ఆ ప్రకారం వారికి పని కల్పించడం జరుగుతోంది. దీనిని మార్చివేసి కేంద్ర ప్రభుత్వం ముందుగానే నిర్ణయించుకున్న మేరకు ఆయా రాష్ట్రాలకు కొంత కేటాయింపు జరుపుతుంది.

**ప్రస్తుతం**

కేంద్రం ఈ పథకం కింద వేతనాల చెల్లింపు భారాన్ని 100 శాతమూ భరిస్తోంది. మెటీరియల్ ఖర్చులో 75 శాతం భరిస్తోంది. తక్కిన 25 శాతం రాష్ట్రాలు భరిస్తున్నాయి. కొత్త బిల్లు ప్రకారం రెండు రకాల ఖర్చులోనూ కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం చొప్పున భరించాల్సివుంటుంది.

ఒకసారి ఈ బిల్లు చట్టంగా ఆమోదం పొందితే, ఆ తర్వాత కేరళ రాష్ట్రానికి కేంద్రం ఈ పథకం కింద చేసే కేటాయింపులు

గణనీయంగా తగ్గుతాయి. కేంద్రం ఈ పథకం కింద అయ్యే ఖర్చులో కేవలం 60 శాతం మాత్రమే చెల్లిస్తుంది.

ఒక్క కేరళ రాష్ట్రంలో మాత్రమే 50 లక్షల మంది ప్రజలకు నెలవారీ సంక్షేమ పెన్షన్ కింద రూ.2,000 చొప్పున చెల్లిస్తున్నాం. 2011-16 మధ్య కాలంలో యుడిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నెలకు రూ.600 మాత్రమే చెల్లించేవారు. అది కూడా 18 నెలలబకాయి పెట్టారు. మేం అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని పెంచడమే కాకుండా క్రమం తప్పకుండా చెల్లింపులు జరిగేట్టు చేశాం. అసంఘటిత రంగంలో కార్మికుల సంక్షేమం కోసం 30కి పైగా సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశాం. వాటి ద్వారా నిర్మాణ కార్మికులు, మోటారు వాహనాల కార్మికులు దర్జీలు, మత్స్య కార్మికులు వంటి అసంఘటిత రంగాల కార్మికులకు భద్రత కల్పిస్తున్నాం.

ఇక్కడికి వలస వచ్చిన కార్మికులను మేం అతిథులుగా పరిగణిస్తున్నాం. వారికి గౌరవ ప్రదమైన జీవన పరిస్థితులను కల్పించడం కోసం 'ఆవాజ్' అనే బీమా పథకాన్ని, 'అప్నా ఘర్' అనే ఆవాస పథకాన్ని అమలు చేస్తున్నాం. ఇతర రాష్ట్రాల్లోని వలసకార్మికులు పలు రకాల వేధింపులను ఎదుర్కొంటున్నారు. కానీ కేరళలో వారికి పని ప్రదేశంలో, జీవితంలో భద్రత కల్పిస్తున్నాం. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సమాంతరంగా పట్టణాల్లో అయ్యంకలి పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నాం.

కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని బలహీనపరచడానికి పలు నిబంధనలను ప్రవేశపెట్టింది. ఆధార్-ఆధారిత చెల్లింపులు, ప్రతీ రోజూ రెండు సార్లు డిజిటల్ హాజరు వంటి నిబంధనలు తీవ్ర సంక్షోభానికి దారి తీస్తున్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయి. వృద్ధులైన కార్మికులకు ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో ప్రవేశం లేదు. దానివలన వారికి ఉపాధి నిరాకరించబడు తోంది. కూలీలకు పని దొరక్కుండా చేయడం కోసం మనం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇలా ఉపయోగించడం తప్పు.

కేరళ రాష్ట్ర శాసన సభలో కార్మిక వ్యతిరేక అంశాలను వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ఆమోదించాం. త్రైపాక్షిక చర్చల ద్వారా, ప్రజాస్వామ్యయుత సంప్రదింపుల ద్వారా మాత్రమే కార్మిక విధానాలను రూపొందించాలి అన్నది రాష్ట్ర ప్రభుత్వ వైఖరి. కేంద్రం రుద్దుతున్న లేబర్ కోడ్‌ల కారణంగా నష్టపోయే కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర పరిధిలో

" కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని బలహీనపరచడానికి పలు నిబంధనలను ప్రవేశపెట్టింది. ఆధార్-ఆధారిత చెల్లింపులు, ప్రతీ రోజూ రెండు సార్లు డిజిటల్ హాజరు వంటి నిబంధనలు తీవ్ర సంక్షోభానికి దారి తీస్తున్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయి. వృద్ధులైన కార్మికులకు ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో ప్రవేశం లేదు. దానివలన వారికి ఉపాధి నిరాకరించబడు తోంది. కూలీలకు పని దొరక్కుండా చేయడం కోసం మనం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇలా ఉపయోగించడం తప్పు. "




ఎటువంటి భద్రత లేని గిగ్ వర్కర్లు

అవసరమైన చట్టాలను రూపొందించడానికి సిద్ధంగా ఉన్నాం.

కేంద్ర ప్రభుత్వం ఈ కొత్త చట్టాలను వెనక్కి తీసుకోవాలి. వాటి వలన రాష్ట్రాలమీద పెను ఆర్థిక భారం పడుతుంది. ఆ చట్టాలు వెనక్కి

పోవాలంటే అందుకు బలమైన నిరసన లు వెల్లువెత్తాలి. రైతాంగం తీవ్ర స్థాయిలో పోరాడిన తర్వాత మూడు నల్ల రైతు చట్టాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవలసివచ్చింది. ఆ చట్టాల ద్వారా కేంద్రం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించదలచింది. దాని వలన రైతులు, వ్యవసాయకూలీలు దెబ్బ తింటారు. అటువంటి చట్టాలను నిరసనల ఫలితంగా రద్దు చేయక తప్పలేదు.


ఎరువులపై సబ్సిడీలను తగ్గించివేశారు. రైతులకు కనీస మద్దత్తు ధర కల్పించడంలో విఫలమయారు. దాని వలన గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం బాగా పెరిగింది. జాతీయ స్థాయిలో వెల్లడౌతున్న ఈ ధోరణులకు భిన్నంగా ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను కేరళ ముందుకు తెచ్చింది. నయా-ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయం ఉందని దీనివలన రుజువైంది.

కేంద్ర ప్రభుత్వం తన పెట్టుబడులను ఉపసంహరించుకుని అమ్మకానికి పెట్టాలని చూసిన హిందూస్తాన్ న్యూస్‌ప్రింట్ లిమిటెడ్ కంపెనీని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. పెట్టుబడిదారీ సంక్షోభంలో చిక్కుకున్న ఆ సంస్థను పరిరక్షించింది.

కార్మికవర్గపు ప్రతిఘటనా శక్తిని నాశనం చేసే లక్ష్యంతో ఒక కొత్త ఫాసిస్టు ధోరణి ముందు కొచ్చింది. తద్వారా కార్పొరేట్ల అంతులేని లాభాల వేటకు తోడు నిలుస్తోంది. అదే సమయంలో ఈ నయా-ఫాసిజం తలెత్తడం అనేది చూస్తే పెట్టుబడిదారీ వ్యవస్థే తను సృష్టించుకున్న వైరుధ్యాలలో కూరుకుపోతోందని, దాని నుంచి తప్పించుకోడానికే ఈ నయా-ఫాసిస్టు పద్ధతులకు పాల్పడుతోందని స్పష్టమౌతోంది.

నేడు దేశంలోని సంఘటిత ఉద్యమం ఆత్మరక్షణ భావం నుండి బైట పడాలి. ఈ లేబర్ కోడ్లను ఓడించడానికి జరిపే పోరాటం కేవలం ఒక ప్రతిఘటన మాత్రమే కాకూడదు. అది మరింత ధాటిగా పురోగమించి ఈ వ్యవస్థనే మార్చివేసే ఉద్యమంగా బలపడాలి. శ్రామిక ప్రజానీకంలో సమిష్టి శక్తిని, నవ చైతన్యాన్ని పెంపొందించే విధంగా సమరశీల పోరాటాలు జరగాలి. ప్రస్తుత సంక్షోభ పరిస్థితు లలో ఇదే ప్రధానం. పెట్టుబడిదారీ విధానం లోతైన సంక్షోభంలో కూరుకుపోతోంది. అందునుంచి ప్రత్యామ్నాయ సామాజిక, ఆర్థిక విధానాలు తలెత్తే అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. వాటిని కీలకంగా గుర్తించి సామాజిక మార్పు దిశగా ప్రజా చైతన్యాన్ని ఉన్నత స్థాయికి కొనిపోవడమే మన కర్తవ్యం.

**(అనువాదం: ఎం.పద్మజ)**




# కార్మిక హక్కులు కాలరాసే 'లేబర్ కోడ్'లు

దీపక్ భలేరావు

(రచయిత ట్రేడ్‌యూనియన్ రంగంలో ఐదు దశాబ్దాలుగా పని చేస్తు న్నారు. పలు పారిశ్రామిక ట్రిబ్యునళ్లు, లేబర్ కోర్టుల్లో కార్మి కుల పక్షాన ప్రాతినిధ్యం వహించా రు.)

భారత కార్మికోద్యమం 1925 నుండి అనేక పోరాటాలను నిర్వహించింది. ఆ ఉద్య మం స్వతంత్ర భారతానికి పూర్వం, అనంతరం పలు కార్మిక అనుకూల లేబర్ చట్టాలను రూపొందించేందుకు ప్రభుత్వంపై వత్తిడి చేసింది. విజయం సాధించింది. కానీ శతాబ్ద కాలంపాటు కార్మికులు శ్రమించి సాధించుకున్న ఈ హక్కులను కాలరాసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నించింది. కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను ప్రవేశ పెట్టింది.

### నాలుగు నూతన లేబర్‌కోడ్‌ల వాస్తవికత ఏమిటి?

మొదటిది. 2019 వేతనాల కోడ్. అది – వేతనాలు చెల్లింపు చట్టం, 1936; కనీస వేతన చట్టం, 1948; బోనస్ చెల్లింపు చట్టం, 1965; సమాన వేతన చట్టం, 1976ల కలబోతగా రూపొందింది.

రెండవది. పారిశ్రామిక సంబం ధాల కోడ్, 2020. అది – ట్రేడ్‌యూనియన్ చట్టం, 1926; పారిశ్రామిక ఉపాధి చట్టం, 1946; పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లతో కలిపి రూపొందించబడింది.

మూడవది. వృత్తి పరిరక్షణ, ఆరోగ్య పని నిబంధనల కోడ్, 2020. ఈ కోడ్ – ఫ్యాక్టరీల చట్టం, 1948; ప్లాంటేషన్ లేబరు చట్టం,1951; గనుల చట్టం, 1952; మోటార్ రవాణా కార్మిక చట్టం, 1961; బీడీ మరియు సిగార్ కార్మిక చట్టం, 1966లలోని కొన్ని క్లాజలను కలగలిపి తేబడింది. వాటితో పాటు ఇదే కోడ్‌లో...కాంట్రాక్టు లేబరు చట్టం, 1970; ది సేల్స్ ప్రమోషన్ ఉద్యోగుల చట్టం,1976; అంతర రాష్ట్ర వలస పనివారల చట్టం, 1979; సినీ కార్మికులు మరియు సినిమా థియేటర్ల కార్మిక చట్టం,1981; డాక్ వర్కర్స్ చట్టం, 1986; భవనము ఇతర నిర్మాణ కార్మిక చట్టం,1996 కూడా చొప్పించబడ్డాయి.

నాలుగవది. సామాజిక పరిరక్షణ కోడ్, 2020. ఈ కోడ్, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ చట్టం, 1952; ఉద్యోగుల స్టేట్ బీమా చట్టం, 1948; ది ఎంప్లాయిమెంట్ ఎక్చేంజి చట్టం, 1959; ప్రసూతి ప్రయోజనాల చట్టం, 1961; గ్రాట్యుటీ చెల్లింపు చట్టం,1972; సినీ కార్మి కుల సంక్షేమ నిధి చట్టం,1981; భవన నిర్మా ణ కార్మిక చట్టం, 1996; అసంఘటిత రంగం కార్మికుల సామాజిక భద్రతా చట్టం, 2008 లలోని పలు క్లాజులు కలగలిపి ఏర్పాటయింది.

కార్మికుల డిమాండ్లు : 1925 నుండి కార్మికులు పోరాటాల ద్వారా అనేక హక్కులను సాధించుకున్నారు. అయితే వాటికి కొన్ని పరిమి తులు కూడా ఉన్నాయి. 1965 నుండి వార్షిక వేతనం లేదా జీతంలో బోనస్ 8.33శాతానికి పరిమితం చేశారు. కొత్త కార్మిక కోడ్‌లలో ఆ పరిమితిని 12 శాతానికి పెంచా లని కార్మిక సంఘాలు డిమాండుచేశాయి. గతంలో ఒక ఫ్యాక్టరీ మూసివేత లేదా లే- ఆఫ్ చేసిన సందర్భంలో సంవత్సరానికి 15 రోజుల చొప్పున పరిహారంచెల్లించ వలసివుం డేది. కార్మిక సంఘాలు, ఆ పరిహారాన్ని సంవత్సరా నికి కనీసం 30 రోజులకు చెల్లించా లని డిమాండ్ చేశాయి. కార్మికుల ప్రయోజనం కోసం ఇంకా అనేక ఇతర డిమాండ్లను కూడా చేశాయి.

అదేవిధంగా, 5 సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపు గణనను సంవత్సరానికి 15 రోజుల వేతనం రేటు నుండి 30 రోజుల వేతనానికి పెంచాలనేది మరొక డిమాండ్. అలాగే, ట్రేడ్ యూనియన్లకు గుర్తిం పును రహస్య బ్యాలెట్ ద్వారా నిర్ణయించాలని డిమాండ్ చేశాయి. ఒక యూనిట్‌లో ఒక్క కార్మికుడు పనిచేస్తున్నప్పటికీ, ఆ సంస్థ కార్మిక చట్టాల పరిధిలోకి రావాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కానీ కొత్త లేబర్ కోడ్ల ప్రకారం ఒక సంస్థ కనీసం 40 మందికి ఉపాధి కల్పిస్తేనే ఆ సంస్థలో కార్మిక చట్టాలు అమల్లోకి వస్తాయి.

ఇంకా, కార్మిక సంఘాలు ఇండియన్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఒ) నిర్వచించిన విధంగా, గృహ కార్మికులకు కార్మిక హోదాను కోరుతున్నాయి. కార్మికులు, యజమానుల మధ్య జరిగే పోరులో, ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం నిలబడాలని కూడా కోరుతున్నాయి. ప్రభుత్వం, ఒక వైఖరి తీసుకొని కార్మికులకు న్యాయం చేయడానికి జోక్యం చేసుకోవాలని అవి డిమాండుచేస్తున్నాయి.

వీటితోపాటు, ప్రతి సంస్థలో కార్మిక చట్టాల అమలును తప్పనిసరి చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను శాశ్వత కార్మికులుగా నియమించాలని కార్మిక సంఘాలు పట్టుబట్టా యి. ప్రభుత్వ రంగంలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని కోరాయి. కానీ కొత్త లేబర్ కోడ్‌లు ఈ డిమాండ్లలో దేనినీ పరిగణనలోకి తీసుకోలేదు. మోడీ ప్రభుత్వం మొత్తం 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించింది. కార్మిక సంఘాలు చేసిన ప్రగతిశీల డిమాండ్లు అన్నింటినీ విస్మరించింది.

### భాగస్వాములతో ఎలాంటి సంప్రదింపులూ లేవు

గతంలో ప్రభుత్వం, యజమానుల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి కూర్చొని కొత్త చట్టాల ముసాయిదాను రూపొం దించేవారు. కానీ 2015 నుండి, ఈ త్రైపాక్షిక వ్యవస్థను మోడీ ప్రభుత్వం వదిలేసింది. కొత్త కార్మిక కోడ్‌లతో సహా, ఏ ఇతర కార్మిక చట్టాలకు సంబంధించి 2015 నుండి ఒక్క సమావేశం కూడా జరపలేదు.

కార్మికులు, తాము ఎదుర్కొంటున్న అన్యాయాలను ఇంకేమాత్రమూ భరించలేని

స్థితికి చేరారు. దానితో వారు మొదట ఐక్యమైనారు. తర్వాత అనేక దశాబ్దాలుగా అనేక కష్టనష్టాలను ఎదిరించి కార్మిక సంస్థలు నిర్మించబడ్డాయి. అందుకే 1926 నుండి ఏడుగురు కార్మికులు చేతులు కలిపినా కూడా యూనియన్ ఏర్పాటు చేసుకోవచ్చన్న నిబంధన సాధించబడింది. ఇప్పుడు కొత్త లేబరు కోడ్‌లు, "మొత్తం కార్మికుల సంఖ్యలో కనీసం 10 శాతం లేదా 100 మంది కార్మికులు (ఏది తక్కువైతే అది) లేకుండా, ఒక సంస్థ యొక్క విభాగంలో కార్మిక సంఘాలు ఏర్పాటు చేయబడవు" అని ప్రకటిస్తున్నాయి. దానితో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుడి ప్రాథమిక హక్కును దెబ్బ తీసింది.

ఈ ప్రక్రియ భారత రాజ్యాంగం నిర్వచించిన "సంఘటితమయ్యే" ప్రాథమిక హక్కుకు పూర్తిగా విరుద్ధమైనది. దీనివల్ల కొత్త కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడానికి అనుమతి లభించదు. కార్మికులు తమంతట తామే తమ సమస్యలను పరిష్కరించుకోవలసి వస్తుంది.

**కార్మికులకు కాదు,**
**పారిశ్రామికవేత్తలకే అనుకూలం**

"పారిశ్రామిక సంబంధాల కోడ్"అనే పేరు కూడా.. ఇది కార్మికుల సంక్షేమం కోసం కాదని, పారిశ్రామికవేత్తలను సంతోషపెట్టేందుకే రూపొందించబడిందని స్పష్టంచేస్తున్నది. 1925 నుండి 2025 వరకు 100 సంవత్సరాల పాటు అమలులో ఉన్న కార్మిక చట్టాలు యజమానికీ, కార్మికుడికీ మధ్యగల వాస్తవ ఘర్షణను బట్ట బయలు చేశాయి. కానీ దానిని "పారిశ్రామిక సంబంధాల కోడు"గా బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం మార్చింది. తద్వారా, కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసింది.

మోడీ ప్రభుత్వం, కార్మిక చట్టాల విధాన నిర్ణయాలు తీసుకునే విషయంలో అతిపెద్ద మార్పు తెచ్చింది. ఇకపై, కార్మిక చట్టాల సూక్ష్మ వివరాలపై నిర్ణయాలను ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కాకుండా, 'ఉన్నత అధికార గణం' తీసుకుంటుంది. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి. ఉన్నత అధికార గణం తప్పనిసరిగా ఆనాటి ప్రభుత్వానికి విధేయత చూపడానికి ప్రయత్నిస్తారు. ఎన్నికైన ప్రతినిధులు చట్టాలలో మార్పులు చేసి, సవరణలు సూచించి, శాసనసభలలో వాటిని వ్యతిరేకించవచ్చు లేదా సమర్థించవచ్చు. కానీ ఇకపై, చట్టాలు ఉన్నత అధికారుల కార్యాలయాలల్లోనే రూపొందించబడతాయి. ఫలితంగా చర్చలు, సంప్రదింపుల ప్రాథమిక భావన కనుమరుగవుతుంది.

> **"గతంలో ప్రభుత్వం, యజమానుల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు కలిసి కూర్చొని కొత్త చట్టాల ముసాయిదాను రూపొం దించేవారు. కానీ 2015 నుండి, ఈ త్రైపాక్షిక వ్యవస్థను మోడీ ప్రభుత్వం వదిలేసింది. కొత్త కార్మిక కోడ్‌లతో సహా, ఏ ఇతర కార్మిక చట్టాలకు సంబంధించి 2015 నుండి ఒక్కసమావేశం కూడా జరపలేదు."**




కీలకమైన చట్టాలను పార్లమెంటులో బలవంతంగా ఆమోదింపజేస్తున్న ధోరణి ఇటీవల పెరిగింది. దానికి అనుగుణంగా, కొత్త "కార్మిక కోడ్"లను లోక్‌సభలో కేవలం 20 నిమిషాల్లోనే ఆమోదం పొందగల్గారు.

**సమ్మెలను అడ్డుకునే నిబంధనలు**

కొత్త 'కార్మిక కోడ్'లతో ఉన్న మరో సమస్య ఏమిటంటే, అవి కార్మికుల 'సమ్మె ఆయుధాన్ని' నాశనం చేస్తాయి. సాధారణంగా సమ్మెను చివరి అస్త్రంగా చూస్తారు. కార్మికుల డిమాండ్లను పదే పదే విస్మరించినప్పుడు మాత్రమే వారు అత్యవసర సేవల్లో మినహా సమ్మె చేసే అవకాశం ఉండేది. 1968 నాటి 'అత్యవసర సేవల నిర్వహణ చట్టం' రవాణా, ఆరోగ్య సంరక్షణ, పోలీసు, అగ్నిమాపక సేవలు వంటి ప్రభుత్వ సేవలకు వర్తిస్తుంది. కానీ కొత్త కార్మిక కోడ్‌లను అమలులోకి తీసుకురావడంతో, ఏ కార్మికుడూ సమ్మె చేయరాదని మోడీ ప్రభుత్వం నిర్ధారించుకుంది.

ఇప్పుడు, సమ్మెకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాలి. ఆ 14 రోజులలోపు కార్మిక శాఖ కార్మికుల డిమాండ్లపై విచారణ జరిపితే, అప్పుడు సమ్మె చేయడానికి వీలు లేదు. అలాగే, డిమాండ్లపై కోర్టు విచారణ పెండింగ్‌లో ఉంటే, మళ్లీ సమ్మెకు అనుమతి లేదు. ఇవన్నీ సమ్మెలను నిరోధించడానికి ఉద్దేశించిన మార్గాలు తప్ప మరొకటి కాదు. ఒకవేళ కార్మిక సంఘాలు ముందుకెళ్లి సమ్మెకు పిలుపునిస్తే, కొత్త చట్టాల ప్రకారం, అందులో పాల్గొన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. ఇది కార్మికులను నిస్సహాయులుగా మార్చేస్తుంది. వారిని నిస్సహాయ స్థితికి నెట్టేస్తుంది. ఇప, వారు సంవత్సరాల తరబడి కొనసాగే కోర్టు కేసులలో చిక్కుకునే ప్రమాదంలో చిక్కుకుంటున్నారు.

కొత్త చట్టాలు అనేక ఆంక్షలను కూడా విధించాయి. ఇప్పుడు, "సమ్మె" అనే పదాన్ని 50 శాతానికి పైగా కార్మికులు సెలవు తీసుకునే పరిస్థితిగా పునర్నిర్వచించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలలో పాల్గొనకుండా కార్మికులను ఇప్పుడు నిషేధించారు. నామమాత్రపు నిరసనగా ఇతరుల సమ్మెలలో పాల్గొనడం కూడా ఇకపై అనుమతించబడదు. ఈ చట్టాలతో సమ్మెకు సంబంధించిన ఇతర అన్ని మార్గాలను కూడా రద్దు చేశారు. ఇది యజమానులకు పూర్తి పైచేయినిస్తుంది, ఫలితంగా కార్మికుల హక్కులు, విశేషాధికారాలు విస్మరించబడతాయి.

**ఉద్యోగ భద్రత, రక్షణలు క్షీణించాయి**

కొత్త కార్మిక చట్టాలు ఉద్యోగ భద్రతపై కూడా తీవ్ర ప్రభావం చూపాయి. గతంలో,

> “ ట్రేడ్ యూనియన్లు చూస్తూ కూర్చోరాదు. వాటి పోరాట చరిత్ర సుదీర్ఘమైనది, గంభీరమైనది. 1920వ దశకంలో, భారతదేశంలోని కార్మికులందరూ ఏకమై తమ హక్కుల కోసం పోరాడాలనే ఉద్దేశ్యంతో “అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్”ను స్థాపించుకున్నారు. అప్పట్లో, మిల్లుల యజమానులకు బ్రిటిష్ ప్రభుత్వం నుండి విస్తృత మద్దతు లభించేది. నేడు, యజమానులకు మోడీ ప్రభుత్వం నుండి కూడా అలాంటి మద్దతు లభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో, ట్రేడ్ యూనియన్లు అన్నీ చేతులు కలపాలి. ”

100 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులతో ఒక పరిశ్రమను ఏర్పాటు చేస్తే, ఉద్యోగాల తొలగింపులు జరిగినా లేదా సంస్థ మూతబడినా కార్మికులకు రక్షణ ఉండేది. కార్మికులందరికీ పరిహారం, ప్రయోజనాలు లభించేవి. కొత్త 'కార్మిక కోడ్'ల ప్రకారం, ఇది 300 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులున్న కంపెనీలకు మాత్రమే వర్తిస్తుంది. ఇది స్పష్టంగా కార్మికుల ప్రయోజనాలకు నష్టదాయకంగా ఉంది. అందుకే, ట్రేడ్ యూనియన్లు ఈ విధానాన్ని పాత 100 మంది కార్మికుల పరిమితికి మార్చాలని డిమాండ్ చేశాయి. కానీ మోడీ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పట్టించుకోలేదు. దీనివల్ల కంపెనీలలో ఉపాధి పెరుగుతుందన్న సాకులు చెబుతున్నారు. కానీ అది జరిగే అవకాశం లేదు.

'పర్మిట్ రాజ్' ముగిసిన తర్వాత కార్మికుల భద్రత, రక్షణను యజమానులే చూసుకుంటారని గొప్పగా ప్రచారంచేశారు. కానీ గత ఐదేళ్ల డేటాను పరిశీలిస్తే, 'బాయిలర్ పేలుళ్ల' వంటి ఎన్నో దుస్సంఘటనలు జరిగాయి. వాటిలో బాధిత కార్మికులకు పరిహారం లభించలేదు. ఇప్పుడు, మోడీ ప్రభుత్వం యజమానులకు అనుకూల చర్యలను మరింత సులభతరం చేసింది. కొత్త కార్మిక చట్టాల ప్రకారం, వారు మొదటిసారి చేసిన నేరం అయితే, యజమాని తనపై విధించిన జరిమానాలో కేవలం 50 శాతం చెల్లించి తప్పించుకోవచ్చు. కార్మికుల భద్రత, రక్షణకు సంబంధించిన అన్ని రకాల సమస్యల నుండి తమ బాధ్యత నుండి తప్పించుకునేందుకు యజమానులకు ఇది ఒక లొసుగుగా ఉపయోగపడుతుంది. కాబట్టి, ఇకపై స్థానిక కార్మిక అధికారులతో మంచి సంబంధాలున్న యజమానులు, ప్రతి నేరాన్ని మొదటిదిగా చిత్రీకరించి తప్పించుకుంటారు.

మోడీ ప్రభుత్వం కొత్త 'కార్మిక కోడ్'లతో కార్మికుల భద్రత, రక్షణ నిబంధనలను బలహీనపరచింది. అంతేగాక, “సమాన పనికి సమాన వేతనం” గురించి కూడా పరిపాలనా విభాగం చాలా హడావిడి చేస్తోంది. కానీ, 'సమాన పనికి –సమాన వేతనం' డిమాండుపై ఉద్యోగుల స్వభావం, ఉద్యోగ ప్రొఫైల్ విషయంలో, అది కేవలం లింగ ఆధారిత సమానత్వానికి మాత్రమే పరిమితం చేయబడింది. కాంట్రాక్ట్ కార్మికులు, శాశ్వత కార్మికుల మధ్య వేతన సమానత్వం సంగతేమిటి? కాంట్రాక్ట్ కార్మికుడు, శాశ్వత కార్మికుడితో సమానమైన పని చేస్తుంటే, ఇద్దరికీ సమాన వేతనం ఇవ్వాలి. కానీ కొత్త చట్టాలు దీన్ని గురించి ఒక్క మాట కూడా మాట్లాడవు. కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో, కొత్త కార్మిక చట్టాలు యజమానులకు తప్పించుకునే మార్గాన్ని సృష్టించాయి. మోడీ ప్రభుత్వం “స్థిర–కాల(ఫిక్స్‌డ్ టరమ్) కాంట్రాక్టు అనే కొత్త పదాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పుడు, ఒక కార్మికుడి ఉద్యోగ కాల పరిమితి ఎంత ఉండాలనే దానిపై యజమానులదే తుది నిర్ణయం. అది 1 నెల, 1 రోజు లేదా 11 నెలలు కావచ్చు. పని ప్రదేశంలో, కొత్త కార్మిక చట్టాలు కార్మికుల భద్రతాపరమైన బాధ్యత నుండి తప్పించుకునేందుకు యజమానులకు లొసుగులను అందిస్తాయి.

మోడీ ప్రభుత్వం 'కొత్త గ్రాట్యుటీ నియమాలు' గురించి కూడా ప్రచారం చేస్తోంది. 'గ్రాట్యుటీ ' అనే పదం ప్రాథమికంగా కార్మికుణ్ణి వృద్ధాప్యంలో ఆదుకునే 'నిధులకు హామీ' ఇచ్చేదిగా నిలుస్తుంది. ఇప్పుడు, కార్మికులు ప్రతి 11వ నెలకు గ్రాట్యుటీని పొందినట్లయితే, వారు వృద్ధాప్యానికి చేరుకునే ముందు ఆర్థిక హామీని పూర్తి చేస్తారు. ఇది 'వ్యాపార సౌలభ్య చర్య'గా ప్రశంసించ బడుతోంది, కానీ వాస్తవానికి ఇది కార్మికులను సులభంగా దోపిడీ చేయడానికి వీలు కల్పిస్తుంది.

కొత్త కార్మిక కోడ్‌లను కార్మికుల సంక్షేమంలో ఒక విప్లవాత్మక చర్యగా కీర్తిస్తున్నారు. కానీ వాస్తవానికి అవి కాలాన్ని వెనక్కి నెడుతున్నాయి. పరిశ్రమను స్థాపించడానికి యజమానులకు 'సింగిల్ విండో సిస్టం' వంటి సౌకర్యాలు లభిస్తున్నాయి. అలాంటి ఈ రోజుల్లో, కార్మికులు తమ భవిష్య నిధి, గ్రాట్యుటీ, బకాయిల చెల్లింపు, బోనస్ హక్కు మొదలైన వాటి కోసం కార్యాలయాల చుట్టూ తిరగవలసి వస్తోంది. మోడీ ప్రభుత్వ చట్టాలు కార్మికులకు కష్టాలను పెంచాయి.

### ఇది సమైక్యంగా కదలాల్సిన సమయం

ట్రేడ్ యూనియన్లు నిష్క్రియగా కూర్చుని జరుగుతున్నదంతా చూస్తూ ఉండరాదు. వాటి పోరాట చరిత్ర సుదీర్ఘమైనది, గంభీరమైనది. 1920వ దశకంలో, భారతదేశంలోని కార్మికులందరూ ఏకమై తమ హక్కుల కోసం పోరాడాలనే ఉద్దేశ్యంతో “అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్”ను స్థాపించుకున్నారు. అప్పట్లో, మిల్లుల యజమానులకు బ్రిటిష్ ప్రభుత్వం నుండి విస్తృత మద్దతు లభించేది. నేడు, యజమానులకు మోడీ ప్రభుత్వం నుండి కూడా అలాంటి మద్దతు లభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో, ట్రేడ్ యూనియన్లు అన్నీ చేతులు కలపాలి. ఈ కొత్త 'కార్మిక కోడ్'లను ఉపసంహరించుకునేలా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలి.

'లేబర్ కోడ్'లు, తక్కువ వేతనాలు మొదలైన వాటికి వ్యతిరేకంగా జూలై 9 సమ్మె 25 కోట్ల మంది కార్మికులను ఏకం చేసింది. దేశంలోని రైతులు ఏకమై ఢిల్లీ సరిహద్దుల్లో తమ పోరాటాన్ని కొనసాగించారు. తమ సుదీర్ఘ పోరాటంతో మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునేలా మోడీ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేశారు. సరుకు రవాణా ట్రక్కుల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు ఏకమై తమపై విధించిన కొత్త నిబంధనలను వెనక్కి తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. అదే స్ఫూర్తితో, ఇప్పుడు దేశ కార్మికులందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

1900వ దశకంలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్‌ను బ్రిటిష్ ప్రభుత్వం బహిష్కరించింది. అప్పుడు, ముంబై (అప్పటి బొంబాయి) కార్మికులు అంతటి బలమైన నిరసన తెలిపారు. వారు ఎనిమిది రోజుల పాటు నగరాన్ని స్తంభింపజేశారు. కార్మికులు, శ్రామికులు కులం, మతం వంటి మతతత్వ రాజకీయాలను, విభజన శక్తులను నిరంతరం అధిగమిస్తూ ఐక్యంగా నిలబడ్డారు. తమ హక్కుల కోసం పోరాడి విజయం సాధించారు. మోడీ ప్రభుత్వ పెట్టుబడిదారీ బంధుప్రీతి విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే సమయం మరోసారి ముందుకొచ్చింది.

**(అనువాదం: సిద్ధయ్య)**

ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం

# లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా 25 కోట్ల కార్మికులను ఏకం చేసిన జూలై 9 సమ్మె



రచయిత జర్నలిస్టు. పత్రికలకు వ్యాసాలు రాస్తుంటారు

**వేదాంత్ లఖేరా**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్ల రద్దు, కనీస వేతనం రూ.26,000 అమలు, ఉపాధి కల్పన వంటి డిమాండ్లతో జూలై 9న దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెకు 25 కోట్ల మంది కార్మికులు సంఘీ భావం ప్రకటించారు.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో బంద్‌ను తలపించే పరిస్థితి నెలకొంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ 2019-20లో తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో పాటు తమ 17 డిమాండ్లకు మద్దతుగా 10 కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపు మేరకు జరిగిన సమ్మె కార్మిక వ్యతిరేక విధానాలపై పెరుగుతున్న అసంతృప్తికి స్పష్టమైన ప్రతి బింబంగా నిలిచింది.

**'సంస్కరణల' పేరుతో కార్మిక హక్కుల హననం**

2019--20లో కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ తీసుకువచ్చిన నాలుగు కార్మిక కోడ్ల ద్వారా, ఇప్పటివరకు అమల్లో ఉన్న 44 కార్మికచట్టాల్లో 29చట్టాలను ఏకీకృతం చేసి కార్మికుల హక్కులు, భద్రతలను తీవ్రంగా బలహీన పరిచిందని కార్మిక సంఘాలు విమర్శించాయి. 17 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గతేడాది కేంద్ర కార్మికమంత్రి మన్‌సుఖ్ మాండవీయాకు సమర్పించినా, కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందని సంఘాలు స్పష్టం చేశాయి. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ నిర్మూలన, ఉపాధి కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఐఎన్‌టియుసి, సిఐటియు, ఎఐటియుసి సహా ప్రధాన కార్మిక సంఘాలు విమర్శించాయి.

**గ్రామీణ భారతదేశంలో విస్తృత స్పందన**

జూలై 9న దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక సమ్మెకు గ్రామీణ భారతదేశంలో విశేష స్పందన లభించింది. జిల్లా, పట్టణ, మండల స్థాయిల్లో నిరసనలు జరిగాయి. అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అస్సాం, బీహార్, ఝార్ఖండ్, తమిళనాడు, పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, కర్ణాటక, గోవా, మేఘాలయ, మణిపూర్ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరిలో కూడా సాధారణ జీవనం స్తంభించింది.

**రైతు సంఘాల సంపూర్ణ మద్దతు**

సంయుక్త కిసాన్ మోర్చా సహా అనేక రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఐ(ఎం) నేత ఇంద్రజీత్ సింగ్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి, ఆలస్యం చేస్తే పోరాటాలు మరింత ఉధృత మవుతాయని హెచ్చరించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగంతో నలిగిపోతున్న అన్ని వర్గాలను ఉద్యమంలో భాగం చేసి, రాబోయే రోజుల్లో మరింత పెద్ద, దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధమవ్వాలని కార్మిక నాయకులు పిలుపునిచ్చారు.

**బీజేపీ అనుబంధ బీఎంఎస్ దూరం**

ఆర్ఎస్ఎస్‌కు అనుబంధమైన భారతీయ మజ్దూర్ సంఘ్ ఈ సమ్మెకు దూరంగా నిలిచింది. దీనిని "రాజకీయ ప్రేరేపిత సమ్మె" గా అభివర్ణిస్తూ, కార్మికుల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం చేసింది. బీఎంఎస్ నిరసనలో చేరడానికి నిరాకరించడమే కాకుండా దాని అనుబంధ యూనియన్లను కూడా పాల్గొనకుండా ఉండాలని పిలుపునిచ్చింది.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను మార్చి 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్ లను తెచ్చింది. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే 29 కార్మిక చట్టాలు రద్దవుతాయి. ఈ నాలుగు లేబర్ కోడ్స్ 2019, 2020లో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ద్వారా పార్లమెంట్ ద్వారా చట్టబద్ధం చేయబడ్డాయి. ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాది పొడవునా జరిగిన రైతుల నిరసన తర్వాత రద్దు చేయబడిన మూడు వివాదాస్పద చట్టాలు కూడా అదే సమయంలో ప్రవేశపెట్టబడ్డాయి.

ప్రధాన కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కింది స్థాయి కార్మిక వర్గంలో విస్తృతమైన, నిరంతర పోరాటం ఆరంభ దశలో రూపుదిద్దుకోలేకపోయింది. ఉద్యమాలు ప్రధానంగా సంప్రదాయ నిరసనలకే పరిమితమయ్యాయి. ధర్నాలు, అప్పుడప్పుడు పిలుపునిచ్చిన సాధారణ సమ్మెలు, విడివిడిగా జరిగిన ఆందోళనలు మాత్రమే చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం చేపట్టిన సమ్మె చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్లను నేరుగా సవాల్ చేస్తూ, దేశవ్యాప్తంగా సమన్వయంతో సాగుతున్న మొదటి పెద్ద పోరాటంగా ఈ సమ్మె నిలుస్తోంది.

**చెన్నైలో బ్యాంకు ఉద్యోగుల నిరసన**

చెన్నైలో బ్యాంక్ ఉద్యోగులు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అన్నామలైలోని ఎల్ఐసి భవనం ముందు నిరసన ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనలో ఆల్ ఇండియన్ బ్యాంక్

> **❝ దేశవ్యాప్త కార్మిక సమ్మె వివిధ రంగాల కార్మికుల మధ్య వర్గ ఐక్యతను ప్రతిబింబించింది. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలపై పెరుగుతున్న అసంతృప్తికి ఇది ప్రతీకగా నిలిచింది. రాబోయే రోజుల్లో పోరాటాలు మరింత ఉధృతమయ్యే సూచికగా ఈ సమ్మె నిలిచింది.❞**

ఎంప్లాయిస్ అసోసియేషన్, ఆల్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఆల్ ఇండియా అసోసియేషన్ వంటి అనేక యూనియన్ పాల్గొన్నాయి. సమ్మె ఫ్యాషన్ కాదు, కార్మికుడి చివరి ఆయుధం అని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. రమేష్ స్పష్టం చేశారు. వ్యాపారం సులభతరం చేయడం పేరుతో ప్రభుత్వం సమ్మె హక్కును కూడా కత్తిరించడానికి ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. 2020లో ఆమోదించబడిన పారిశ్రామిక సంబంధాల కోడ్‌ను సమ్మె హక్కును నీరు కార్చడం కోసమే ప్రవేశపెట్టారు.

కార్మిక సమ్మె వల్ల గనులు, చమురు, సహజ వాయువు, ఫైనాన్స్, టెలికాం, టెక్స్టైల్, జూట్, రక్షణ రంగం, అంగన్‌వాడీ సేవలతో సహా అనేక రంగాల్లో పని నిలిచిపోయిందని, అనేక ప్రాంతాల్లో మార్కెట్లు మూతపడ్డాయని సిఐటియు మాజీ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ తెలిపారు.


**కనీస వేతనం రూ.26 వేలు డిమాండ్**

నెలకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలన్నది ఈ సమ్మెలో ప్రధాన డిమాండ్లలో ఒకటి. ప్రస్తుతం కాంట్రాక్ట్ కార్మికులకు రూ.15,000 లేదా అంతకంటే తక్కువ వేతనాలతో జీవనం సాగించాల్సి వస్తుంది. పెరుగుతున్న ధరలతో జీవనం సాగించడం అసాధ్యమని కార్మికులు తెలిపారు.

తెలంగాణలో 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కర్ణాటక సహా ఇతర రాష్ట్రాలు కూడా ఇదే దారిలో సాగుతున్నాయని హెచ్చరించారు. శ్రీపెరుంబుదూర్‌లో శాంసంగ్ కార్మికుల సమ్మెపై జరిగిన అరెస్టులను కూడా నిరసనకారులు ఖండించారు.

**జమ్మూ-కాశ్మీర్‌లో అనుమతి రద్దు**

జమ్మూ కాశ్మీర్‌లో సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు, జమ్మూ కాశ్మీర్ సిఐటియు రాష్ట్ర




అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ తరిగామి, నాలుగు కొత్త కార్మిక కోడ్‌ల రద్దు చేసి, కనీస వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జమ్మూ కాశ్మీర్ సిఐటియు జిల్లా పరిపాలనా అధికారి నుండి తగిన అనుమతితో శ్రీనగర్ లోని షేర్-ఇ-కాశ్మీర్ పార్క్ లో ఒక రోజు శాంతియుత నిరసన చేపట్టాలని ప్రణాళిక వేశారు. అయితే ఎటువంటి వివరణ లేకుండా నిరసనకు అనుమతిని, ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు.

**కోచి హైకోర్టు ఆదేశాలు ఉల్లంఘించి సమ్మెకు సిద్ధమయిన రిఫైనరీ కార్మికులు**

కేరళలో హైకోర్టు ఆదేశం ఉన్నప్పటికీ అంబలముగల్, కోచీలోని కోచీ రిఫైనరీ కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. జూలై 9న ప్రారంభమైన రెండు వారాల సమ్మెను ప్రారంభించకుండా కోచీ రిఫైనరీస్ వర్కర్స్ అసోసియేషన్ పై హైకోర్టు నిషేధం విధించింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ దాఖలు చేసిన విజ్ఞప్తికి ప్రతిస్పందనగా ఈ ఆదేశం జారీ చేయబడింది.

**కేంద్రంపై ఎఐసీసీ విమర్శ**

ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తించాలని కోరుతూ ఎఐసీసీ జనరల్ సెక్రటరీ రణదీప్ సింగ్ సుర్జేవాలా అన్నారు. దేశవ్యాప్తంగా అభివృద్ధిని ఆపివేయడం, ఉద్యోగాలు తొలగించడం, ఆర్థిక అస్థిరత పెంచడం లాంటి చర్యలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం సరైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైంది, భారత ప్రభుత్వం, పబ్లిక్ సెక్టర్ ఎంటర్ప్రైజెస్ లోని వివిధ శాఖల్లో 30 లక్షలకు పైగా ఖాళీలు భర్తీ చేయలేదు, సాయుధ దళాల్లో సుమారు 1.55 లక్షల ఖాళీలు, రైల్వే 2.5 లక్షలకు పైగా ఖాళీలు, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ వంటి కేంద్ర సాయుధ పోలీసు దళాలు 85,000 కంటే ఎక్కువ ఖాళీలు ఉన్నాయని సుర్జేవాలా వివరించారు.

మాజీ ఎంపీ, సిఐటియు జనరల్ సెక్రటరీ తపన్ సేన్.. బొగ్గు, ఇతర (ఇనుప ఖనిజం, రాగి, బాక్సైట్, అల్యూమినియం, మాంగనీస్ మరియు బంగారం వంటి) ఖనిజాలు ఫైనాన్స్, పెట్రోలియం, నూనె, గ్యాస్, టెలికాం, టెక్స్టైల్, జ్యూట్, రక్షణ రంగం, అంగన్వాడీ వంటి వివిధ రంగాల కార్మికులకు ఈ సమ్మెలో పాల్గొన్నారని చెప్పారు. సమ్మె పిలుపుకు ప్రతిస్పందనగా చాలా ప్రదేశాల్లో మార్కెట్లు మూసివేయబడ్డాయి. బీహార్లో ప్రతిపక్ష పార్టీలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు నిరసనగా బంద్‌కి పిలుపు నిచ్చాయి.

**కార్మికుల ఐక్యత, ప్రభుత్వానికి హెచ్చరిక**

దేశవ్యాప్త కార్మిక సమ్మె వివిధ రంగాల కార్మికుల మధ్య వర్గ ఐక్యతను, శక్తినీ స్పష్టంగా ప్రతిబింబించింది. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలపై పెరుగుతున్న అసంతృప్తికి ఇది ప్రతీకగా నిలిచింది. రాబోయే రోజుల్లో పోరాటాలు మరింత ఉధృతమయ్యే సూచికగా ఈ సమ్మె నిలిచింది. ఈ సమ్మెను కేవలం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు ప్రతిస్పందనగా మాత్రమే కాకుండా ద్రవ్యోల్బణం, ఉపాధి అవకాశాల తగ్గుదల, కార్మికుల సమిష్టి బేరసారాల హక్కులను నిర్వీర్యం చేయడం వంటి విధానాలపై పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తుందని పలువురు పరిశీలకులు అభిప్రాయపడ్డారు.

**(అనువాదం: కె. హరికిషోర్)**

ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం

# దోపిడీ యజమానుల హక్కు సమ్మె కార్మికుల నేరమా?



రచయిత ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఎఐసిసిటియు) కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి

మైత్రేయి కృష్ణన్

నాలుగు కార్మిక కోడ్‌లను అమలులోకి తీసుకువచ్చే నోటిఫికేషన్లను నవంబర్ 21న కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. 2019-2021 మధ్య పార్లమెంటు ఈ కోడ్‌లను ఆమోదించింది. వలసకాలపు వారసత్వాన్ని తుడిచిపెట్టే 'కార్మిక సంస్కరణలు'గా కేంద్ర ప్రచారం చేసిన ఈ నాలుగు కోడ్‌లు వాస్తవానికి దేశంలో వర్గ సంబంధాలను సమన్వయ పర్చడంలో రాజ్యపు పాత్రను పునర్‌నిర్వచించేవిగా ఉన్నాయి. కార్పొరేట్ ఇండియా ఈ కోడ్‌లను హర్షించడం అవి ఎవరి ప్రయోజనాలకోసం రూపొందించారో సూచిస్తోంది. ట్రేడ్ యూనియన్లు వీటిని కార్మిక వర్గంపై దాడిగా భావిస్తున్నాయి; రాబోయే కాలంలో వీటిపైన ప్రతిఘటన తప్పదన సంకేతాలు ఇప్పటికే వస్తున్నాయి. ఈ కోడ్‌లు పార్లమెంటులో ఆమోదం పొందిన విధానమే ప్రజాస్వామ్య విరుద్ధం కావడం గమనార్హం. నాలుగు కోడ్‌లలో మూడు 2020లో, వ్యవసాయ చట్టాలపై కలకలం నడుస్తున్న సమయంలో చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. ట్రేడ్ యూనియన్లు ఈ ప్రక్రియను నిరంతరం వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే నాలుగు జాతీయ స్థాయి సమ్మెలు నిర్వహించాయి. అయినప్పటికీ, అన్ని అభ్యంతరాలను పక్కనపెట్టి ప్రభుత్వం అమలు నోటిఫికేషన్లను జారీ చేసింది.

కేంద్ర ప్రభుత్వ వాదనలకు కార్పొరేట్ మీడియా మద్దతు కూడా లభిస్తోంది. అయితే, వాస్తవానికి ఆ ప్రచారానికి భిన్నంగా ఈ కోడ్‌లు కార్మిక సంక్షేమానికి కాకుండా కార్మికుల హక్కులపై తీవ్రమైన ప్రభావం చూపుతాయి. క్లుప్తంగా చెప్పాలంటే, ఈ కోడ్‌లు యజమానులకు అధిక స్వేచ్ఛనిచ్చి, కార్మికుల కనీస హక్కులకూ కత్తిరిస్తాయి. ఫలితంగా ఎదురయ్యే దుష్పరిణామాలను కార్మికులే అనుభవించాల్సి వస్తుంది. వీటి నిజమైన ప్రభావాన్ని అర్థం చేసుకోవాలంటే కార్మిక కోడ్‌ల అసలు విషయాలను పరిశీలించాల్సిందే!

కొత్త కోడ్‌ల అమలుతో వచ్చే మౌలిక మార్పు ఏమిటంటే కార్మికులను చట్ట పరిధి నుంచి బయటకు నెట్టడం! సాధారణంగా కార్మిక చట్టాలు వర్తించడానికి ఉద్యోగుల సంఖ్యకు ఒక పరిమితి ఉంటుంది. కొత్త కోడ్‌లు ఆ పరిమితిని పెంచి, మరింత మంది కార్మికులను చట్ట రక్షణకు వెలుపల ఉంచుతున్నాయి. ఫ్యాక్టరీస్ యాక్ట్ (1948) కర్మాగారాల్లో ఆరోగ్యం, భద్రత, సంక్షేమ సదుపాయాలు, పని గంటలు, సెలవులు వంటి అంశాలను నిర్ధారించేందుకు రూపొందించారు. ఈ నిబంధనలు అమలు కావాలంటే విద్యుత్‌తో పనిచేసే సంస్థల్లో కనీసం పది మంది. విద్యుత్ లేకుండా పనిచేసే సంస్థలకు 20 మంది అనే పరిమితిని ఈ చట్టం విధించింది. నూతనంగా రూపొందించిన ఓఎస్‌హెచ్ కోడ్ ఈ పరిమితిని వరుసగా 20, 40కి పెంచింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ ప్రచురించిన పరిశ్రమల వార్షిక సర్వే (2022-23) ప్రకారం 43.2 శాతం కర్మాగారాల్లో 20 మంది కన్నా తక్కువ కార్మికులే ఉన్నారు; ఈ సంస్థల్లోని కార్మికులకు ఇప్పుడు ఈ చట్ట పరిరక్షణ లభించదు.

కార్మికులు, యాజమాన్యం మధ్య సంబంధాలు సహజంగానే అసమానంగా ఉంటాయి. పని నిబంధనలను పూర్తిగా యజమాని ఇష్టానికే వదిలేస్తే, ఏకపక్షమైన, వివక్షతో కూడిన పద్ధతులకు ఆస్కారం లభిస్తుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు 1946లో తీసుకువచ్చిన ఇండస్ట్రియల్ ఎంప్లాయ్‌మెంట్ (స్టాండింగ్ ఆర్డర్స్) యాక్ట్, కనీసం 100 మందికి పైగా కార్మికులు ఉన్న సంస్థలు సర్వీసు నిబంధనలపై స్టాండింగ్ ఆర్డర్స్ రూపొందించి, కార్మికుల వాదనలు విన్న తర్వాత ప్రభుత్వ అధికారుల ధ్రువీకరణ పొందాలనే నిబంధన విధించింది. దీనికి సంబంధించి తాజాగా రూపొందించిన పారిశ్రామిక సంబంధాల (ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ -ఐఆర్ కోడ్) ఈ పరిమితిని 300కి పెంచింది. ఫలితంగా 300 మందికంటే తక్కువ కార్మికులు ఉన్న సంస్థల్లోని కార్మికుల సర్వీసు అంశాలు పూర్తిగా యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటాయి. చట్టాల్లో ఉన్న లోసుగులు యజమానులకే అనుకూలంగా ఉంటాయి.

ఐఆర్ కోడ్ మరో మార్పు కూడా చేసింది. ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్, 1947 ప్రకారం 100 మందికి పైగా కార్మికులు ఉన్న సంస్థలు లే-ఆఫ్, రిట్రెంచ్‌మెంట్ లేదా మూసివేతలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ, ఉపాధి భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ప్రభుత్వ పర్యవేక్షణ తప్పని సరి అని అప్పట్లో భావించారు. తాజాగా ఐఆర్ కోడ్ ఈ పరిమితిని 300కి పెంచింది. 300 మందికి తక్కువ కార్మికులు ఉన్న యూనిట్ల యజమానులు ఇప్పుడు ముందస్తు అనుమతి లేకుండానే ఉద్యోగాలను రద్దు చేయవచ్చు లేదా తమ సంస్థలను మూసివేయవచ్చు. ఇది తమ జీవనాధారాన్ని అకస్మాత్తుగా కోల్పోయే పరిస్థితిలోకి కార్మికులను నెడుతుంది.

కాంట్రాక్ట్ లేబర్ (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్) యాక్ట్, 1970, కాంట్రాక్ట్ వ్యవస్థలోని దోపిడి నుండి కార్మికులను రక్షించేందుకు, కొన్ని పరిస్థితుల్లో అవసరమైతే ఆ విధానాన్ని రద్దు చేసేందుకు, వేతనాలను సకాలంలో చెల్లించేందుకు, ప్రాథమిక సదుపాయాల కల్పనలో యజమాని బాధ్యత వంటి రక్షణ చర్యలను నిర్దేశిస్తుంది. 20 మందికి అధికంగా కార్మికులు పని చేసే అన్ని సంస్థలకు ఆ చట్టం వర్తించేంది. తాజాగా రూపొందించిన ఓఎస్‌హెచ్ కోడ్ ఆ పరిమితిని 50కి పెంచింది.

హక్కులు, అర్హతలు పొందే పరిమితులను పెంచడం ద్వారా కార్మిక కోడ్‌లు కష్టపడి

> **“ పారిశ్రామిక వివాదాల బిల్లుపై 1938లో జరిగిన చర్చలో మాట్లాడిన బిఆర్ అంబేద్కర్ “సమ్మె అనేది స్వేచ్ఛకు మరో పేరు. కోరుకున్న షరతులకు అనుగుణంగా పనులు చేయడం స్వేచ్ఛా హక్కులో భాగమే. ఒకసారి ఆ హక్కును అంగీకరిస్తే సమ్మె హక్కును కూడా ఒప్పుకో వాల్సిందే' అని అన్నారు. కానీ, ఐఆర్ కోడ్ కింద సమ్మె హక్కుపై దాడి పెద్ద ఎత్తున జరుగుతుంది. విధి విధానాల పేరుతో సమ్మెను అక్రమంగా చిత్రీకరిస్తారు. ”**

సాధించిన హక్కులను కార్మికుల నుంచి గుంజుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా లక్షలాది పరిశ్రమలను చట్ట నియంత్రణ వెలుపలే ఉంచుతున్నాయి. ఏ సంస్థలోనైనా పని పరిస్థితులు, చట్టాల అమలు, కార్మికుల సంఘటిత శక్తి, పోరాటాలపై ఆధారపడి ఉంటాయి; ఇవి పెట్టుబడి, శ్రమశక్తుల మధ్య సంఘర్షణ ఫలితంగా ఉంటాయి. అందుకే దేశ వ్యాప్తంగా సంఘటిత కార్మికులకు ఇప్పటికీ కొంత భద్రత ఉంటే, అసంఘటిత రంగంలోని కార్మికులు తీవ్ర దోపిడికి గురి కావడం కనపడుతుంది.

కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ద్వారా రక్షించబడింది. ఈ హక్కుకు ట్రేడ్ యూనియన్స్ యాక్ట్ 1926, చట్టబద్ధ రూపమిచ్చింది. దానిని ఇప్పుడు ఇండస్ట్రియల్ రిలేషన్స్ (ఐఆర్) కోడ్ భర్తీ చేసింది. ఇది రిజిస్ట్రార్‌కు సంపూర్ణ అధికారాలు కట్టబెడుతుంది. 'తనకు అందిన సమాచారం మేరకు' అంటూ యూనియన్ నమోదును రిజిస్ట్రార్ తిరస్కరించవచ్చు. కోడ్‌ను ఉల్లంఘించారని చెబుతూ అప్పటికే ఉనికిలో ఉన్న యూనియన్‌ను రద్దు చేయడంతో పాటు, అయన ఏ చర్యనైనా తీసుకునే అవకాశం ఉంది. పాత చట్టంలోకూడా ఈ తరహా అధికా రం రిజిస్ట్రార్‌కు ఉన్నప్పటికీ ఐఆర్ కోడ్ పరిధి విస్తృతమైనది. ఇది సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేసే సమ్మెలు, ఇతర పారిశ్రామిక సంబంధాలను కూడా నియంత్రి స్తుంది. దీని వల్ల రిజిస్ట్రార్ అధికారాలు అనూహ్యంగా పెరగనున్నాయి.

కార్మికుల డిమాండ్ల సాధన కోసం చట్ట బద్ధంగా చేసే వివిధ కార్యక్రమాలకు హాజరయ్యే యూనియన్ ఆఫీస్ బేరర్లు, సభ్యులకు ఐపిసి 120 (బి) 2 ప్రకారం నమోదయ్యే సివిల్, క్రిమినల్ చర్యల నుండి ట్రేడ్ యూనియన్స్ చట్టం ప్రకారం రక్షణ లభించేది. దీంతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే అవకాశం ట్రేడ్‌యూనియన్ నాయకు లకు లభించేది. తాజాగా రూపొందించిన ఐఆర్ కోడ్‌లో కూడా ఈ రక్షణ కొనసా గించినట్టు కనిపిస్తుంది. కానీ, యూనియన్ గుర్తింపును తిరస్కరించే అధికారాన్ని రిజిస్ట్రార్‌కు కట్టబెట్టడంతో ఆ రక్షణ చట్రం అర్థం లేనిదిగా మారింది. ఒక్కసారి యూనియన్ గుర్తింపు రద్దయితే సభ్యులకున్న ఆ రక్షణ కూడా పోతుంది. దీంతో గుర్తింపు రద్దు బెదిరింపు యూనియన్లను భయపెట్టే ఆయుధంగా మారుతుంది.

కార్మిక కోడ్‌లు సమ్మె హక్కుపై కూడా దాడి చేస్తాయి. నిజానికి కార్మికులకున్న బలమైన శక్తి ఇది. చర్చల్లో ఇది కీలకంకగా పనిచేస్తుంది. యాజమాన్యానికి, కార్మికులకు మధ్య ఉన్న అసమాన సంబంధాల నేపథ్యంలో పని చేయడం నిలిపివేస్తామన్నది కార్మికుల సంఘటిత శక్తిని బలంగా వినిపించే మార్గం. పారిశ్రామిక వివాదాల బిల్లుపై 1938లో జరిగిన చర్చలో మాట్లాడిన బిఆర్ అంబేద్కర్ “సమ్మె అనేది స్వేచ్ఛకు మరో పేరు. కోరుకున్న షరతులకు అనుగుణంగా పనులు చేయడం స్వేచ్ఛా హక్కులో భాగమే. ఒకసారి ఆ హక్కును అంగీకరిస్తే సమ్మె హక్కును కూడా ఒప్పుకో వాల్సిందే' అని అన్నారు. కానీ, ఐఆర్ కోడ్ కింద సమ్మె హక్కుపై దాడి పెద్ద ఎత్తున జరుగుతుంది. విధి విధానాల పేరుతో సమ్మెను అక్రమంగా చిత్రీకరిస్తారు. 1947 నాటి పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం ప్రజా సేవలతో ముడిపడి ఉన్న సర్వీసుల వారు సమ్మె చేయాలనుకుంటేనే ముందస్తు నోటీసు ఇవ్వాల్సిఉంటుంది. ఐఆర్ కోడ్ సేవల లక్షణంతో సంబంధం లేకుండా అన్ని విభాగాల సిబ్బందికి 14 రోజుల ముందస్తు నోటీసును తప్పనిసరి చేసింది. నోటీసు ఇచ్చిన వెంటనే చర్చల ప్రక్రియ లేదా సయోధ్య ప్రక్రియ ప్రారంభ మవుతుంది. ఆ ప్రక్రియ కొనసాగుతున్నంత కాలం సమ్మె నిషిద్ధం. ఫలితంగా సమ్మె హక్కు శూన్యం అవుతుంది. దీనితో పాటు శిక్షలూ పెరిగాయి. 1947 చట్టంలో అక్రమ సమ్మెకు గరిష్టంగా ఒక నెల జైలు లేదా రూ.50 జరి మానా విధించేవారు. ఐఆర్ కోడ్‌లో జరిమా నాను కనీసం రూ.1,000 నుంచి రూ.10,000 రూపాయల వరకు పెంచారు. 'జరిమానా లేదా జైలు' అని పేర్కొన్నారు. రెండింటినీ కలిపి విధించే అవకాశమూ ఉందని కోడ్ తెలిపింది. ఇది కార్మికుల సంఘటిత శక్తిపై దాడి చేసి, వారి గళాన్ని నొక్కి వేయడం తప్ప మరొకటి కాదు.

ఫ్యాక్టరీస్ యాక్ట్ కింద మహిళల నైట్ షిఫ్ట్‌ను నిషేధించారు. తాజా కోడ్‌లలో దానిని అనుమతించిన ప్రభుత్వం మహిళలకు స్వేచ్ఛ ఇచినట్టుగా ప్రచారం చేసుకుంటోంది. నిజానికి ఇది ఏమాత్రం రక్షణ లేని పరిస్థితుల్లో మహిళల శ్రమను దోచుకునే స్వేచ్ఛను యజమానులకు పెంచుతోంది. నిజానికి నైట్‌షిఫ్ట్ మహిళల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తుందని, మానసిక, భావోద్వేగ ఒత్తిడిని పెంచుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. రక్షణ కోసం నియంత్రణ చర్యలను చేపట్టాల్సిన చోట, ఈ కోడ్ దోపిడిని చట్టబద్ధం చేసింది. రాజ్యాంగం లోని ఆర్టికల్ 39 (డి) పురుషులు, మహిళలకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

దీనిని ఈక్వల్ రెమ్యునరేషన్ యాక్ట్, 1976 మరింతగా బలపరిచింది. అయితే, తాజాగా రూపొందించిన 'కోడ్ ఆన్ వేజెస్' (వేతనాల కోడ్) దీనిని తీవ్రంగా దెబ్బతీసింది. పైకి సమాన వేతనాలని చెప్పినా, వేతన నిర్వచనంలో కీలక అలవెన్సులను మినహా యించింది. దీంతో యజమానులకు తమ వివక్షను కొనసాగించే అవకాశం ఉంటుంది. ఇప్పటికే వివక్ష కొనసాగుతున్న కార్మిక మార్కెట్‌లో ఇది పరోక్షంగా దానిని చట్టబద్ధం చేసే ప్రమాదాన్ని కల్పిస్తోంది.

మహిళా కార్మికుల హక్కులకు ప్రసూతి ప్రయోజనాలను తగ్గించడం మరో పెద్దదెబ్బ! మెటర్నిటీ బెనిఫిట్స్ యాక్ట్, 1961ను సోషల్ సెక్యూరిటీ కోడ్‌లో కలపడం ద్వారా 'వేతనం' నిర్వచనాన్ని కుదించారు. వేతనాన్ని విభిన్న తరగతులుగా విడగొట్టి యజమాన్యానికి బాధ్యతల నుంచి తప్పించుకునే అవకాశాన్ని ఇది కల్పిస్తుంది. ఫలితంగా ప్రసూతి ప్రయోజ నాలు భారీగా తగ్గనున్నాయి.

శంక్ ముఖర్జీ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1990)లో సుప్రీంకోర్టు కాంట్రాక్ట్ కార్మికుల విధానాన్ని 'అభివృద్ధి చేసిన బాండెడ్ లేబర్ వ్యవస్థ (ఎక్స్‌టెండెడ్ బాండెడ్ లేబర్) గా అభివృద్ధి చేసింది. 1970 నాటి

ఎనాక్ట్‌మెంట్ ఆఫ్ కాంట్రాక్టు లేబర్ (రెగ్యులరైజేషన్ అండ్ అబాలిషన్) చట్టం ఉన్నప్పటికీ ఉదారవాద ఆర్థిక సంస్కరణల ఫలితంగా కాంట్రాక్టు ఉద్యోగాలు విస్తరించాయి.

'అనుభవం అవసరం లేని' పనులుగా భావించే పారిశుద్ధ్యం, హౌస్‌కీపింగ్, గార్డెనింగ్ తదితర రంగాల్లో కాంట్రాక్టు వ్యవస్థ పెద్ద ఎత్తున కేంద్రీకృతమైంది. ఈ పనులు ఎక్కువగా దళితులతో పాటు సామాజికంగా తక్కువ స్థాయికి చెందిన వారుగా ముద్రపడిన వారే చేస్తుండటం గమనార్హం. కాంట్రాక్ట్ వ్యవస్థలో కనీస వేతనాల చెల్లింపులో జాప్యం, ఆలస్యం, సామాజిక భద్రత లేకపోవడం సాధారణం. ఇది పేదరికాన్ని పెంచి తరతరాలపై ప్రభావం చూపుతుంది. ఈ దోపిడీని ముగించాల్సిన చోట, కార్మిక కోడ్‌లు దానికే చట్టబద్ధత ఇస్తున్నాయి. ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ (ఓఎస్‌హెచ్ కోడ్) 'కోర్ కార్యకలాపాల' నిర్వచనంలోనే కుల, వర్గ పక్షపాతం కనిపిస్తుంది. పారిశుద్ధ్యం, భద్రత, కాంటీన్, లోడింగ్-అన్‌లోడింగ్, హౌస్‌కీపింగ్, లాండ్రీ, గార్డెనింగ్, రవాణా, అంబులెన్స్, నిర్మాణ-నిర్వహణ తదితర పనులను కోర్ కార్యకలాపాల నుండి మినహాయించడం ద్వారా ఈ కోడ్ బాండెడ్ లేబర్‌ను సంస్థాగతం చేస్తుంది.

ఆర్థిక దోపిడీ నివారణకు రాజ్యం జోక్యం అవసరమని, నియంత్రణ లేకపోతే ప్రైవేట్ యజమాని నియంతృత్వం (డిక్టేటర్ షిప్ ఆఫ్ ది ప్రైవేట్ ఎంప్లాయిర్ ) వస్తుందని అంబేద్కర్ తన ప్రసిద్ధ రయన 'స్టేట్స్ అండ్ మైనార్టీస్' లో హెచ్చరించారు. లేబర్‌కోడ్‌లను రూపొందించి, అమలులో తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల తన బాధ్యత నుండి తప్పుకున్నట్లైంది. నిజానికి అంబేద్కర్ దహనం చేసిన మనుస్మృతిని శ్రమ శక్తి నీతి 2025(జాతీయ కార్మిక ఉపాధి విధానం)ముసాయిదాలో ప్రస్తావించారు. ఇది శ్రమను ఒక పవిత్రమైన, నైతిక కర్తవ్యంగా అభివర్ణిస్తుంది. ఈ కోడ్‌లు ఒకవైపు అంబేద్కర్ అభివర్ణించిన ప్రైవేట్ యజమానుల నియంతృత్వానికి దారి తీస్తే, మరోవైపు పేదరికాన్ని పెంచి.. కుల, లింగ అసమానతలను మరింతగా బలపరుస్తాయి.

కార్మిక కోడ్‌లను రాజ్యాంగం ప్రజలకు ఇచ్చే హక్కులను కూల్చే ప్రయత్నంలో భాగంగానే చూడాలి. ఇవి దోపిడీని యజమాని హక్కులుగా, కార్మికుల ప్రతిఘటనను నేరంగా చిత్రీకరిస్తాయి. ఈ వర్గపోరులో ముందడగు వేయడమంటే, యథాతథ స్థితిని మాత్రమే కాకుండా అందరికీ ఉద్యోగాలు, వేతనాలు, సామాజిక భద్రతకు హామీ ఇచ్చే నిజమైన కార్మిక చట్టాలను డిమాండ్ చేయాలి.

(అనువాదం : పొగడ దొరువు)

# శ్రామికవర్గ విముక్తితోనే మహిళా విముక్తి



క్లారా జెట్కిన్


.......చౌకగా లభించే శ్రమశక్తి కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ జరిపే అన్వేషణ, దోపిడీల ఫలితంగానే మహిళా సమస్య అనేది సృష్టించబడింది. ఈ కారణం చేతనే శ్రామిక మహిళ మన కాలంలోని ఆర్థిక చట్రంలో ఇరుక్కుపోయింది. దీని వల్లనే ఆమె కార్ఖానాల్లోకీ, యంత్రాలవద్దకూ తరమబడింది. వేణ్ణీళ్లకు చన్నీళ్ల మాదిరిగా తన భర్త సంపాదనకు తోడ్పడాలనే ఉద్దేశ్యంతో ఆమె ఆర్థిక జీవనంలోకి ప్రవేశిస్తోంది. కానీ పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ఆమెను ఆమె భర్తకు అసమాన పోటీదారుగా మార్చివేస్తోంది. ఆమె తన కుటుంబానికి సౌభాగ్యం తేవాలనుకుంటోంది. కానీ దానికి బదులుగా ఆమె కుటుంబం మరింత బాధల్లో కూరుకుపోతోంది. తన పిల్లలకు మరింత ఆనందకరమైన, సుఖవంతమైన జీవనం ప్రసాదించాలనుకుని శ్రామికమహిళ తను కూడా ఉద్యోగానికి వెళుతోంది. కానీ దానికి బదులుగా ఆమె వారి నుండి దాదాపు పూర్తిగా దూరమైపోతోంది. ఒక శ్రామిక వ్యక్తిగా ఆమె పురుషునితో సమానంగా పనిచేస్తోంది. యంత్రం ప్రవేశించినాక కండర శక్తికి ప్రాధాన్యత లేకుండా పోయింది కనుక పనిలో పురుషునితో సమానంగా మహిళ కూడా ఫలితాలు సాధిస్తోంది. ఇలాంటి స్థితిలో మహిళలు తక్కువ వేతనాలకు దొరుకుతారు గనుక, పైగా పెట్టుబడిదారీ దోపిడీకి ఎప్పుడో మరీ విసిగివేసారిపోతేగానీ సాధారణంగా ఎదురుతిరగకుండా అణిగిమణిగి ఉంటారుగనుక పెట్టుబడిదారులు పరిశ్రమల్లో రానురాను మరింత ఎక్కువగా మహిళలను శ్రామికులుగా తీసుకుంటున్నారు. వీటన్నిటి ఫలితంగా, శ్రామిక మహిళ స్వాతంత్ర్యం పొందింది. కానీ దానికి ఆమె చెల్లించిన మూల్యం మాత్రం చాలా ఎక్కువ, ఇప్పటికిప్పుడు దాని వల్ల ఆమెకు లభించిన ప్రయోజనం చాలా తక్కువ. ఒకప్పుడు కుటుంబంలో భార్యను అదుపులో ఉంచడానికి ఆమె భర్త కొరడాతో కొట్టేవాడైతే, ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ ఆమెను అదుపులో పెట్టడానికి నిత్యం తేళ్లూజెర్రులతో కుట్టిస్తోంది. గతంలో భార్యపై భర్త అధికారం చెలాయించడం అనేది వారి వ్యక్తిగత సంబంధాల ద్వారా జరిగేది. అయితే కార్మికులకూ యజమానికీ మధ్య ఇప్పుడు డబ్బు సంబంధాలు మినహా మరేమీ లేవు. శ్రామిక మహిళ ఆర్థిక స్వాతంత్ర్యమైతే పొందింది, గానీ ఒక మనిషిగా గానీ, ఒక మహిళగా గానీ లేక ఒక భార్యగా గానీ ఆమెకు తన స్వంత వ్యక్తిత్వం అభివృద్ధిచేసుకునే అవకాశం మాత్రం లేకుండా పోయింది. ఒక భార్యగా, ఒక తల్లిగా ఆమెకు మిగిలింది పెట్టుబడిదారీ వ్యవస్థ తినగా వదిలేసిన అన్నం మెతుకులు మాత్రమే.

అందువల్ల శ్రామిక మహిళ విముక్తి పోరాటం అనేది బూర్జువా మహిళలు తమ పురుషులకు వ్యతిరేకంగా చేసే పోరాటం లాంటిది కాదు. దానికి మారుగా, ఆమె తన వర్గానికి చెందిన పురుషులతో కలిసి మొత్తం పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం చేయాలి. మార్కెట్‌లోని సేచ్ఛాయుత పోటీలో పాల్గొనేందుకు తనకు ఎదురైన అడ్డంకులను ఛేదించేందుకుగాను ఆమె తన వర్గానికి చెందిన పురుషులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం లేదు. పెట్టుబడిదారీ దోపిడీ అవసరాలూ, ఆధునిక ఉత్పత్తి సాధనాల అభివృద్ధీ ఆమెను అటువంటి పోరాటం చేయనవసరం లేకుండా చేస్తాయి. దానికి మారుగా, శ్రామిక మహిళలపై దోపిడీకి వ్యతిరేకంగా కొత్త అవరోధాలు సృష్టించాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఒక భార్యగా, ఒక తల్లిగా ఆమె హక్కులను పునరుద్ధరించాలి, శాశ్వతంగా రక్షించాలి. పురుషులతో స్వేచ్ఛగా పోటీ పడటం కాదు, శ్రామికుల రాజకీయ పరిపాలనే ఆమె తుది లక్ష్యం కావాలి. శ్రామిక మహిళలు తన వర్గ పురుషులతో కలిసి పెట్టుబడిదారీ సమాజానికి వ్యతిరేకంగా పోరాడాలి. నిజమే, శ్రామిక మహిళ కూడా బూర్జువా మహిళా ఉద్యమ డిమాండ్లను అంగీకరిస్తుంది, కానీ ఈ డిమాండ్లు నెరవేర్చుకోడానికి జరిగే ఉద్యమాన్ని మొత్తం శ్రామిక వర్గంతో కలిసి జరిపే పోరాటంలో ఒక సాధనంగా ఆమె పరిగణిస్తుంది.....

**(1896లో బెర్లిన్‌లో జరిగిన జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ, గోథా మహాసభలో క్లారా జెట్కిన్ చేసిన ప్రసంగం నుండి)**

ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం

# కార్మిక వర్గం: నయా-ఫాసిజం


రచయిత ప్రముఖ వామపక్ష ఆర్థిక వేత్త

ప్రభాత్ పట్నాయక్

జర్మన్ తత్వవేత్త వాల్టర్ బెంజ మిన్ స్వయంగా ఫాసిస్టు శక్తుల చేతుల్లో బాధితుడు. ఫాసిజం సమాజంలో పైచేయి సాధించడానికి, దానికి ముందు కాలంలో శ్రామికవర్గ విప్లవం విఫలం అవడానికి సంబంధం ఉందని ఆయన అన్నాడు. ఆయన దృష్టిలో జర్మనీ అనుభవాలు ప్రధానంగా ఉన్నాయి. 1917 బోల్షివిక్ విప్లవం విజయం సాధించిన అనంతరం, అదే మాదిరిగా జర్మనీ లోనూ విప్లవాన్ని సాధించాలన్న ప్రయత్నాలు చాలానే జరిగాయి. కానీ ఆ ప్రయత్నాలు ఏవీ విజయవంతం కాలేకపోయాయి. దాంతో అలసిపోయిన కార్మికవర్గం కమ్యూనిస్టులుగా, సోషల్ డెమాక్రాట్లుగా చీలిపోయింది. సోషల్ డెమాక్రాట్లు అధికారంలో ఉన్న కాలంలో కమ్యూనిస్టులైన రోజా లక్సెంబర్గ్, కార్ల్ లీబ్‌నెక్ట్ తదితరులు హత్యగావించబడ్డారు. దాంతో ఈ రెండింటి మధ్య రాజీకి గానీ, సర్దుబాటుకు గానీ అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో 1930 దశకంలో ఆర్థిక సంక్షోభం ఆవరించింది. అప్పుడు ఫాసిస్టు శక్తులు తేలికగా అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. వాటికి గుత్త పెట్టుబడిదారీ వర్గం, అందునా అందులో కొత్తగా తలెత్తిన శక్తులు దన్నుగా నిలిచాయి.

బెంజమిన్ చేసిన సూత్రీకరణ ఇక్కడ ప్రాధాన్యత కలిగివుంది. బలపడుతున్న కార్మికోద్యమానికి పాలకవర్గ ప్రతిస్పందనగా ఫాసిజం తలెత్తుతుంది అన్న నిర్ధారణకు ఈ సూత్రీకరణ భిన్నమైనది. కార్మికోద్యమ పురోగమనం ఆగిపోయిన సందర్భంలో, మళ్ళీ ఆ కార్మికోద్యమం బలం పుంజుకోకుండా చేయడానికి పాలకవర్గం ఫాసిజాన్ని బలపరుస్తుంది అని ఈ సూత్రీకరణ చెప్తుంది. ఆర్థిక సంక్షోభం కారణంగా పేదరికం, నిరుద్యోగం హెచ్చు స్థాయిలో పెరిగిన నేపథ్యంలో కార్మికోద్యమం మళ్ళీ బలం పుంజుకోకుండా చేయడానికి పాలకవర్గం ఫాసిజాన్ని బలపరుస్తుంది అని అంటుంది. ప్రస్తుతం అనేక ప్రపంచ దేశాల్లో నయా-ఫాసిజం బలంగా ముందుకొస్తోంది. భారతదేశంతోబాటు, హంగరీ, అర్జెంటినా, బ్రెజిల్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా వంటి దేశాల్లో ఈ విధమైన పరిణామాలను మనం చూస్తున్నాం. ఐతే, ఈ నయా-ఫాసిజం బలపడడానికి ముందు ఈ దేశాల్లో ఎక్కడా కార్మికవర్గ విప్లవాలు విఫలమైన సందర్భాలు లేవు. కానీ, బెంజమిన్ ప్రస్తావించిన పరిస్థితి మాత్రం నెలకొంది. ఈ దేశాలలో కార్మికోద్యమాలు బలహీనపడ్డాయి. నయా-ఉదారవాద వ్యవస్థ పని చేసిన తీరు ఈ పరిస్థితికి దారి తీసింది.

కనీసం మూడు వేరు వేరు మార్గాల్లో నయా-ఉదారవాదం కార్మికోద్యమాన్ని బలహీన పరుస్తుంది. మొదటిది: కార్మికోద్యమం జాతీయ ప్రాతిపదికన తన ఉద్యమాన్ని సంఘటితం చేసుకుంటూ ఉంటుంది. కానీ రెండోపక్కన పెట్టుబడి మాత్రం ప్రపంచవ్యాప్త స్వభావాన్ని సంతరించుకుంది. జాతీయ స్థాయిలో సంఘటితమైన కార్మికోద్యమం వద్ద ఉన్న సమ్మె అనే ఆయుధంతో అంతర్జాతీయ స్థాయిలో సంఘటితమైన పెట్టుబడిని ఎదుర్కొని నిలవరించడం కష్టం. ఒకవేళ కార్మికవర్గం సమరశీలంగా వ్యవహరించి పోరాటానికి పూనుకుంటే అంతర్జాతీయ పెట్టుబడి వేరే దేశానికి తన పెట్టుబడులను తరలిస్తానని బెదిరిస్తుంది. అందువలన కార్మికవర్గ సమరశీలతకి పరిమితులు ఏర్పడతాయి. అమెరికాలో సగటు పురుష కార్మికుడి నిజ వేతనం 1968లో ఏ స్థాయిలో ఉందో, అంతకన్నా తక్కువ స్థాయిలో 2011 నాటికి ఉన్నది అని ప్రముఖ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిట్జ్ వివరించాడు. కార్మికవర్గ పోరాట శక్తి ఎంతగా కుదించుకుపోయిందో దీనిని బట్టి గ్రహించవచ్చు.

రెండవది: కార్మికవర్గపు రిజర్వు సైన్యం (నిరుద్యోగులు) పనిలో ఉన్న కార్మికవర్గంతో పోల్చినప్పుడు పెరుగుతోంది. ఇదేదో సంక్షోభం ఆవరించిన తర్వాత వచ్చిన పరిణామం అనుకోకూడదు. అంతకు ముందే, సంపన్న పశ్చిమ దేశాల నుండి పెట్టుబడిని వెనుకబడిన మూడవ ప్రపంచ దేశాలకు తరలించిన కారణంగా నిరుద్యోగం పెరగడం ఎక్కువైంది. దీని వలన సంపన్న దేశాలలో అంతవరకూ ఉన్న ఉద్యోగాలు తగ్గిపోయాయి. మరోపక్క మూడవ ప్రపంచ దేశాలలో చిన్న స్థాయి ఉత్పత్తి వ్యవస్థ మీద, ముఖ్యంగా రైతాంగ వ్యవసాయం మీద కొత్తగా వస్తున్న అంతర్జాతీయ పెట్టుబడి దాడి చేసి విధ్వంసం చేసినందున ఆ చిన్న ఉత్పత్తి దారులు, చేతివృత్తుల తరగతులు, పేద రైతాంగం సర్వమూ కోల్పోయి వీధిన పడుతున్నారు. వీరందరూ బతుకుతెరువు కోసం పట్టణాలకు వలసలు పోతున్నారు. ఇప్పటికే పట్టణాలలో ఉన్న ఉద్యోగావకాశాలు సన్నగిల్లి పోతున్నాయి. దానికి తోడు ఈ వలసలు పెరగడం వలన ఉద్యోగాల కోసం పోటీ తీవ్రమౌతోంది. దీని ఫలితంగా కార్మికవర్గం బలహీనపడుతోంది. ఆర్థిక సంక్షోభం తలెత్తకమునుపే ఈ పరిణామం మొదలైంది.

మూడవది: నయా-ఉదారవాద విధానాలలో భాగంగా ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం జరుగుతోంది. సాధారణంగా ప్రైవేటు రంగంలో కన్నా ప్రభుత్వ రంగంలో కార్మికులు మెరుగ్గా సంఘటితం అవుతారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్నదే. ఉదాహరణకు: అమెరికాలో ప్రైవేటు రంగంలో 7 శాతం మంది కార్మికులు యూనియన్లలో సంఘటితం అయివున్నారు. అదే ప్రభుత్వ రంగంలో చూస్తే (విద్యారంగం కూడా కలుపుకుని) 33 శాతం యూనియన్లలో ఉన్నారు. ప్రైవేటీకరణ విధానం వలన కార్మిక వర్గపు సంఘటిత శక్తి సన్నగిల్లిపోతుంది. ఐతే ఈ అంశాన్ని దాదాపు ఎవరూ చర్చించడం లేదు. ప్రైవేటీకరణ ఫలితంగా సృజనాత్మకత దెబ్బ తింటుందనీ, దేశ ఆర్థిక వ్యవస్థ తన స్వావలంబనను కోల్పోతుందనీ, పెట్టుబడి మరింతగా పరాన్నభుక్కుగా దిగజారుతుందనీ చర్చలు జరుగుతున్నాయి కానీ, అది కార్మికవర్గ పోరాట శక్తిని దెబ్బ తీస్తుందన్న విషయాన్ని ఎక్కువగా చర్చించడం లేదు.

కార్మికవర్గ పోరాట శక్తి బలహీనపడింది అంటే దానర్థం స్వల్పకాలిక, భారీ జాతీయ సమ్మెలు కూడా చేపట్టలేరని అనుకోకూడదు.

> **" దీనినిబట్టి కేవలం కార్మికవర్గ పోరాటశక్తి బలహీన పడడమే నయా-ఫాసిజం బలపడ డానికి కారణం అన్న నిర్ధారణకు రాకూడదు. నయా-ఉదారవాద విధానాల అమలు ఫలితం గా అనివార్యంగా తలెత్తే ఆర్థిక సంక్షోభం కార్మికోద్యమం బలహీన పడిన నేపథ్యంలో సంభవించింది. ఈ పరిస్థితి నయా-ఫాసిస్టు శక్తుల బలం పెరగడానికి దోహదం చేసింది. "**

అటువంటి సమ్మెలు మనం గడిచిన కొన్ని సంవత్సరాలలో మన దేశంలో ఎక్కువగానే జరిగాయి. కానీ ఆయా రంగాలకు సంబంధిం చిన నిర్దిష్ట డిమాండ్లతో, అవి నెరవేరేవరకూ దీర్ఘకాలం పాటు సమ్మెలు కొనసాగించడం అనేది మనకు ఇప్పుడు కనపడదు. అటువంటి సమ్మెలు 1970 దశకంలో మన దేశంలో చాలా జరిగాయి. రైల్వే కార్మికుల సమ్మె, అంతకు ముందు జరిగిన లోకో రన్నింగ్ కార్మికుల సమ్మె వంటివి నిర్వహించగల పరిస్థితి ఇప్పుడు దాదాపు లేదు. జర్మనీలో కార్మికవర్గ విప్లవం విఫలమైన తర్వాత ఫాసిజం బలంగా ముందుకొచ్చిందని బెంజమిన్ చేసిన సూత్రీకరణ ప్రాతిపదికన ఇప్పుడు మనం పరిశీలిస్తే, నయా-ఉదారవాద విధానాల అమలు ఫలితం గా కార్మిక వర్గ పోరాట శక్తి బలహీన పడిన నేపథ్యంలో నయా-ఫాసిజం ముందుకు రావ డం కనిపిస్తుంది. దానికి ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కావడం తోడైంది. నయా-ఫాసిస్టు శక్తులు బలం పుంజుకోవడం వెనుక ఈ నేపథ్యాన్ని చూడాలి.

దీనినిబట్టి కేవలం కార్మికవర్గ పోరాటశక్తి బలహీనపడడమే నయా-ఫాసిజం బలపడ డానికి కారణం అన్న నిర్ధారణకు రాకూడదు. నయా-ఉదారవాద విధానాల అమలు ఫలితం గా అనివార్యంగా తలెత్తే ఆర్థిక సంక్షోభం కార్మికోద్యమం బలహీన పడిన నేపథ్యంలో సంభవించింది. ఈ పరిస్థితి నయా-ఫాసిస్టు శక్తుల బలం పెరగడానికి దోహదం చేసింది.

బూర్జువా ఉదారవాదులు ఈ అంత:సం బంధాన్ని పరిగణించరు. సమాజాన్ని వర్గ ప్రాతిపదికన పరిశీలించడానికి వారు అంగీకరిం చరు. వ్యక్తులుగానో, వర్గేతర ప్రాతిపదికన వ్యక్తుల సమూహాలుగానో మాత్రమే వారు పరిశీలిస్తారు. దానికి తోడు వారు నయా-ఉ దారవాదాన్ని సమర్థిస్తారు. అందువల్లనే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఒకే కాలంలో నయా-ఫాసిజం ఎందుకు పుంజుకుంటోందో వారు వివరించలేకపోతున్నారు. ట్రంప్, మోడీ, బోల్సనారో, మైలీ, మెలోనీ వంటి నాయకులు ఇప్పుడే ఎందుకు బలంగా ముందుకొస్తున్నారో వారు గ్రహించలేకపోతున్నారు. ఇంతమంది ఫాసిస్టు స్వభావం కలిగిన నియంతలు ఏక కాలంలో బలపడడం వెనుక ఉమ్మడి అంతర్జా తీయ సందర్భం ఏమిటన్నది వారు తెలుసుకో వాలి. కొంతకాలంగా నయా-ఉదారవాద విధా నాల అమలు జరిగి దాని ఫలితంగా కార్మికో ద్యమ పోరాట శక్తిని దెబ్బ తీసిన తర్వాత అవే విధానాల కారణంగా ఆర్థిక సంక్షోభం నెలకొని దానినుండి బైటపడే దారి తోచని స్థితి ఏర్పడ డమే ఆ ఉమ్మడి కారణం. తమ తమ దేశాల్లో మెజారిటీ ప్రజల ముందు "పరాయివాళ్ళు" అని కొన్ని సమూహాలపై ముద్ర వేసి విద్వేష భావనలు రెచ్చగొడుతున్న వాతావరణం ఈ అన్ని దేశాల్లోనూ నెలకొంది. ఎటొచ్చీ ఆ "పరాయివారు" ఎవరన్నది ఆయా దేశాన్ని బట్టి మారిపోతూ వుంటుంది. కాని ఎవరినో కొంద రిని "పరాయివారి" గా చిత్రించడం మాత్రం ఉమ్మడి ధోరణిగా ఉంది. దాని వెనుక ఉన్న ఉమ్మడి సందర్భం ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం.

దీనినుండి అనేక నిర్ధారణలకు రావచ్చు. మొదటిది: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే బలమైన కార్మిక సంఘాలను నిర్మించడం తప్పని సరిగా జరగాలి. బూర్జువా ఉదారవాదం ఇందుకు పూర్తి వ్యతిరేకం. కార్మిక సంఘాల పట్ల వారు శత్రుపూరిత వైఖరితో వ్యవహరి స్తారు. సమ్మెలు చేయడం అంటే సమాజాన్ని (పబ్లిక్‌ని) ఇబ్బందులపాలు చేసి తమ డిమాం డ్లను నెగ్గించుకోవమే అని వారు విమర్శిస్తారు. వారికి శ్రమజీవుల పేదరికం, దుర్భర పరిస్థి తులు ఏమాత్రమూ పట్టవు. అంతేగాక వారికి ఈ సమాజం ఏ ప్రాతిపదికన నడుస్తోందో కూడా పట్టదు. నిజానికి వారు చెప్పే స్వేచ్ఛ అనేది వ్యక్తులందరికీ ఉండాలంటే, ఆ స్వేచ్ఛను కాపాడే మొనగాడిగా కార్మికవర్గం బలంగా ఉ ండడం అత్యంత కీలకం. కానీ ఉదారవాదులు వ్యక్తుల స్వేచ్ఛను గుర్తిస్తూనే, ఆ వ్యక్తులందరి సమూహంగా ఉండే కార్మిక సంఘం యొక్క స్వేచ్ఛను మాత్రం అంగీకరించరు. కలిసికట్టుగా ఉంటున్నప్పుడే స్వేచ్ఛను పొందలేకపోతే ఇక వ్యక్తులుగా విడిగా స్వేచ్ఛను అనుభవించడం ఎలా సాధ్యమో వారు వివరించలేరు.

ఇక రెండవది: ప్రజాస్వామ్యం ఉండా లంటే ప్రభుత్వ రంగం ఉండడం తప్పనిసరి. ఉదారవా దులు దీనిని కూడా వ్యతిరేకిస్తారు. ప్రైవేటు సంస్థలు, ఉదార ప్రజాస్వామ్యం ఒకదానికొకటి బలపరుచుకుంటాయని వారు భావిస్తారు. ఒక ఆర్థిక వ్యవస్థలో మొత్తం అంతా ప్రైవేటు రంగమే విస్తరించి వుంటే, ప్రభుత్వ రంగం ఉనికి నామమాత్రం అయితే, అప్పుడు ప్రజానీకానికి అత్యవసర సేవలను వారి ఆర్థిక స్తోమతకు తగ్గ ధరలకు అందించడం ఏ విధంగా సాధ్యం? సాంకేతికంగా కొంతైనా స్వావలంబ నను సాధిం చడం ఎలా? ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ఎలా? ఈ ప్రశ్నలకు ఉదారవా దుల దగ్గర సమా ధానాలు ఉండవు. ప్రభుత్వ రంగం ఉంటే కార్మిక సంఘాలు బలంగా ఉం టాయి. కార్మిక సంఘాలు బలంగా ఉంటే ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవడం సాధ్యం. దీనర్థం దేశమంతటా ప్రైవేటు రంగం విస్తరించివుంటే నయా-ఫాసిజం బలపడిపోతుందని మాత్రం కాదు. ప్రైవేటు రంగం మాత్రమే బలంగా ఉంటే నయా-ఫాసిస్టు దాడికి సులువుగా బలి చేయబడతాం అని మాత్రమే.


"ద్రవ్య పెట్టుబడి యొక్క అత్యంత ప్రతీ ఘాత, తిరోగమన తరగతుల బహిరంగ, ఉగ్ర వాద నియంతృత్వమే ఫాసిజం" అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏడవ మహాసభలో జార్జి డిమి ట్రోవ్ వివరించారు. అది కార్మిక సంఘాలను అణచివేస్తుందనీ, కార్మిక నాయకులను నిర్బం ధించి వేధింపులకు గురి చేస్తుందనీ బిషప్ నీమోల్లర్ వ్యాఖ్యానించారు. ఈ ఫాసిజం బలం పుంజుకోడానికి ప్రధానంగా తీవ్రమౌతున్న ఆర్థిక సంక్షోభం, కార్మికసంఘాలు బలహీనపడడం దోహదం చేస్తున్నాయి.

అందుచేత నయా-ఫాసిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం సాగాలంటే కేవలం రాజ కీయంగా కూటములు ఏర్పరచడం ఒక్కటే సరి పోదు. ఆ వ్యూహంలో కార్మికోద్యమాన్ని బలోపే తం చేసి కార్మికవర్గం పుంజుకునేలా చేయడం, కార్మిక-కర్షక ఉద్యమాల నడుమ సమన్వయాన్ని (ప్రస్తుతం భారతదేశంలో ఈ సమన్వయం పెరుగుతోంది) పెంపొందించడం చాలా ముఖ్యం.

*(స్వేచ్ఛానుసరణ: ఎంవిఎస్ శర్మ)*

ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం

# ఆర్థిక సమ్మెలు, రాజకీయ సమ్మెలు



- లెనిన్

వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ 1905 నుండి నిర్వహిస్తూ వచ్చిన అధికారిక సమ్మె గణాంకాలు సమ్మెలను ఆర్థిక, రాజకీయ సమ్మెలుగా ఉప వర్గీకరణ చేశాయి. సమ్మె ఉద్యమం విలక్షణమైన రూపాలను సంతరించుకుంటున్న వాస్తవ పరిస్థితిని దృష్టిలో ఉంచుకున్నప్పుడు ఈ ఉపవర్గీకరణ అవసరమే. ఆర్థిక, రాజకీయ సమ్మెల కలయిక అత్యంత విలక్షణమైనది. సమ్మె ఉద్యమం పునరుజ్జీవం పొందుతున్న రీత్యా జరిగిపోయిన వాటిని శాస్త్రీయంగా విశ్లేషించుకోవాలి. అలాగే బుద్ధి కుశలతను ఉపయోగించి రష్యాలో సమ్మె ఉద్యమ విలక్షణత్వాన్ని నిశితంగా పరిశీలించడమూ అవసరమే.

మొదటగా ప్రభుత్వ సమ్మె గణాంకాల నుండి అనేక ప్రాథమిక అంకెలను మేమిక్కడ ఉదహరించాల్సి ఉంది. గత మూడు సంవత్సరాలుగా అంటే 1905–1907 మధ్య రష్యాలో సమ్మె ఉద్యమం ప్రపంచంలో మునుపెన్నడూ లేని విధంగా ఉవ్వెత్తున ఎగసింది. ప్రభుత్వ గణాంకాలన్నీ కేవలం ఫ్యాక్టరీలకు మాత్రమే పరిమితమైనట్టివి. కాబట్టి గనులు, రైల్వేలు, భవన నిర్మాణ, వేతన కార్మికులు ఎక్కువగా ఉండే అనేక రంగాలను ఈ గణాంకాలు పూర్తిగా విస్మరించాయి. కర్మాగారాల్లో సమ్మెలనే తీసుకున్నా 1905లో 28,63,000 లేదా 30 లక్షలకు కొంచెం అటు ఇటుగా ఈ సమ్మె ఉద్యమంలో పాల్గొన్నారు. 1906లో 11,08,000, 1907లో 7,40,000 మంది సమ్మెకారులు పాల్గొన్నారు. 1894–1908 మధ్య అంటే పదిహేనేళ్లలో యూరప్‌లో సమ్మె గణాంకాలను ఒక పద్ధతి ప్రకారం అధ్యయనం చేసినప్పుడు ఒక ఏడాదిలో అత్యధికంగా 6,60,000 మంది సమ్మెకారులు ఒక్క అమెరికాలోనే పాల్గొన్నారు. సమ్మె ఉద్యమాన్ని భారీ స్థాయిలో చేపట్టడంలో రష్యన్ కార్మికులు ప్రపంచంలోనే ముందున్నారు. 1905–07 మధ్య పెద్దయెత్తున చేపట్టిన సమ్మె ఉద్యమాలే ఇందుకు తిరుగులేని ఉదాహరణ. ఇప్పుడు సమ్మె ఉద్యమానికి ముఖ్యంగా ఆర్థిక సమ్మెల్లో తాజాగా గొప్ప ప్రేరణ ఇస్తున్నది బ్రిటిష్ కార్మికులే. పశ్చిమ యూరప్‌లో కార్మికులతో పోల్చితే రష్యన్ కార్మికులు ఎక్కువ బలం, మెరుగైన సంస్థాగత నిర్మాణం, ఉన్నతంగా ఉద్యమాన్ని అభివృద్ధి చేయడంలో కొంత వెనకబడి ఉన్నారు. అయితే, ఐరోపాలో శ్రామిక వర్గం స్వతంత్రంగా పాల్గొనడం వల్ల జాతీయ సంక్షోభాలు నెలకొన్న ఉదంతాలు ఏవీ ఇప్పటివరకూ లేవు. అటువంటి సంక్షోభాలు సంభవించినప్పుడు యూరప్‌లో సామూహిక సమ్మెలు 1905లో రష్యాలో జరిగిన వాటికన్నా చాలా శక్తివంతంగా ఉంటాయి. ఆ కాలంలో ఆర్థిక, రాజకీయ సమ్మెల దామాషా ఎలా ఉంది? దీనికి ప్రభుత్వ గణాంకాలు ఇస్తున్న సమాధానం కింది పట్టికలో చూడవచ్చు.

సమ్మెచేసినవారి సంఖ్య (వేలల్లో)

| | 1905 | 1906 | 1907 |
|---|---|---|---|
| ఆర్థిక సమ్మెలు | 1439 | 458 | 200 |
| రాజకీయ సమ్మెలు | 1424 | 650 | 540 |

ఈ రెండు రకాల సమ్మెల మధ్య విడదీయరాని బంధం ఉందని ఈ అంకెలు స్పష్టం చేస్తున్నాయి. ఉద్యమం శిఖరాగ్ర స్థాయిలో ఉన్నప్పుడు (1905) పోరాటాలకు ఆర్థిక ప్రాతిపదిక అత్యంత విస్తారంగా ఉంది. ఆ సంవత్సరంలో రాజకీయ సమ్మెలు ఆర్థిక సమ్మెల దృఢమైన, పటిష్టమైన పునాదిపై ఆధారపడి ఉన్నాయి.. కాబట్టి ఆర్థిక సమ్మెలో పాల్గొన్నవారి సంఖ్య రాజకీయ సమ్మెకారుల సంఖ్యకన్నా ఎక్కువగా ఉంది. అందుకే ఆ సమయంలో ఆర్థిక సమ్మెలు రాజకీయ సమ్మెల కన్నా ఎక్కువగా జరిగాయి.

1906, 1907లో ఉద్యమం క్షీణించినప్పుడు ఆర్థిక ప్రాతిపదిక కుంచించుకుపోవడాన్ని మనం చూస్తాం. ఆర్థిక సమ్మెకారుల సంఖ్య 1906లో మొత్తం సమ్మెకారుల సంఖ్యలో 0.4కి, 1907లో 0.3కి పడిపోయింది. దీనిని బట్టి తేలేదేమిటంటే ఆర్థిక, రాజకీయ సమ్మెలు ఒకదానికొకటి బలపరచుకుంటాయని. ఇవి రెండూ పరస్పర ప్రేరకాలుగాను, శక్తినిచ్చేవిగాను ఉంటాయి. వాటి మధ్య అంతస్సంబంధం బలంగా ఉం టుంది. అలా ఉన్నప్పుడే విస్తృతమైన ప్రజా ఉద్యమాలు నిర్మించడం సాధ్యం. జాతీయ ప్రాముఖ్యత కలిగిన భారీ ఉద్యమాన్ని నిర్మిం చేందుకు ఇది అత్యంతావశ్యకం. ఈ ఉద్యమం ప్రారంభ దశలో ఉన్నప్పుడు వెనుక బడినవారిని మేల్కొల్పడానికి, ఉత్తేజపరచడానికి ఆర్థిక సమ్మె ఎంతగానో దోహదపడుతుంది. ఉచ్ఛ స్థితికి తీసుకెళ్లడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

1905 మొదటి త్రైమాసికంలో ఆర్థిక సమ్మెలు రాజకీయ సమ్మెల కన్నా చాలా శక్తివంతంగా ముందుకొచ్చాయి. మొదటి త్రైమాసికలో 6,04,000 మంది సమ్మెలో పాల్గొంటే, రెండో త్రైమాసికంలో 2,06, 000 మంది మాత్రమే పాల్గొన్నారు. ఆ సంవత్సరం చివరి త్రైమాసికంలో ఈ నిష్పత్తి తలకిందు లైంది. ఆర్థిక సమ్మెల్లో 4,30,000 మంది పాల్గొనగా, రాజకీయ సమ్మెల్లో 8,47,000 మంది పాల్గొన్నారు. దీనిని బట్టి బోధపడే దేమిటి? సమ్మె ఉద్యమ తొలినాళ్లలో ఆర్థిక పోరాటాలకే కార్మికులు ప్రాధాన్యమిచ్చారు. ఉద్యమం పెద్ద యెత్తున సాగుతున్నప్పుడు పరిస్థితి మరోలా ఉంది. మిగతా అన్ని సమయాల్లోను ఆర్థిక సమ్మెలకు, రాజకీయ సమ్మెలకు మధ్య బంధం కొనసాగుతూ వచ్చింది. అలాంటి బంధమే గనుక లేకుంటే మహత్తరమైన ఉద్యమం నిర్మించడం సాధ్యమా? వాటి గొప్ప లక్ష్యాలను చేరుకోగలిగేవారా?

రాజకీయ సమ్మెలో కార్మికవర్గం యావత్ ప్రజానీకానికి అగ్రగామిగా ముందుకొస్తుంది. ఇటువంటి సందర్భాల్లో శ్రామికవర్గం కేవలం బూర్జువా సమాజంలోని ఒక వర్గంగానే కాకుండా మార్గదర్శి, ఉద్యమ పరిరక్షకుడు, ధీరోదాత్త నాయకుడి పాత్ర పోషిస్తుంది. ఈ ఉద్యమంలో వ్యక్తమయ్యే రాజకీయ భావాలు యావత్ ప్రజానీకానికి సంబంధించినవిగా ఉంటాయి. అంటే అవి దేశ రాజకీయ జీవన స్థితిగతులతో గట్టిగా పెనవేసుకుపోతాయన్నమాట. 1905–07 కాలంలోని శాస్త్రీయ పరిశోధకులందరూ గుర్తించినట్లు రాజకీయ

సమ్మె తాలూకు ఈ లక్షణం అన్ని వర్గాల వారిని, మరీ ముఖ్యంగా అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న విస్తృత ప్రజానీకం అంటే ప్రజాతంత్ర వాదులను రైతాంగాన్ని, ఇతర సెక్షన్లను ఉద్యమంలోకి తీసుకొచ్చింది. మరో వైపు ఆర్థిక డిమాండ్లు లేకుండా తమ పరిస్థితుల్లో తక్షణ, ప్రత్యక్ష మెరుగుదల లేకుండా దేశ సాధారణ పురోభివృద్ధి గురించి కబుర్లు చెప్పడాన్ని శ్రామికవర్గం ఎప్పటికీ అంగీకరించదు. శ్రామికుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడడానికి దోహదపడితేనే ఉద్యమం వైపు ప్రజానీకం ఆకర్షితులవుతారు. అందులో చురుగ్గా పాల్గొంటారు. దానిని ఉన్నతంగా గౌరవిస్తారు. వీరత్వం, ప్రాణ త్యాగం, పట్టుదల, గొప్ప ఆశయాల పట్ల అంకిత భావం ప్రదర్శిస్తారు. ఇది ఇంకో విధంగా ఉండడానికి వీల్లేదు. ఎందుకంటే శ్రామికుల జీవన స్థితిగతులు మామూలుగానే కడు దుర్భరంగా ఉంటాయి. తన జీవన స్థితిగతులను మెరుగుపరచుకోడానికి ప్రయత్నించే క్రమంలో కార్మికవర్గం నైతికంగా, మేధో పరంగా, రాజకీయంగా పురోగమిస్తుంది. తన గొప్ప విముక్తి లక్ష్యాలను సాధించుకోడానికి, మరింత సమర్థవంతంగా పోరాడుతుంది.

వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ప్రచురించిన సమ్మె గణాంకాలు, సాధారణ ఆర్థిక పునరుజ్జీవన కాలంలో కార్మికుల ఆర్థిక పోరాటానికి ఉన్న అపారమైన ప్రాముఖ్యతను పూర్తిగా ధ్రువీకరిస్తున్నాయి. కార్మికుల పోరాటం ఎంత బలంగా ఉంటే, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోడంలో వారి విజయాలు అంత ఎక్కువగా ఉంటాయి. సమాజ సానుభూతి ఉన్నప్పుడే నువ్వు బలంగా ఉంటావు అనే విషయాన్ని మార్క్సిస్టులు కార్మికులకు భిన్నమైన రీతిలో చెబుతారు. అదేమిటంటే 'మీరు బలంగా ఉన్నప్పుడు మీకు సమాజం సానుభూతి లభిస్తుంది.' ఈ సందర్భంలో మనం చెబుతున్న సమాజం అనేది కార్మికులు, కార్యాలయ ఉద్యోగులు మొదలైనవారి జీవితాలతో సన్నిహిత సంబంధం ఉన్న వివిధ ప్రజాస్వామ్య శక్తులు, చిన్న బూర్జువాలు, రైతులు, మేధావులందరూ అని అర్థం.

1905లో సమ్మె ఉద్యమం అత్యంత బలంగా ఉంది. ఫలితంగా ఆ సంవత్సరంలో కార్మికులు తమ పరిస్థితుల్లో గొప్ప మెరుగుదల సాధించడాన్ని మనం చూస్తాము. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 1905లో ప్రతి వంద మంది సమ్మెకారుల్లో 29 మంది మాత్రమే ఏమీ సాధించకుండా పోరాటాన్ని విరమించుకున్నారు. అంటే పూర్తిగా ఓడిపోయారు.

**"ఉద్యమం క్షీణించనారంభించగానే పోరాట ఫలితం కూడా దానికనుగుణంగానే తగ్గడం మొదలవుతుంది. 1906లో ప్రతి వందమంది సమ్మెకారుల్లో 33 మంది ఏమీ సాధించకుండానే పోరాటాన్ని విరమించుకున్నారు. కచ్చితంగా చెప్పాలంటే ఓడిపోయారు. 1907లో వీరి సంఖ్య 58కి, 1908లో ఏకంగా 69కి పెరిగింది. ఈ విధంగా అనేక సంవత్సరాల శాస్త్రీయ గణాంక డేటాను విశ్లేషిస్తే, ఆర్థిక, రాజకీయ సమ్మెలను కలపాల్సిన ఆవశ్యకతను ఇది పూర్తిగా ధ్రువీకరిస్తుంది."**

అంతకుముందు పదేళ్లలో (1895-1904)లో ప్రతి వందమందికి ఏకంగా 52 మంది ఏమీ సాధించకుండానే పోరాటం విరమించుకున్నారు. దీనిని బట్టి పోరాటం పెద్దయెత్తున సాగినప్పుడు ఉద్యమ విజయానికి అది ఎంతగానో దోహద పడిందని, దానిని మరింత ద్విగుణీకృతం చేసిందని స్పష్టమవుతుంది.

ఉద్యమం క్షీణించనారంభించగానే పోరాట ఫలితం కూడా దానికనుగుణంగానే తగ్గడం మొదలవుతుంది. 1906లో ప్రతి వందమంది సమ్మెకారుల్లో 33 మంది ఏమీ సాధించకుండానే పోరాటాన్ని విరమించుకున్నారు. కచ్చితంగా చెప్పాలంటే ఓడిపోయారు. 1907లో వీరి సంఖ్య 58కి, 1908లో ఏకంగా 69కి పెరిగింది. ఈ విధంగా అనేక సంవత్సరాల శాస్త్రీయ గణాంక డేటాను విశ్లేషిస్తే, ఆర్థిక, రాజకీయ సమ్మెలను కలపాల్సిన ఆవశ్యకతను ఇది పూర్తిగా ధ్రువీకరిస్తుంది. వర్గ చైతన్యం ఉన్న ప్రతి కార్మికుడి వ్యక్తిగత అనుభవం, పరిశీలన కూడా ఇదే చెబుతోంది. యావత్ ప్రజానీకం చేపట్టే విస్తృతమైన ఉద్యమం ఆర్థిక, రాజకీయ సమ్మెల కలయిక అనివార్యతను కార్మికుడు గ్రహిస్తాడని చెబుతోంది. ప్రస్తుత సమ్మెల పరంపర కూడా ఈ నిర్ధారణను పూర్తిగా ధ్రువీకరిస్తుంది 1911లో సమ్మె చేసినవారి సంఖ్య 1910 నాటి సంఖ్యకు రెట్టింపుగా ఉంది. (యాభై వేలకు బదులుగా లక్షకు పెరిగింది). అయినా వారి సంఖ్య చాలా తక్కువగానే ఉంది. కేవలం ఆర్థిక కారణాల కోసం చేసిన సమ్మెలు సాపేక్షంగా ఒక 'పరిమిత' కారణానికి మాత్రమే పరిమితమయ్యాయి. అవి జాతీయ ప్రాముఖ్యతను సంతరించుకోలేదు. మరో వైపు 1910 ఏప్రిల్‌లో జరిగిన సుప్రసిద్ధ సంఘటనల తర్వాత జరిగిన సమ్మెఉద్యమానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ఈ రోజు అందరికీ స్పష్టంగా అర్థమైంది. అందువల్ల ఈ ఉద్యమ స్వభావాన్ని వ్యక్తీకరించడానికి ఉదారవాదులు, ఉదారవాద కార్మిక, రాజకీయ నాయకులు (లిక్విడేటర్లు) చేసే ప్రయత్నాలను మొదటి నుండే తిప్పికొట్టడం చాలా ముఖ్యం. సెవెర్యాన్ అనే ఒక ఉదారవాది మే దినోత్సవ సమ్మెకు ఆర్థిక లేదా మరేదైనా డిమాండ్లను కలపడాన్ని వ్యతిరేకిస్తూ 'రస్కియే వెడోమోస్టి' పత్రికకు ఒక వ్యాసం రాశాడు. క్యాడెట్ పత్రిక 'రెచ్' ఆ వ్యాసంలోని ముఖ్య భాగాలను సానుభూతితో పున: ప్రచురించింది.

ఇటువంటి సమ్మెలను మే దినోత్సవంతో ముడిపెట్టడం అవివేకం అంటూ ఈ ఉదారవాద పెద్ద మనిషి తరచూ వాదిస్తాడు. నిజానికి అలా చేయడం చాలా వింతగా ఉంటుంది. మనం అంతర్జాతీయ కార్మికుల పండగను జరుపుకుంటున్నాం. ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని ఫలానా రకాల నూలు వస్త్రాలపై పది శాతం వేతన పెంపును డిమాండ్ చేస్తున్నాం.

కార్మికులకు చాలా స్పష్టంగా కనిపించే విషయం ఉదారవాదులకు వింతగా అనిపిస్తుంది. కేవలం బూర్జువా వర్గాన్ని, దాని అధిక లాభాలను సమర్థించేవారు మాత్రమే వేతన పెంపు డిమాండ్‌ను ఎగతాళి చేస్తారు. కానీ, వేతన పెంపుకోసం చేసే డిమాండ్ విస్తృత స్వభావమే పెద్ద సంఖ్యలో కొత్తవారు పాల్గొనేలా ఆకర్షించడానికి, పోరాట బలాన్ని, సమాజ సానుభూతిని పొందడానికి ఉపయోగపడుతుంది. కార్మికుల విజయాన్ని, వారి ఉద్యమం జాతీయ ప్రాముఖ్యతను శక్తివంతంగా చాటడానికి ఇది ఉపయోగపడుతుందని కార్మికులకు తెలుసు!

అందుకే సెవెర్యాన్, రస్కియే వెడోమోస్తి, రెచ్ ప్రచారం చేస్తున్న ఉదారవాదం వక్రీకరణకు వ్యతిరేకంగా దృఢ సంకల్పంతో పోరాడాల్సిన అవసరముంది. ఈ రకమైన పనికిమాలిన సలహాదారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కార్మికులను సదా హెచ్చరిస్తుండాలి.

లిక్విడేటర్ అయిన వి యెజోవ్ లిక్విడేషనిస్టు పత్రిక 'నేవ్స్కీ గొలోస్' మొదటి సంచికలోనే రాస్తూ, ఈ ప్రశ్నను భిన్నమైన కోణం నుండి

చూసినప్పటికీ ఇలాంటిదే అయిన పూర్తి ఉదారవాద వక్రీకరణకు పూనుకున్నాడు. అతను ముఖ్యంగా మేడే జరిమానాల వల్ల రేకెత్తిన సమ్మెల గురించి ప్రస్తావిస్తాడు. కార్మికులు తగినంత సంఘటితం కాలేదని సరిగానే పేర్కొంటాడు. కానీ, నిర్ధారణకు వచ్చేసరికి పప్పులో కాలేస్తాడు. కార్మికులకు అత్యంత హానికరమైన ముగింపు తీసుకుంటాడు. ఒక కర్మాగారంలో కార్మికులు కేవలం నిరసనగా సమ్మె చేస్తే మరో కర్మాగారంలో వారు ఆర్థిక డిమాండ్లను జోడించారనే వాస్తవంలో యెజోవ్ సంస్థాగత లోపాన్ని చూస్తున్నాడు. వాస్తవానికి సమ్మె రూపంలోని ఈ వైవిధ్యం తనంతట తానుగా ఎటువంటి సంస్థాగత రూపాన్ని సూచించదు. సంఘం అంటే ఏకశిలా సదృ శంగా ఉండాలనుకోవడం అర్థరహితం. కాబట్టి మిస్టర్ యెజోవ్ ఏది మంచిది కాదంటాడో అదే పూర్తిగా మంచిది. ప్రతి కార్మికుడి సొంత అనుభవం ఇటీవలి కాలంలో చాలా మంది రష్యన్‌కార్మికుల అనుభవం కూడా యెజోవ్ చెప్పేదానికి విరుద్ధంగా సాక్ష్యమిస్తున్నాయి.

మిస్టర్ యెజోవ్ తన ఉదారవాద రహస్యా లను వేరొకరి జెండా కింద కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆర్థిక, రాజకీయ సమ్మెల కలయిక విషయాన్ని గందరగోళపరచడానికి యత్నిస్తూ తన సమయాన్ని వృథా చేసుకుంటు న్నాడు. వాస్తవానికి సన్నాహాలు చేయడం, సిద్ధంగా ఉండడం, దీనిని సాధ్యమైనంత సమగ్రంగా, సమన్వయంతో ఐక్యంగా, తెలివిగా దృఢంగా చేయడం అవసరమే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కానీ, మిస్టర్ యెజోవ్ చెప్పిన దానికి విరుద్ధంగా రెండు రకాల సమ్మెల కలయిక కోసం కచ్చితంగా సన్నాహాలు చేయాల్సిన అవసరముంది.

'మన ముందు ఆర్థిక సమ్మెల కాలం ఉంది' అని యెజోవ్ పేర్కొనడం సరికాదు. లిక్విడేటర్ ఒక సాధారణ ఉదారవాద స్థాయికి దిగజారిపోయాడనడానికి ఇదొక నిదర్శనం. అయితే, కార్మికులు ఈ విషయాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకున్నారు. వారు ఉదారవాద కార్మిక, రాజకీయ నాయకుల బోధనలను ఏవగించుకుంటున్నారు.

చివరగా అటువంటి పెనవేత రెండు రూపాలపై హానికరమైన ప్రభావం చూపుతుందనడంలో నిజం లేదు. దానికి పూర్తి విరుద్ధంగా ఇది రెండింటికీ ప్రయోజనం చేకూరుస్తుంది. రెండింటినీ బలపరుస్తుంది.

యెజోవ్ కొంత మంది ఉద్రేకపరులకు ఉపన్యాసాలు ఇస్తూ ఇలా పేర్కొన్నాడు. 'కార్మికుల భావాలకు సంస్థాగత రూపాన్ని ఇవ్వడం అవసరం' ఇది అక్షర సత్యం. కార్మిక సంఘాల కోసం ప్రచారాన్ని పెంచడం, వాటిలో కొత్త సభ్యులను చేర్చుకోవడం అవసరం.

కచ్చితంగా నిజం. కానీ, యెజోవ్ సంస్థాగత రూపాన్ని కేవలం ట్రేడ్ యూనియన్లకు మాత్రమే పరిమితం చేయడం క్షమించరానిది,

ఈ రోజుల్లో కార్మికుల్లో చాలా మంది తొందరపాటు స్వభావం గల వారు ఉన్నారు. వారు సామూహిక ఉద్యమానికి ప్రభావితమై యూనియన్లు పనికిరానివి, అనవసరమైనవి అని ఆరోపిస్తూ సమావేశాల్లో వాటికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు.

కార్మిక సంఘాలకు మాత్రమే సంస్థాగత రూపాన్ని పరిమితం చేయాలన్న ప్రయత్నానికి వ్యతిరేకంగా కార్మికులు బయటకొస్తున్నారు. ఈ ప్రయత్నం యెజోవ్ మునుపటి వాక్యంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. కార్మికులు యూనియన్లకు వ్యతిరేకంగా కాదు, వారు చేస్తున్న పోరాట స్వభావంపై ఉదారవాద వక్రీకరణకు వ్యతిరేకంగా బయటకొస్తున్నారు. ఈ వక్రీకరణ యెజోవ్ వ్యాసం అంతటా వ్యాపించి ఉంది.

రష్యన్ కార్మికులు తమ ఉద్యమం తాలూకు గొప్ప ప్రాముఖ్యతను యావత్ ప్రజల కోసమని గ్రహించేందుకు రాజకీయ పరిణతి సాధించారు. ఉదారవాద కార్మిక విధానం ఎంత తప్పో, ఎంత నీచమైనదో గ్రహించగలిగేంత పరిణతి సాధించారు. వారు దానిని ఎల్లప్పుడూ ధిక్కార స్వరంతో పక్కకు నెట్టేస్తారు.

*

# కార్మికవర్గం : సోషలిస్టు చైతన్యం

**- లెనిన్**

**....**కార్మికులకు సోషలిస్టు చైతన్యం బయటి నుండే వస్తుంది. అది వర్గ పోరాటంలో ప్రవేశపెట్టబడుతుంది. అంతేగానీ సోషలిస్టు చైతన్యం దానంతటది వర్గ పోరాటంలోనే పుట్టదు.

....కార్మికులు తమంత తాము జరిపే పోరాటాల్లో స్వతంత్రంగా ఎలాంటి సిద్ధాంతాలు ఉద్భవించవు. అలాంటి పోరాటాల్లో బూర్జువా సిద్ధాంతాలైనా ప్రచారం కావాలి లేకుంటే సోషలిస్టు సిద్ధాంతాలైనా ప్రచారం కావాలి. మూడో మార్గం లేదు. ఎందుచేతనంటే ఇంతవరకు మూడో మార్గం కనపడలేదు. అంతేకాక, వర్గవైరుధ్యాలతో నిండి ఉన్న సమాజంలో ఏ వర్గానికీ చెందని సిద్ధాంతం ఉండడం అనేది అసంభవం. కాబట్టి సోషలిస్టు సిద్ధాంతపు ప్రాధాన్యతను ఏ మాత్రం తక్కువ అంచనా వేసినా, ఏ మాత్రం దాన్నుండి దూరం అయినా బూర్జువా సిద్ధాంతాలకు బలం చేకూర్చినవారమవుతాం. కార్మికోద్యమం దానంతట అది మాత్రమే అభివృద్ధి అయితే క్రమంగా బూర్జువా సిద్ధాంతాలకు తలవంచవలసి వస్తుంది. దానంతట అది అభివృద్ధి చెందే కార్మికోద్యమం ట్రేడ్‌యూనియన్ ఉద్యమం మాత్రమే. ట్రేడ్‌యూనియన్ ఉద్యమం అంటే అర్థం, కార్మికులు సిద్ధాంత విషయాల్లో బూర్జువా వర్గానికి లొంగిపోవడమన్నమాట. కాబట్టి సోషల్ డెమోక్రాట్లంతా ప్రాప్తకాలజ్ఞతను తీవ్రంగా ఎదుర్కొనాల్సి ఉంది. కార్మికోద్యమాన్ని ట్రేడ్‌యూనియన్ పద్ధతులనుండి తప్పించి సోషలిస్టు విప్లవ పంథావైపు తిప్పవలసి ఉంది.

....అయితే కార్మికోద్యమం దానంతట అది, ట్రేడ్‌యూనియన్ పద్ధతుల్లోనే అభివృద్ధి చెందితే బూర్జువా సిద్ధాంతాలెందుకు ప్రాబల్యం వహిస్తాయి? అని కొందరు అడగవచ్చు. దీనికి కారణం ఏమంటే, సోషలిస్టు సిద్ధాంతాలకంటే బూర్జువా సిద్ధాంతాలే చాలా కాలం నుంచి వ్యాప్తిలో ఉన్నాయి. అవే ఎక్కువ పరిపక్వ దశకు వచ్చాయి. వాటి ప్రచారానికి లెక్కలేనన్ని అవకాశాలు ఉన్నాయి. ఏదైనా ఒక దేశంలో సోషలిస్టు ఉద్యమం ఎంత ప్రాథమిక దశలో ఉంటే అది అంత తీవ్రంగా ఇతర సిద్ధాంతాలను ఎదుర్కోవలసి ఉంటుంది. "సోషలిస్టు చైతన్యానికి ప్రాముఖ్యత" ఇవ్వరాదంటూ గొంతులు చించుకొనే వంచకుల వలలో పడరాదని అంత ఖచ్చితంగా కార్మికుల్ని హెచ్చరించవలసి ఉంటుంది.

...కార్మికుల ఆర్థిక పోరాటానికీ, బూర్జువా రాజకీయాలకూ తరచూ దగ్గర సంబంధం ఉంటుంది....కేవలం ట్రేడ్‌యూనియన్ రాజకీయాలతో కార్మికులు సంతృప్తి పడితే పెట్టుబడిదారీ విధానం వల్ల ఏర్పడిన పేదరికాన్నీ, దారిద్ర్యాన్నీ తగ్గించడం కోసం చట్టాలు చేయవలసిందని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడం మాత్రమే జరుగుతుంది. ఆ పేదరికానికీ, దారిద్ర్యానికీ కారణమైన పెట్టుబడిదారీ వ్యవస్థను మాత్రం అలాగే ఉంచడం జరుగుతుంది.

...కార్మికులు తమంత తాము జరిపే పోరాటాలకు సోషలిస్టులు పైనుంచి సహాయం చేయాలి. నేటి పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులకు మొట్టమొదట దొరికే సాధనం ట్రేడ్ యూనియన్ పోరాట పద్ధతి, మొట్టమొదట లభించే సిద్ధాంతాలు బూర్జువా (ట్రేడ్‌యూనియన్) సిద్ధాంతాలు. ఈ వాస్తవాన్ని గుర్తించాలి.

**(ఏం చేయాలి గ్రంథం నుండి)**

**ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం**

# హక్కులు కోల్పోతున్న తెలంగాణా కార్మికవర్గం



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణా రాష్ట్ర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు

**ఎస్ వీరయ్య**

బతుకుదెరువు కోసం బానిసలుగా పనిచేయవచ్చునని కౌటిల్యుడు చెప్పాడు. అది మన ప్రధానికి బాగా నచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికీ అదే నచ్చింది. వీరి పార్టీలు వేరైనా అభిరుచులు ఒకేరకంగా ఉన్నాయి. ఇప్పుడే కాదు, గత మూడు దశాబ్దాలకు పైగా దేశంలో, రాష్ట్రంలో ఇందుకనుగుణంగానే మార్పులు జరుగుతున్నాయి. ప్రపంచీకరణ లేదా సరళీకరణ లేదా అభివృద్ధి... ఏ పేరు పెట్టినా జరుగుతున్న పరిణామం ఇదే. ఒకప్పుడు ప్రపంచ బ్యాంకు విధానాలన్నారు. ప్రపంచ బ్యాంక్‌కు మన పాలకులు దాసోహం కావడాన్ని ప్రజలు సహించలేకపోయారు. ఈ అనుభవంతోనే కావచ్చు... "ఎవరో మాకు చెప్పేదేంది? మా బుర్రలో పుట్టిన ఆలోచనలే" అంటున్నారు. బుర్రలు తాకట్టు పెట్టిన ఫలితం ఇది. పాలకులు బడాబాబుల సేవలో తరిస్తున్న పర్యవసానం ఇది.

మన తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వరంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలన్నారు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం వాటి అంత్యక్రియల గురించి మాట్లాడుతున్నారు. ఈ మార్పు ప్రభావం తీవ్రంగానే ఉన్నది. ప్రధాని మోడీ నాయకత్వంలోని యూనియన్ ప్రభుత్వం దాడి తీవ్రతరం చేసింది. వ్యూహాత్మక రంగాల్లో కూడా ప్రభుత్వరంగం నామమాత్రంగా ఉంటే చాలునని నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ విధానాన్ని అమలు చేయడంలో యాజమాన్యాలు సహకరించకపోతే సిఎండితో సహా ఏ స్థాయి అధికారినైనా తొలగిస్తామని స్పష్టం చేసింది. ఇప్పటికే బలహీనపడిన ప్రభుత్వరంగ సంస్థలను మరింత నీరుగార్చే ప్రయత్నమిది. తెలంగాణలో ఇప్పటికే ఒకప్పటి ఘన చరిత్ర కల్గిన ప్రభుత్వరంగ సంస్థలు గత స్మృతులుగా మారుతున్నాయి. కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. అంతేకాదు.. ఒకప్పుడు 9,000 మంది కార్మికులున్న ఈసిఐఎల్‌లో ఇప్పుడు కేవలం 3,350 మంది పని చేస్తున్నారు. వీరిలో 3,000 మంది కాంట్రాక్ట్ కార్మికులే. ఒకప్పుడు 10,000 మందికి పైగా రెగ్యులర్ కార్మికులు పనిచేసిన బిహెచ్ఇఎల్‌లో ఇప్పుడు 3,483కు పడిపోయింది. వీరిలో 2,300 మంది కాంట్రాక్ట్ కార్మికులే. ఒకప్పుడు 6,000 మంది పనిచేసిన హెచ్ఎంటిలో ఇప్పుడు 210 మంది మాత్రమే మిగిలారు. ఎన్‌టిపిసిలో రెగ్యులర్ కార్మికుల సంఖ్య 1,250 నుండి 230కి తగ్గింది. కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 1,700 నుండి 5,000లకు పెరిగింది. సింగరేణి మినహా మిగిలిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో 41,800 మంది రెగ్యులర్ కార్మికులుండగా, 43,444 మంది కాంట్రాక్ట్ కార్మికులున్నారు. వీరు కాక 1,008 మంది ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులుగా, 3,682 మంది కన్సాలిడేటెడ్ చెల్లింపులు, బదిలీ లేదా ట్రైనీల పేరుతో పనిచేస్తున్నారు. మొత్తం మీద రెగ్యులర్ కార్మికులకన్నా రెగ్యులర్ స్వభావం లేని కార్మికుల సంఖ్య ఎక్కువ. సింగరేణిలో కూడా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య సుమారు 5,000 నుండి 30,000కు పెరిగింది. రెగ్యులర్ కార్మికుల సంఖ్య 1,05,625 నుండి 40,523కు పడిపోయింది. రెగ్యులర్ కార్మికుల పక్కనే ప్రైవేట్ కాంట్రాక్టర్ తన స్వంత కార్మికులతో బొగ్గు తవ్వకాలు సాగిస్తున్నారు. స్థూలంగా ప్రభుత్వరంగ సంస్థల యాజమాన్య స్వభావంలోనూ, కార్మికవర్గ నిర్మాణంలోనూ (వర్కర్ ప్రొఫైల్) స్వభావంలోనూ తీవ్ర మార్పులొస్తున్నాయి. వీటికి తోడు సంస్కరణవాద సంఘాల ప్రభావాల ఫలితంగా ప్రభుత్వరంగ పరిరక్షణోద్యమం కూడా బలహీనపడింది. ఐడిపిఎల్, హెచ్ఎంటి లాంటి సంస్థల నుండి సాంకేతిక పరిజ్ఞానం దొంగిలించి బయటపడ్డవారు పెద్ద పెద్ద పెట్టుబడిదారులుగా మారారు. ప్రభుత్వరంగ సంస్థలు మాత్రం చిక్కి శల్యమై విలవిల్లాడుతున్నాయి. ఐడిపిఎల్, ప్రాగా టూల్స్ మూతపడ్డాయి. హెచ్ఎంటి, హెచ్ఎంటి బేరింగ్స్ లాంఛనంగానే ఉన్నాయి.

ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన దృక్పథం మారడంతో పాటు సౌకర్యాల్లో కూడా మార్పులొచ్చాయి. ఇవి ఆదర్శ యాజమాన్యాలుగా వ్యవహరించాలని ప్రైవేట్ సంస్థలు వీటి బాటలో పయనించాలని భావించేవారు. ఇప్పుడది తారుమారైంది. యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యం అన్న మాటే ఇప్పుడు వినిపించదు. చవకగా సరుకులు అందించడం, అప్పులు తదితర సౌకర్యాల కోసం కార్మికుల మధ్య సహకార సంఘాలను ప్రోత్సహించేవారు. ఇప్పుడవి కనుమరుగైనాయి. కంపెనీకి దగ్గరలోనే సౌకర్యవంతమైన కార్మిక నివాసాలను (క్వార్టర్స్) నిర్మించేవారు. క్యాంటీన్, హాస్పిటల్స్, పాఠశాలలు, క్రెచ్‌లు, బస్‌ల వంటి సౌకర్యాలు కూడా హక్కుగా అమలు చేసేవారు. ఇప్పుడవి కనుమరుగవుతున్నాయి. ఇవన్నీ గత స్మృతులుగా మారిపోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు ఆధ్వర్యంలో పనిచేసిన విద్యుత్ రంగం ఇప్పుడు ముక్కలు చేశారు. ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ విడగొట్టి వీటిని కూడా ముక్కలు చేశారు. 2014లో కోటి 20 లక్షల నుండి కనెక్షన్లు ప్రస్తుతం కోటి 90 లక్షలకు పెరిగాయి. కానీ పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య 37,000 నుండి 23,372కు పడిపోయింది. పర్మినెంటేతర కార్మికుల సంఖ్య 23,000 నుండి 27,688కి పెరిగింది. మొత్తం మీద కార్మికుల సంఖ్య 9,000 తగ్గింది. ఆర్‌టిసిలో స్వంత బస్సులు 8,937 నుండి 6,661కి తగ్గాయి. అద్దె బస్సులు 1,542 నుండి 3,217కు పెరిగాయి. మొత్తం బస్సుల సంఖ్య 10,479 నుండి 9,878కి పడిపోయింది. ఉద్యోగుల సంఖ్య కూడా 56,740 నుండి 38,715కు

> **“ ప్రభుత్వ శాఖల్లో కూడా రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్యను కుదించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో తగిన సిబ్బందిని నియమించకుండా, సౌకర్యాలను నిర్లక్ష్యం చేసిన పాలకులు ఇప్పుడు విద్యార్థులు లేరనే సాకుతో ఇప్పటికే 300 పాఠశాలలు మూసివేశారు. మరో 400 పాఠశాలలు మూసి వేతకు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేస్తున్నారు. ”**

తగ్గింది. ఇప్పుడు ఆర్‌టిసితో ఏమాత్రం సంబంధం లేకుండా 675 ప్రైవేట్ విద్యుత్ బస్సులు ప్రారంభించారు. 2030 నాటికి మొత్తం విద్యుత్ బస్సులే ఉంటాయని చెప్తున్నారు. ప్రజోపయోగ సర్వీసులో ఉన్న ఆర్‌టిసి క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

ప్రభుత్వ శాఖల్లో కూడా రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్యను కుదించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో తగిన సిబ్బందిని నియమించకుండా, సౌకర్యాలను నిర్లక్ష్యం చేసిన పాలకులు ఇప్పుడు విద్యార్థులు లేరనే సాకుతో ఇప్పటికే 300 పాఠశాలలు మూసివేశారు. మరో 400 పాఠశాలలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన ఉపాధ్యాయులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేస్తున్నారు. ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంతో సహా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలన్నింటినీ నిర్లక్ష్యం చేశారు. వేల సంఖ్యలో బోధనా సిబ్బందిని నియమించకుండా ఖాళీగా వదిలేశారు. ఇవి గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్న పేద, బడుగు బలహీనవర్గాలకు చెందిన కుటుంబాల నుండి వచ్చే విద్యార్థులకు అనాథ శరణాలయాలుగా మారుతున్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని స్థాపిస్తానని ప్రకటించింది. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానంలో భాగమే ఇది. పారిశ్రామికవేత్తలకు కావల్సిన సాంకేతిక నిపుణులను ఇక్కడ తయారు చేస్తారు. లక్షలాది ఇతర విద్యార్థినీ, విద్యార్థులను గాలికి వదిలేస్తారు.

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కార్మికుల పని పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. రెగ్యులర్ కార్మికుల సంఖ్య బాగా తగ్గిపోయి రకరకాల తాత్కాలిక కార్మికుల సంఖ్య బాగా పెరిగింది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, బదిలీ, పీస్ రేట్, ఫిక్స్‌డ్ టర్మ్, అప్రంటీస్ లాంటి పేర్లతో నియమిస్తున్నారు. వీరిలో పెద్ద సంఖ్యలో వలస కార్మికులుంటున్నారు. ఆఫీసర్, సూపర్‌వైజర్, ఎగ్జిక్యూటివ్ లాంటి పేర్లతో రిక్రూట్ చేసి కార్మికులుగా పని చేయిస్తున్నారు. పర్మినెంట్, పర్మినెంటేతర కార్మికుల నిష్పత్తి పూర్తిగా తారుమారైంది. ప్రభుత్వ పథకాల పేరుతో రిక్రూట్ చేసే అంగన్‌వాడీలు, ఆశాల్లాంటి అనేక రంగాల వారిని కార్మికులు గానే గుర్తించడం లేదు. అత్యధిక పరిశ్రమల్లో 8 గంటల పని అంతరించింది. 12 గంటల పనిదినం సర్వసాధారణమైంది. అవసరమైన రోజు అంతకన్నా ఎక్కువ గంటలు పని చేయించేందుకు కూడా అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాణిజ్య సంస్థల్లో ఇప్పటికే 14-15 గంటల పని కూడా అమలు జరుగుతున్నది. స్పెషల్ ఎకనామిక్ జోన్‌లలో యూనియన్ కార్యకలాపాల మీద ఆంక్షలున్నాయి. అసంఘటిత రంగంలో కూడా వలస కార్మికుల సంఖ్య దాదాపు సగానికి చేరింది. ఓలా, ఊబర్, స్విగ్గి, జొమాటో, పోర్టర్ తదితర పేర్లతో గిగ్ వర్కర్ల సంఖ్య వేగంగా విస్తరిస్తున్నది. పని గంటలు, కనీస ఆదాయం ఇతరత్రా భద్రతలు ఏవీ వీరికి వర్తించవు. యజమానులతో ప్రత్యక్ష సంబంధం లేదు. వీరి యజమానుల పైన కూడా చట్టపరమైన నియంత్రణ లేదు. ఆధునిక పరిశ్రమల్లో యూనియన్లు మంచి వేతన ఒప్పందాలు చేసిన చోట కూడా జీవితం పట్ల అభద్రతా భావం వల్ల కార్మికులు డ్యూటీ తర్వాత ఇతర పనులు కూడా చేస్తున్నారు. వీటన్నింటి పర్యవసానంగా అత్యధిక కార్మికవర్గానికి కుటుంబ జీవితం కూడా ప్రభావితమవుతున్నది. మొత్తం మీద కార్మికవర్గ ఐక్యతకు, పోరాటాలకు అవాంతరాలు పెరిగాయి.

కార్మికుల సంక్షేమం, భద్రత కోసం కార్మిక చట్టాల అమలును పర్యవేక్షణ చేయవలసిన కార్మిక శాఖ యజమానుల శాఖగా మారింది. ప్రైవేట్ కంపెనీల యజమానులే కార్మిక శాఖా మంత్రులవుతున్నారు. ఇప్పుడు శ్రమశక్తి నీతి పేరుతో కార్మిక శాఖే అవసరం లేదని ప్రధాని చెప్తున్నారు. యూనియన్ ప్రభుత్వం నిర్ణయించిన క్షేత్రస్థాయి కనీస వేతనాలు రోజుకు రూ 176/-లు. ఈ ఆదేశాలు యాజమాన్యాలకు ఆయుధాలుగా మారుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కనీస వేతనాల సవరణ జరగలేదు. చట్ట ప్రకారం ఏడేండ్లకోసారి సవరించాలి. కార్మికవర్గ శ్రమ దోపిడికి సైద్ధాంతిక పూత “శ్రమశక్తి నీతి-2025”. యూనియన్ల మీద కూడా తీవ్ర ప్రభావం పడింది. తెలంగాణలో వివిధ పారిశ్రామిక ప్రాంతాల్లో అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర యూనియన్ల సంఖ్య తగ్గింది. అనేక కంపెనీలలో బయటి నాయకత్వాన్ని యాజమాన్యాలు చర్చలకు అనుమతించడం లేదు. యూనియన్లు రిజిష్టర్ చేయడమే సమస్యగా మారుతున్నది. ఆదిభట్ల పారిశ్రామిక ప్రాంతంలోని టాటా ఎయిరోస్పేస్ కంపెనీలో యూనియన్ ఏర్పాటుకు ప్రయత్నించినందుకు నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి సిద్ధపడిన 100 మందికి పైగా కార్మికులను తొలగించారు. కార్మికవర్గం మీద ట్రేడ్ యూనియన్ రంగంలో ఉన్న సంస్కరణవాద ధోరణుల ప్రభావం కూడా గణనీయంగానే ఉన్నది. ఇవన్నీ విప్లవ కార్మికోద్యమానికి సవాళ్ళుగా మారుతున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కూడా వేగంగా మార్పులొస్తున్నాయి. చేతి వృత్తులు ధ్వంసం అవుతున్నాయి. ఈ కుటుంబాల నుండి కొందరు పట్టణాల బాట పట్టగా మరికొందరు గ్రామాల్లోనే వ్యవసాయేతర వృత్తులలో స్థిరపడుతున్నారు. ఇలాంటి వారు అతి చిన్న గ్రామంలో కూడా సుమారు 100కు పైగా ఉంటున్నారు. ఇతర పనులు చేయలేని వారు ఉపాధి కోల్పోతున్నారు. పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో వృత్తుల ధ్వంసం వల్ల ఉపాధి కోల్పోతున్న వారికి పాలకులు ప్రత్యామ్నాయం చూపించడం లేదు. తెలంగాణ వస్తే అన్నీ వస్తాయని నమ్మిన జనం మోసపోయామని భావిస్తున్నారు.

ఇన్ని అననుకూల పరిణామాల మధ్య కూడా కార్మికోద్యమానికి కాంతి రేఖలు కనిపిస్తున్నాయి. సింగరేణిలో స్వంత ఇంటి కల నెరవేర్చాలని కార్మికులు కదులుతున్నారు. అధికారుల అవినీతికి వ్యతిరేకంగా స్పందిస్తు

న్నారు. గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా కదలాలని కోరుకుంటున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న గార్మెంట్స్ కంపెనీ షాహి ఎక్స్‌పోర్ట్‌లో 1600 మంది మహిళా కార్మికులు యూనియన్ లేకపోయినప్పటికీ తమంతట తాము మెరుపు సమ్మెలోకి దిగి 10 రోజుల్లో విజయం సాధించారు. బహుళజాతి కంపెనీ శాండ్విక్, సీబీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికులకు కూడా నెలసరి వేతనం రూ.26,000/-లకు మించి సాధించుకున్నారు. ఎంపి డిస్టిలరీ, ఎంఎస్ స్పిరిట్, కివీ కంపెనీలలో కూడా కాంట్రాక్ట్ కార్మికులు పోరాడి వేతనాలు పెంచుకున్నారు. యునైటెడ్ బ్రెవరీస్, పెన్నార్, క్రౌన్‌బార్, తోషిబా, టీఏడీసీ, సినర్జీ, పీఈబీఎస్ పెన్నార్, బ్లూక్రాఫ్ట్ ఆగ్రో కంపెనీలలో 334 మంది కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్ సాధించారు. జపాన్‌కు చెందిన రసాయనాల పరిశ్రమ "సిగాచి"లో భయంకరమైన ప్రమాదం జరిగింది. 54 మంది కార్మికులు దుర్మరణం పాలయ్యారు. 46 మంది ఆచూకీ మాత్రమే తేలింది. మిగిలిన వారి డిఎన్ఎ కోసం శాంపిల్స్ కూడా దొరకలేదు. సిఐటియు నాయకత్వంలో చేసిన ఆందోళన ఫలితంగా చనిపోయిన కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అంగీకరించక తప్పలేదు. రాష్ట్రంలో రకరకాల ఉద్యోగాల్లో రిటైరైన పెన్షనర్లు కూడా అభద్రతా భావంలో ఉన్నారు. వేల సంఖ్యలో కదులుతున్నారు. ప్రతికూల అంశాలను అధిగమిస్తూ, అనుకూల అంశాలను అందిపుచ్చుకుని కార్మికోద్యమాన్ని బలోపేతం చేయవలసిన బాధ్యత విప్లవ కార్మికోద్యమానికి ఉన్నది. ఆర్థికతత్వాన్ని అధిగమించాలి. కులం, మతం, ప్రాంతం వంటి అస్తిత్వ ప్రభావాల నుండి బయటపడాలి. ఆడ, మగ తేడా లేకుండా వివిధ తరగతులు, విభాగాలు, రంగాల కార్మికులు ఐక్యంగా కదలాలి. కార్మిక సంఘాలన్నీ కలిసి నడవాలి. కార్మిక-కర్షక ఐక్యత పెరగాల్సిన సమయమిది. సరిగ్గా ఇలాంటి నేపథ్యంలోనే ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెకు కార్మికవర్గం నడుం బిగించింది. ఈ పోరాటంలో ఉత్పత్తిని, మార్కెట్లను స్థంభింపజేయడం అత్యంత కీలకమైన అంశం. ఆ దిశలో కార్మికవర్గం పట్టుదలగా కదలాలి. *

# ట్రేడ్‌యూనియన్ల 'తటస్థత' బూటకం



**జార్జి డిమిట్రోవ్**

**.....**ట్రేడ్ యూనియన్ తటస్థత అనేది ఒక స్వచ్ఛమైన బూర్జువా భావన. రాజకీయంగా తటస్థంగా ఉండడం అనే ముసుగులో బూర్జువా వర్గమూ, కార్మికోద్యమంలోని దాని ఏజెంట్లూ (సంస్కరణవాదులూ వగైరా) వర్గపోరాటం నుండి ట్రేడ్ యూనియన్లను దూరం చేసేందుకు ప్రయత్నిస్తూ వచ్చారు. పెట్టుబడిదారీ వర్గ పాలనకు వారిని పనిముట్లుగా మార్చడానికి ప్రయత్నిస్తూవచ్చారు. నిజానికి ఏ దేశంలోనూ, ఎన్నడూ కూడా ట్రేడ్ యూనియన్లు తటస్థంగా ఉండలేదు. మొత్తం కార్మికోద్యమం అంతా దీనికి నిదర్శనంగా నిలుస్తుంది. ట్రేడ్ యూనియన్లు ఉంటే కార్మికవర్గ లక్ష్యానికి కట్టుబడి ఉండి పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా కృతనిశ్చయంతో పోరాడాయి, కార్మికవర్గానికి అనుకూలమైన రాజకీయ పోరాటాల్లో ఏదో ఒక విధంగా పాల్గొన్నాయి, లేకుంటే ఏదో ఒక రూపంలో బూర్జువా వర్గానికి సేవచేయడంలో నిమగ్నమైనాయి. బూర్జువా పార్టీలు అధికారం కోసం తమలో తాము పోట్లాడుకున్నప్పుడూ, చివరికి విముక్తికోసం కార్మికవర్గం చేసే పోరాటాలకు వ్యతిరేకంగా వారు చేసిన పోరాటాల్లోనూ ట్రేడ్ యూనియన్లు వాటికి సాధనాలుగా ఉపయోగపడ్డాయి.

నిజంగా ట్రేడ్ యూనియన్ తటస్థత అంటే అర్థమేమిటో రెండో ప్రపంచ యుద్ధం తెలియజెప్పింది. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికాల్లోని 'తటస్థ', 'స్వేచ్ఛా' ట్రేడ్‌యూనియన్లన్నీ సామ్రాజ్యవాదుల స్వంత పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు అనుగుణమైన విధానాల్లో భాగమైపోయి కార్మికవర్గ విముక్తి పోరాటానికి వెన్నుపోటు పొడిచాయి. నిజానికి శ్రమశక్తికీ, పెట్టుబడికీ మధ్య సహజమైన వైరుధ్యంవల్ల వాటిమధ్య జరిగే పోరాటంలో ట్రేడ్ యూనియన్లను 'తటస్థం'గా ఉండమనగలమా? అదీగాక అది ఈ రోజున, అంటే వర్గవైరుధ్యం పతాకస్థాయికి చేరుకున్న ఈ సమయంలో, పెట్టుబడిదారీ వర్గమూ, కార్మికవర్గమూ ఒకదానికొకటి ఎదురుబొదురు మోహరించి ఉన్న ఈ సమయంలో, అంతర్జాతీయ కార్మికవర్గ విప్లవం ప్రజ్వరిల్లిన ఈ తరుణంలో ట్రేడ్ యూనియన్ 'తాటస్థ్యం' గురించి మాట్లాడ్డం సాధ్యమా?

కార్మికవర్గపు రాజకీయ పార్టీల విషయంలో ట్రేడ్ యూనియన్లు ఈరోజున 'తటస్థంగా' ఉండాలి అనంటే అర్థం బూర్జువావర్గంమీద ఆధారపడమనీ, బూర్జువా పార్టీలకు సేవచేయమనీ వాటికి చెప్పడమే అవుతుంది. కార్మికుల విప్లవం పట్ల ట్రేడ్ యూనియన్లు తటస్థంగా ఉండటం అంటే అవి పెట్టుబడిదారీ ప్రతీఘాత-విప్లవానికి సహకరించడమే అవుతుంది. పెట్టుబడికి వ్యతిరేకంగా శ్రమతో ఉండాలి, లేకుంటే శ్రమకు వ్యతిరేకంగా పెట్టుబడితో ఉండాలి! విప్లవం పక్షానైనా వుండాలి, లేకుంటే ప్రతీఘాత-విప్లవం పక్షానైనా వుండాలి! మధ్యేమార్గం అంటూ లేదు! ఈ పని జరిగే సందర్భంలో 'రూపానికి' ఎటువంటి ప్రాధాన్యతా లేదు. విషయం యొక్క సారాంశమే ముఖ్యమైనది. కొన్ని ట్రేడ్ యూనియన్లను లాంఛనంగా 'తటస్థ', 'స్వతంత్ర' యూనియన్లు అని చెబుతున్నప్పటికీ అవి అలా ఎన్నటికీ ఉండలేవు. ఒకదానితో ఒకటి పోరాడుతున్న రెండు శిబిరాల్లోని ఏదో ఒక శిబిరంలో అవి చేరాల్సిందే.

కార్మికవర్గ రాజకీయ సంస్థల విషయంలోనూ, పోరాటాల విషయంలోనూ ట్రేడ్ యూనియన్లు తటస్థంగా ఉంటాయన్నదాన్ని కార్మికవర్గ పోరాటాల చరిత్ర తిరస్కరించడమే కాకుండా ఈ రోజున ట్రేడ్ యూనియన్లకూ, కమ్యూనిస్టు పార్టీకీ మధ్య మరింత సన్నిహితమైన సంబంధాలు అవసరమని చెబుతోంది. పెట్టుబడిదారీవ్యవస్థను కూలదోసి, కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పడానికీ, కమ్యూనిస్టు సమాజాన్ని సాధించడానికీ కార్మికవర్గం యొక్క రాజకీయ, వృత్తిపరమైన పోరాటాల మధ్య సంపూర్ణమైన సజీవ బంధం అవసరమని చెబుతోంది...

**(జార్జి డిమిట్రోవ్, ఏరిన రచనలు, మొదటి సంపుటిలో 'ట్రేడ్ యూనియన్ల కర్తవ్యాలు' అన్న భాగం నుండి ...ఇది తొలిసారిగా 1920 ఫిబ్రవరిలో ప్రచురితమైంది.)**

ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం

# ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక వ్యతిరేక విధానాలు - ప్రతిఘటన



రచయిత ఏపి సిఐటియు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సిహెచ్ నర్సింగరావు

కార్మికవర్గం నేడు కఠిన కాలంలో ఉంది. తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నది. కళ్లముందే ఉన్న హక్కులు కోల్పోతున్నది. వేతనాలు పడిపోతున్నాయి. సంఘటిత రంగంతో సహా వేలాది ఉద్యోగాలు కోల్పోతున్నారు. పని గంటలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. పని భద్రత లేదు. జీవితం అంతా పనిచేసినా పర్మినెంట్ కావడం లేదు. కాంట్రాక్టీకరణ బాగా పెరిగింది. పని ప్రదేశంలో భద్రతలేక డ్యూటీకి వెళ్లిన కార్మికులు ఫార్మా, రసాయన తదితర పరిశ్రమల్లో ప్రాణాలతో తిరిగి ఇంటికి వస్తారనే నమ్మకం కోల్పోతున్నారు. కార్మికుల సంక్షేమానికి రిటైర్‌మెంట్‌కు సంబంధించిన పెన్షన్, పీఎఫ్‌తో సహా ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యూటీ చట్టాలేవీ అమలు చేయడం లేదు. కార్మికులు యూనియన్ పెట్టుకోవడాన్ని కూడా యాజమాన్యాలు తీవ్రంగా అడ్డుకుంటున్నాయి. ఫిర్యాదులిచ్చినా పట్టించుకోని పరిస్థితిలో లేబర్ డిపార్ట్‌మెంట్ నిర్వీర్యం అయిపోయింది. శాస్త్ర, సాంకేతిక రంగాలు శరవేగంగా పెరుగుతున్న కాలంలో కార్మికవర్గానికి గతం కంటే మెరుగైన జీవితం ఉండాలి. కాని ఎందువల్ల నేడు కార్మికవర్గం ఇంత దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నది? అని లోతుగా పరిశీలించవలసిన సమయం ఇది.

ప్రపంచంలో పారిశ్రామిక విప్లవం వచ్చే నాటికి మనదేశంలో కార్మిక వర్గం బ్రిటీష్ సామ్రాజ్యవాదుల ఉక్కుపాదం క్రింద నలిగిపోయింది. మరోవైపున రైల్వే, టెక్స్‌టైల్స్, జ్యూట్ లాంటి అనేక రంగాల్లో తీవ్రమైన తిరుగుబాట్లు సాగాయి. మహాత్మా గాంధీతో సహా ఆనాటి జాతీయ నాయకులంతా ట్రేడ్ యూనియన్ నాయకులే. స్వాతంత్రానంతరం తమ పోరాటాల ఫలితంగా కార్మిక వర్గం హక్కులు, చట్టాలు సాధించారు. అనేక సంక్షేమ చట్టాలు అమలు చేయించుకోగలిగారు. అందుకే 1947 నుంచి 1991 వరకూ కార్మికవర్గం మెరుగైన హక్కులు సాధించుకున్న కాలం. 1991 - 92లో పి.వి .నరసింహారావు ప్రవేశపెట్టిన సరళీకరణ విధానాలు తిరోగమన మార్గాన్ని ప్రారంభించాయి. 2014 నుంచి మోడీ పాలనలో కార్మిక వర్గం పై దాడి మరింత తీవ్రం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని రాష్ట్రాలకు పోటీ పెట్టి చౌకగా కార్పొరేట్లకు భూములు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదానీ, టాటాలకు ఎకరా 99 పైసలకు పేద ప్రజల భూములు లాక్కొని కట్టబెడుతున్నారు. ఈ విషయంలో ఏపీ అగ్రభాగాన ఉంది. లూలు మాల్ యజమాని కేరళకు చెందినవాడు. అక్కడ కార్మిక చట్టాలను అమలు చేయకపోతే అక్కడ నుంచి తరిమి వేశారు. కానీ ఏపీలో లూలు మాల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల ప్రజాధనాన్ని రాయితీలుగా ఇస్తున్నది.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" గా మార్చారు. పి - 4 విధానం, ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం లాంటి నినాదాలు అన్నీ మోసపూరితం. పి-4 పేరుతో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వారికి కట్టబెట్టడం దారుణం. ప్రభుత్వ భూమి, ప్రభుత్వ పెట్టుబడి 70 శాతం పెట్టిన కాలేజీలను కూడా ప్రైవేట్‌కు ఇవ్వడం అంటే చంద్రబాబుకు ప్రైవేట్ పిచ్చి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

1991 జూన్‌లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాన్ని విడుదల చేశారు. ఇది కార్పొరేట్లకు పూర్తి అనుకూల విధానం. దేశ సంపదను వారికి దోచిపెట్టే సిద్ధాంతం. దేశంలోని భారీ ప్రభుత్వరంగ సంస్థలు, భూములు, గనులు, సముద్ర తీరాన్ని ఒక పథకం ప్రకారం కార్పొరేట్లకు కట్టబెట్టడం. 1947 స్వాతంత్రం వచ్చే నాటికి మన దేశంలో ఒక్క రంగంలో కూడా స్వయం సమృద్ధి లేదు. కానీ ప్రభుత్వ రంగం వల్ల 1970 నాటికి అన్ని రంగాల్లో స్వయం సమృద్ధిని సాధించాం. ఈ అభివృద్ధికి సోవియట్ యూనియన్, ఇతర సోషలిస్టు దేశాలు ఎంతో తోడ్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వ రంగం దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించింది. వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి, సామాజిక న్యాయం సాధ్యం అయ్యాయి. అయినా 1991 నుంచి భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మడం లేదా మూసివేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రంగం పెట్టుబడులు విరమించడం ప్రారంభమయ్యింది. 1991లోనే ఆర్థిక శాఖ మంత్రిగా మన్మోహన్ సింగ్ రెండేళ్లలో ప్రైవేటీకరణ అమలు చేస్తామని ప్రకటించారు. కానీ 33 ఏళ్లయినా కార్మిక వర్గం ప్రతిఘటన వల్ల ప్రైవేటీకరణ పూర్తిగా సాధ్యం కాలేదు.

పాలకవర్గం ప్రైవేటీకరణ విధానాల వలన కార్పొరేట్‌లు అత్యధికంగా లాభాలు సంపాదించారు. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచారు. ఫలితంగా కార్మికులు, ప్రజలు నష్టపోయారు. దేశంలోని మొదట మందుల పరిశ్రమ ఐడిపిఎల్‌ను కేంద్ర ప్రభుత్వం మూసివేసింది. ఈ పరిశ్రమపై ప్రైవేట్ పూర్తి ఆధిపత్యంతో మందుల ధరలు విపరీతంగా పెంచుతున్నారు. ప్రజలపై భారాలు తీవ్రంగా పెరిగాయి. విశాఖ స్టీల్ ప్రైవేట్ అయితే టన్ను స్టీల్‌ధర రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెరుగుతుంది. ప్రభుత్వ రంగం పోటీ ఉండడం కార్పొరేట్లకు నచ్చడం లేదు. ఎలాగైనా పాలకవర్గంపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేయడానికి బీజేపీని కార్పొరేట్లు ఉపయోగిస్తున్నారు. ప్రైవేట్ రంగం రావచ్చు. కానీ ఉన్న ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తే దేశానికి, సామాన్య ప్రజలకు

తీవ్ర నష్టకరం. బిఎస్‌ఎన్‌ఎల్ ను బలహీనం చేసి రిలయన్స్ ఆంబోతులాగా పెరిగింది. ప్రభుత్వ రంగం బలహీనం కావడంతో లక్షలాది మంది పర్మినెంట్ కార్మికులు ఉపాధి కోల్పోయారు. కార్మికుల కొనుగోలు శక్తి పడిపోయింది. దేశ ఆర్థిక సంక్షోభానికి ఇది మూలం.

1980 దశకంలోనే ప్రపంచ వ్యాప్తంగా ప్రైవేటీకరణ విధానాలు అమల్లోకి వచ్చాయి. మన దేశంలో బలమైన ప్రభుత్వ రంగం, ప్రభుత్వ రంగ ట్రేడ్ యూనియన్ ఉద్యమాల ఫలితంగా పాలక వర్గాలు వెనుకడుగు వేయక తప్పలేదు. కానీ 2014 నుంచి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తున్నాయి. దానికి ఉదాహరణే విశాఖ స్టీల్. గత ఐదు సంవత్సరాల నుంచి కార్మిక వర్గం విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నా బిజెపి కేంద్ర ప్రభుత్వం అనేక అడ్డదారుల్లో విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తూనే ఉంది. కార్మిక వర్గ పోరాటాల ఫలితంగా నేటికీ ఒక్క శాతం కూడా కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ వాటాలు అమ్మలేక పోయింది.

ఆంధ్రప్రదేశ్‌లో గత 30 సంవత్సరాలలో ప్రైవేట్ సంఘటిత రంగంలో స్పెషల్ ఎకనామిక్ జోన్ లపై కేంద్రీకరించింది. సముద్రతీరంలోని జిల్లాల్లో ఫార్మా, ఆక్వా రంగాలు బాగా విస్తరించాయి. రాయలసీమ జిల్లాల్లో సిమెంట్, మైనింగ్ రంగాలు పెరిగాయి. కార్మికులు చౌకగా దొరికే ప్రాంతాలుగా సత్యసాయి జిల్లా పెనుగొండలో 'కియా' కార్ల కంపెనీ, హిందూపూర్‌లో గార్మెంట్ కంపెనీల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. జిల్లాల వారీగా ప్రైవేట్ రంగంలో భారీ, మధ్యతరగతి పరిశ్రమలు పెరిగాయి. ప్రైవేట్ రంగంలోని పరిశ్రమల్లో యూనియన్ల ఏర్పాటు నామమాత్రంగా ఉంది. ప్రైవేట్ యజమానులు యూనియన్‌లు ఏర్పడకుండా తీవ్రంగా అడ్డుకుంటున్నారు.

గతంలో కంపెనీల గేట్లు పోరాట కేంద్రాలుగా ఉండేవి. స్పెషల్ ఎకనామిక్ జోన్‌లలో కార్మికులను కంపెనీ బస్సుల్లో నేరుగా పని ప్రదేశాల్లో దింపుతున్నారు. కరపత్రాలు పంచడం సాధ్యం కాదు. గేట్ మీటింగ్‌లు వినేవారు ఉండరు. వీరిలో పనిచేయడం అంటే నివాస ప్రాంతాల్లోనే సాధ్యం. 2006లో అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా)లో పెట్టిన బ్రాండెక్స్ కంపెనీలో పలు సార్లు కార్మికులు సమ్మెలకు దిగారు. 20 సంవత్సరాల్లో వారి జీతాలు సీనియర్స్‌కు నెలకు రూ. 15 వేలలోపు గానే ఉన్నాయి. బ్రాండిక్స్ అంతర్జాతీయ టెక్స్‌టైల్స్ కంపెనీ. బ్రిటన్ రాణికి కూడా ఇక్కడి నుంచే లోదుస్తులు వెళ్తాయి. కార్మికుల జీతాలు గొర్రెతోక బెత్తెడు చందంగా ఉంది. చౌక కార్మికుల కోసమే ఎస్‌ఈజెడ్‌లు వచ్చేయనేది నగ్న సత్యం.

“ కంపెనీ ఏదైనా ఎస్.ఇ.జెడ్., నాన్ ఎస్.ఇ.జెడ్ లలో కూడా యూనియన్లు రాకుండా కంపెనీల చుట్టూ ఉన్న ప్రాంతాల రాజకీయ నాయకులకు నెలసరి ప్యాకెట్స్ వెళ్తాయి. కొంతమంది గ్రామ నాయకుల పేరున కాంట్రాక్టులు ఉంటాయి. వారు కాంట్రాక్టర్లుగా ఏమీ చేయరు. కానీ ఆ పేరుతో మామూళ్లు ప్రతినెలా ముట్టుతాయి. కార్మికులు నివాసాల వద్ద యూనియన్లు గురించి చర్చించితే క్షణాల్లో వారి ఏజెంట్ల ద్వారా యాజమాన్యాలకు కబురు వెళ్తుంది. ఆ కార్మికులను అదే రోజు నుంచి డ్యూటీకి రాకుండా ఆపుతారు. ”



విశాఖ ఉక్కు పరిరక్షణోద్యమంలో భాగంగా నగరంలో భారత ప్రదర్శనలో సిహెచ్ నర్సింగరావు తదితరులు

కంపెనీ ఏదైనా ఎస్.ఇ.జెడ్., నాన్ ఎస్.ఇ.జెడ్ లలో కూడా యూనియన్లు రాకుండా కంపెనీల చుట్టూ ఉన్న ప్రాంతాల రాజకీయ నాయకులకు నెలసరి ప్యాకెట్స్ వెళ్తాయి. కొంతమంది గ్రామ నాయకుల పేరున కాంట్రాక్టులు ఉంటాయి. వారు కాంట్రాక్టర్లుగా ఏమీ చేయరు. కానీ ఆ పేరుతో మామూళ్లు ప్రతినెలా ముట్టుతాయి. కార్మికులు నివాసాల వద్ద యూనియన్లు గురించి చర్చించితే క్షణాల్లో వారి ఏజెంట్ల ద్వారా యాజమాన్యాలకు కబురు వెళ్తుంది. ఆ కార్మికులను అదే రోజు నుంచి డ్యూటీకి రాకుండా ఆపుతారు. లేదా భయపెట్టి యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొనకుండా నిఘా పెడతారు. కార్మికులకు జీతాలు పనిని బట్టి పెంచరు. యాజమాన్యానికి విధేయతను బట్టి వేతనాలు ఉంటాయి. ప్రైవేట్ పరిశ్రమల్లో పని పరిస్థితులు దారుణంగా ఉంటాయి. 12 గంటల డ్యూటీ, వారాంతపు సెలవులుండవు, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ మొదలగు చట్టాలు కూడా అమలు చేయరు. లేబర్‌కోడ్‌లు ప్రభుత్వాలు అమలు చేయక ముందే అదానీ గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టులు అమలు చేస్తున్నారు.

2023 డిసెంబర్ నుంచి 2024 జనవరి వరకూ ఏపీలో 42 రోజులు అంగన్‌వాడీల చారిత్రాత్మక సమ్మె సాగింది. సమ్మెకు ముందే పోరాట నిధి వసూలు చేసుకున్నారు. లక్షా 3 వేల మందిలో 42 రోజులు లక్ష మంది ప్రతి రోజు స్వంత భోజనాలతో ధర్నాలు సాగాయి. నాడు టీడీపీ అధికారంలో లేదు. వారి నాయకులు టెంట్లకు, భోజనాలకు లక్షలు ఇస్తామన్నా కార్మికులు తిరస్కరించారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి నోటీసులు ఇచ్చినా కార్మికులు భయపడకుండా ఎస్మా నోటీలకు దహన సంస్కారాలు చేశారు. సర్వీసు 62 సంవత్సరాలు పెరిగింది. మినీ సెంటర్లు సుమారు 6 వేలు పైగా మెయిన్ సెంటర్స్‌గా మారాయి. వారందరికీ నెలకు రూ. 4,500 జీతం పెరిగింది. కొత్తగా మినీ వర్కర్ ఉద్యోగాలొచ్చాయి. రిటైర్మెంట్ బెనిఫిట్ వర్కర్‌కు రూ. 1.20 లక్షలు ఆయాకు రూ. 60 వేలు

> **" రానున్నది పోరాట కాలం. పాలకులు ఎంత నిర్బంధం ప్రయోగిస్తే ఉద్యమాలు అంత ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. దాన్ని ఆపడం ఎవరి తరం కాదు. ఇది చరిత్ర నేర్పిన సత్యం. ఇప్పటికైనా పాలకులు ఉద్యమాలపై నిర్బంధం ఆపాలి. కార్మిక, రైతాంగానికి వ్యతిరేకమైన లేబర్‌కోడ్‌లు, చట్టాలు ఆపాలి. ఈ విధానాలు ఆపే వరకూ నిరంతర పోరాటాలు కొనసాగుతాయి. "**

సాధించారు. మట్టి ఖర్చులు కూడా సాధించారు. ఒక్క అంగన్‌వాడీని కూడా తొలగించకుండా డ్యూటీలో చేరారు. కానీ నేరుగా జీతం అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ పెంచలేదు. 'జీతాలు పెంచం' అనే మొండి సిద్ధాంతాన్ని బద్దలు చేయాలి. ఒక్కో రంగం విడిగా పోరాడితే ప్రభుత్వాలు భయపడవు. అన్ని రంగాలు కలిసి పోరాడితే ఏ ప్రభుత్వం అయినా దిగిరాక తప్పదు. కార్మికుల సంఖ్యతోనే ఏ ప్రభుత్వం అయినా భయపడుతుంది. ఇదే కాలంలో ఆశా, మున్సిపల్, సమగ్ర శిక్ష అభియాన్ సమరశీల పోరాటాలు జరిపి అనేక హక్కులు సాధించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ, విద్యుత్ రంగం రాష్ట్రంలో కీలకరంగాలుగా ఉన్నారు. వీరు తలుచుకుంటే రాష్ట్ర ప్రభుత్వమే స్థంభిస్తుంది. వీరికి రెండేళ్లు అయినా పీఆర్‌సీ గాని ఐఆర్ (తాత్కాలిక భృతి) గురించి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. రిటైరైన ఉద్యోగులకు సంవత్సరాల తరబడి బకాయి పెడుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 6 విడతల్లో బకాయిలు ఇస్తామని, అందులో ఒక బకాయి విడుదల చేసింది. కొన్ని సంఘాలు దీనినే గొప్పగా కొనియాడుతున్నారు. గత ప్రభుత్వం విద్యుత్ కార్మికులకు తీవ్ర ద్రోహం చేసింది. పర్మినెంట్ ఉద్యోగులకు 23 శాతం ఫిట్‌మెంట్‌ను 8 శాతానికి కోసింది. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు తెలంగాణా కార్మికుల కంటే చాలా తక్కువ జీతం చెల్లిస్తున్నది. తిరుపతిలోని టీటీడీ ఫారెస్టు కార్మికులు 3 సంవత్సరాలు పైగా సుదీర్ఘ పోరాటం నడిపి రెగ్యులరైజేషన్ సాధించారు. టీటీడీ సులభ్ మరియు కాంట్రాక్ట్ కార్మికులు సమరశీల పోరాటాలు నడిపి జీత భత్యాలు పెంచుకున్నారు.

27.1.2026 నాటికి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూరుశాతం అమ్మాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్ణయించి ఐదేళ్లు పూర్తి అయింది. గత 5 సంవత్సరాలు నుంచి నిరవధిక పోరాటాలు వేలాది మందితో సాగుతున్నాయి. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాలు జరిగాయి. బీజేపీ మినహా అన్ని పార్టీలు కార్మికుల పోరాటాన్ని సమర్థించాయి. సొంత గనుల కోసం సిఐటియు స్వతంత్రంగా 5 వేల మందితో 30 కి.మీ స్టీల్ ప్లాంట్ నుంచి సిటీ వరకూ మహాప్రదర్శన జరిగింది. ఇటీవల సిఐటియు మహాసభలో మొదటి తీర్మానం విశాఖ స్టీల్ పోరాటానికి మద్దతు పలికింది. విశాఖ స్టీల్ కార్మికులను అనేక రూపాలలో కేంద్ర ప్రభుత్వం వేధిస్తున్నది. సగం జీతం కూడా చెల్లించడం లేదు. ఇప్పుడు ఉత్పత్తితో ముడిపెట్టి జీతాలు పద్ధతి మనిషి మనిషికి తేడా సృష్టించింది. 2024 అక్టోబరు నుంచి 2025 అక్టోబరులోగా 10 వేల మంది పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించింది. కాంట్రాక్ట్ కార్మికులను 30 శాతం మందిని బయోమెట్రిక్ పద్ధతిలో నోటీసుగాని, నష్టపరిహారం కాని ఇవ్వకుండా తొలగిస్తున్నది. దేశంలోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఒక ప్రయోగశాలగా మార్చింది. రానున్న కాలంలో అన్నిచోట్ల ఇదే తంతు. కోల్ ఇండియాలో కూడా ప్రారంభమైంది. మరో కీలక ప్రభుత్వ రంగం అయిన హిందుస్థాన్ పెట్రోలియంలోని పర్మినెంట్ ఉద్యోగులు సుమారు 700 మందిని విశాఖ రిఫైనరీలో ఆఫీసర్లుగా మార్చింది. ఉద్యోగుల యూనియన్‌లు లేకుండా చేసే విధానం కేంద్ర ప్రభుత్వంలోని పెట్రోలియం విభాగంలో కొనసాగుతున్నది. కార్మిక సంఘాలను చంపడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

కార్మిక, రైతు నాయకులపై నిర్బంధానికి పరాకాష్ట నక్కపల్లి ఫార్మా నిర్వాసి నాయకుడు యం.అప్పలరాజుపై పి.డి. చట్టాన్ని ప్రయోగించడం. రాబోయే కాలం నిర్బంధానికి ఇది సంకేతం. రాష్ట్రంలో ఎక్కడైనా ఉద్యమాలను అణచడానికి నాయకులను 6 నెలలులోగా బెయిల్ రాకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం. టీడీపీ గత ప్రభుత్వ కాలంలో కార్మిక నాయకులను, కార్యకర్తలను పండగ పబ్బం అని కూడా చూడకుండా గృహ నిర్బంధం చేశారు. పొలాల్లో పనిచేసే వారిని కూడా బలవంతంగా తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లలో కూర్చోబెట్టారు. బస్సుల్లో, రైళ్లలో వచ్చే వారిని టికెట్‌లు ఉన్నా బలవంతంగా దించి పోలీస్ స్టేషన్‌లలో ఉంచారు. కార్మికులు సొంత బస్సుల్లో వచ్చే వారిని బస్సులతో సహా తీసుకెళ్లి పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టారు. అంగన్‌వాడీ సమ్మెను అణచడానికి ఎస్మా ప్రయోగించారు. ఎస్మాకు ఐసీడీఎస్‌కు సంబంధం ఏమైనా ఉందా? ప్రతి చిన్న నిరసనకు, ఊరేగింపులు కూడా జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. సభలు, చివరకు హాల్ మీటింగులకు కూడా పోలీసులు పర్మిషన్లు ఇవ్వకుండా కార్మికులను వేధిస్తున్నారు.

రానున్నది పోరాట కాలం. పాలకులు ఎంత నిర్బంధం ప్రయోగిస్తే ఉద్యమాలు అంత ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. దాన్ని ఆపడం ఎవరి తరం కాదు. ఇది చరిత్ర నేర్పిన సత్యం. ఇప్పటికైనా పాలకులు ఉద్యమాలపై నిర్బంధం ఆపాలి. కార్మిక, రైతాంగానికి వ్యతిరేకమైన లేబర్‌కోడ్‌లు, చట్టాలు ఆపాలి. ఈ విధానాలు ఆపే వరకూ నిరంతర పోరాటాలు కొనసాగుతాయి.

*


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం**

# మోడీ పాలనలో గ్రామీణ కార్మికుల దుస్థితి



ప్రభాత్ పట్నాయక్

వ్యవసాయ కార్మికుల నిజ వేతనాలలో కానీ, తక్కిన గ్రామీణ కార్మికుల నిజ వేతనాలలో కానీ 2014-2023 మధ్య పదేళ్ళ కాలంలో ఎటువంటి వాస్తవ పెరుగుదలా నమోదు కాలేదన్న వాస్తవాన్ని అనేకమంది అధ్యయనకారులు చేసిన తాజా పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. వ్యవసాయ కార్మికుల వినిమయ సూచీని, గ్రామీణ కార్మికుల వినిమయ సూచీని పరిగణనలోకి తీసుకుని, ఆ సూచీలలో వచ్చిన ధరల పెరుగుదలకు అనుగుణంగా గ్రామీణ కార్మికుల వేతనాలలో పెరుగుదల వచ్చిందా అన్న విషయాన్ని వారు పరిశోధించారు.

ఐతే ఇక్కడో సమస్య ఉంది. ఆ రెండు సూచీలూ 1986-87 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుని రూపొందించినవి. అంటే, 1986-87 నాటికి, దాదాపు 40 ఏళ్ళ క్రితం నాటి, వినిమయం ఉండిన తీరులోనే ఇప్పుడు కూడా ఉంటుందన్న ప్రాతిపదికన లెక్కలు వేసినవి. కానీ, ఈ 40 సంవత్సరాల కాలంలో ప్రజల వినిమయంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ మార్పుల్ని పరిగణనలోకి తీసుకోకపోతే ఈ తరగతుల ప్రజల మీద ధరల పెరుగుదల ప్రభావం ఎంత మోతాదులో ఉందో సరైన అంచనాకు రాలేము. అందుచేత సమీప కాలంలోని వినిమయ ధోరణుల్ని వ్యక్తం చేసే ప్రాతిపదికను ఎంచుకోవడం మంచిది. ఐతే ప్రభుత్వం 2010 ప్రాతిపదికన కొత్త సూచీని రూపొందించింది. కార్మికుల వేతనాల మీద ధరల పెరుగుదల వాస్తవ ప్రభావం ఎంత ఉంటుందో, దానికన్నా తక్కువ చేసి చూపించడం దీని వెనుక ప్రధాన ఉద్దేశ్యం. ఐనప్పటికీ ఆ 2010నే ప్రాతిపదికగా తీసుకుని చూస్తే అప్పుడు కూడా గ్రామీణ కార్మికుల నిజ వేతనాలలో పెరుగుదల ఏమీ లేదు సరికదా స్వల్ప తగ్గుదల నమోదైంది. ఉదాహరణకి, 2014-2023 మధ్య కాలంలో పొలాలను దున్నే కార్మికుల నిజవేతనాలు 2.7 శాతం తగ్గిపోయాయి. ఇదేమాదిరిగా తక్కిన వ్యవసాయ పనులకు చూసినా, తగ్గుదలే కనిపిస్తోంది తప్ప పెరుగుదల లేదు. దీనిని బట్టి గత దశాబ్ద కాలంలో గ్రామీణ కార్మికుల నిజవేతనాలు తగ్గిపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ ప్రభుత్వం తీరును కొట్టొచ్చినట్టు చూపించే విషయం ఇది. గతంలో ఏ ప్రభుత్వమూ జిడిపి వృద్ధి రేటు గురించి మోడీ ప్రభుత్వం చేసినంత ప్రచారం, హడావుడి చేయలేదు. నిజానికి ఈ జిడిపి కూడా గత ప్రభుత్వాల కాలంతో పోల్చితే మోడీ హయాం లో తక్కువ వృద్ధిరేటునే నమోదు చేసింది. ఎప్పుడు చూసినా భారతదేశ ఆర్థిక వ్యవస్థ 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతోందంటూ మోడీ వల్లిస్తున్నాడు. అతడి భజన బృందాలైతే ఇప్పటికే ఆ 5 లక్షల కోట్ల స్థాయిని దాటేసిందని భావిస్తున్నారు. ఈ జిడిపి వృద్ధి వ్యామోహంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి ఈ దేశ జనాభాలో అత్యంత పేదలుగా ఉన్న తరగతి-అంటే, గ్రామీణ కార్మికుల జీవన ప్రమాణాలు వాస్తవంగా దిగజారిపోతున్నాయి అన్న వాస్తవం కనిపించడంలేదు.

అంతే కాదు, అధ్యయన బృందం మరొక విషయాన్ని కూడా నిర్ధారించింది. 2014 నాటికే అమలులో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, గర్భిణీ స్త్రీల సంరక్షణ పథకం, సామాజిక భద్రతా పింఛన్లు, అంగన్వాడీ పథకం, మధ్యాహ్న భోజన పథకం వంటి 5 సంక్షేమ పథకాలను ఎన్డీయే ప్రభుత్వం దెబ్బ తీసింది. 2011 తర్వాత జనాభా లెక్కల సేకరణ జరగలేదు. బిజెపి ప్రభుత్వం దానిని నిలిపివేసింది. దానివలన కొత్తగా జనాభాలో ఈ కాలంలో చేరిన కోట్లాదిమంది నిరుపేదలు ప్రభుత్వ లెక్కల్లో లేరు. వారందరికీ ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలు అందడం లేదు. ఉపాధి హామీ పథకం కింద చెల్లించే వేతనాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా ఏ విధమైన పెరుగుదలా లేదు. పైగా చేసిన పనులకు చెల్లించవలసిన వేతనాల బకాయిలే నెలల తరబడి పేరుకుపోయాయి. కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు చెల్లించే పింఛను ఎప్పటినుంచో ఆ రూ.200 దగ్గరే నిలిచిపోయింది. గర్భిణీ స్త్రీలకు వర్తించే సంక్షేమ పథకం ఒక బిడ్డ వరకు మాత్రమే పరిమితం చేశారు. అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో 40 శాతం కోత పెట్టారు.

మొత్తంగా చూసుకుంటే మోడీ పాలనా కాలంలో గ్రామీణ కార్మికుల నిజవేతనాలు తగ్గిపోవడమే కాక, వారికి వర్తించే సంక్షేమ పథకాలలో కూడా కోతలు పడ్డాయి. కరోనా కాలంలో ప్రతీ కుటుంబానికి 5 కిలోల ఉచిత బియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశ పెట్టిన మాట నిజం. అది నేటికీ కొనసాగుతోంది. ఐతే దాని వలన కలిగే ఫలితం చాలా స్వల్పం. వేతనాల తరుగుదల, సంక్షేమంలో కోత ప్రభావం చాలా ఎక్కువ.

నిజానికి స్వతంత్రం వచ్చిన తర్వాత, గ్రామీణ కార్మికుల నిజవేతనాల్లో ప్రతీ ఏడూ ఎంతో కొంత పెరుగుదల ఉంటూ వచ్చింది. 2014-15 నుంచీ మాత్రం అది తిరుగు ముఖం పట్టింది. కొంతకాలం ఏ పెరుగుదలా లేకుండా స్తబ్దంగా ఉండి, చివర్లో ఏకంగా తగ్గడం ప్రారంభించింది. మోడీ ప్రభుత్వం పలు అవకతవక ఆర్థిక విధానాలను అనుసరించింది. పెద్ద నోట్ల రద్దు అటువంటి చర్యల్లో ఒకటి. దాని వినాశకర ప్రభావం గ్రామీణ పేదలమీద ఆ తర్వాత కాలంలో స్పష్టంగా కనిపించింది. అదే మాదిరిగా జిఎస్టి ని ప్రవేశపెట్టడం కూడా మరో చర్య. దానివలన చిన్న ఉత్పత్తి వ్యవస్థలమీద చాలా ప్రతికూల ప్రభావం పడింది. దాని ఫలితంగా నిరుద్యోగం కూడా పెరిగింది. దాని వలన నిజవేతనాలలో పెరుగుదల లేకుండా పోయింది. కోవిడ్-19 కాలంలో విధించిన దారుణమైన లాక్డౌన్ మరొక వినాశకర చర్య. దీని ఫలితంగా ఉత్పత్తి పూర్తిగా దెబ్బతింది. నిరుద్యోగం పెరిగింది. నిజవేతనాలు ఎక్కువ మోతాదులో



పడిపోయాయి. ఐతే, అంతకు ముందు నుండే, అంటే, 2014 నుండీ గ్రామీణ కార్మికుల వేతనాలలో పెరుగుదల లేకుండా పోడానికి కారణం ఏమిటి?


నయా–ఉదారవాద వ్యవస్థలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం దీనికి ప్రధాన కారణం. 2008లో అమెరికాలో బద్దలైన రియల్ ఎస్టేట్ బుడగ ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపించింది. ఐతే, అప్పటికి అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం ప్రభుత్వ వ్యయాన్ని పెంచే దిశగా కొన్ని చర్యలు తీసుకుంది. దానివలన ఆ సంక్షోభ ప్రభావం మన దేశం మీద తక్కువగా పడింది. ఐతే, 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆ విధానాన్ని పూర్తిగా మార్చేసింది. నయా–ఉదారవాదం కోరుకున్నట్టు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించింది. దాని ఫలితంగా దేశ స్థూల డిమాండు స్థాయి దెబ్బతింది. దాని పర్యవసానంగా దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ఆర్థిక వ్యవస్థకు తగిలిన దెబ్బ ప్రభావం గ్రామీణ భారతం మీదనే అత్యధికంగా పడింది. గ్రామీణుల నిజవేతనాలు పడిపోయాయి.

నిజవేతనాలు తగ్గిపోవడం, ఉపాధి అవకాశాలు పడిపోవడం అనే ఈ రెండు ధోరణులూ ఒకదానిని ఇంకొకటి ప్రకోపింపజేస్తాయి. నిరుద్యోగం తక్కువగా ఉంటే, వేతనాలు పడిపోవు. ఎంతో కొంత పెరుగుతాయి. నిజవేతనాలు పడిపోతున్నాయి అంటే అదే కాలంలో నిరుద్యోగం కూడా పెరుగుతోందన్న మాటే. అంటే ఏక కాలంలో గ్రామీణ పేదలు అటు నిజవేతనాల్లో తగ్గుదలను, ఇటు నిరుద్యోగం పెరుగుదలను చవిచూడవలసి వస్తోందన్నమాట. రోజు కూలీ రేటు నిజ విలువ తగ్గడమే గాక, పనులు దొరికే రోజుల సంఖ్య కూడా తగ్గిపోతోందన్నమాట. అంటే వారి వేతనాల నిజవిలువ మాత్రమే గాక, వారికి లభించే నిజఆదాయాలు కూడా పడిపోతున్నాయి. దీనికి తోడు సంక్షేమ పథకాలలో కూడా కోత పడుతోంది. ఇదంతా కలిపి చూస్తే గ్రామీణ పేదలు అనుభవించే పరిస్థితులు ఎంత దుర్భరంగా మారుతున్నాయో పూర్తి చిత్రం కనిపిస్తుంది.

బిజెపి పాలన వర్గ స్వభావం ఎంత ప్రజావ్యతిరేకమో ఇప్పుడు స్పష్టంగా తెలుస్తున్నది. ఈ దశాబ్ద కాలపు మోడీ పాలనలో దేశంలోని గుత్త పెట్టుబడిదారీ కార్పొరేట్లు, అందునా ముఖ్యంగా మోడీకి అత్యంత ప్రీతిపాత్రులైన కొత్త బడా కార్పొరేట్లు ఎంతగా తమ సంపదలను పెంచుకున్నారో, ఆదాయాల్లో, సంపదలో అసమానతలు ఎంతగా పెరిగిపోయాయో మనం చూస్తున్నాం. బ్రిటిష్ పాలన కాలంలోని మహారాజులకు, అప్పటి సామాన్యులకు మధ్య ఉండిన ఆర్థిక అసమానతల కన్నా ఇప్పుడు దేశంలోని అత్యధిక సంపన్నులైన ఒక శాతం జనాభాకి, తక్కిన 99 శాతం జనాభాకి మధ్య అసమానతలు ఎంతో ఎక్కువ. ఇందులో అందరికన్నా ఎక్కువగా నలిగిపోతున్నది మన గ్రామీణ పేదలే.

(స్వేచ్ఛానుసరణ)

# ఆందోళన లేనిదే అభివృద్ధి లేదు



**యూజిన్ డెబ్స్**

ఆందోళన అనేది ఒక ప్రకృతి సూత్రం. ప్రకృతి శూన్యాన్ని అసహ్యించుకునేట్లే నిశ్శబ్దాన్ని కూడా అసహ్యించుకుంటుంది. కొందరు దీనికి అభ్యంతరం చెప్పొచ్చు. కొండలను చూపించి అవి ఎంత నిశ్చలంగా ఉన్నాయో చూడండి అని తమ సిద్ధాంతాన్ని సమర్థించుకోవచ్చు. కాని ఆ కొండలు కూడా ఆందోళన ఫలితమేనన్న విషయం వారు మరిచిపోతున్నారు. సముద్రం ఎన్నడూ నిశ్చలంగా ఉండదు. నిత్యం అలలు పడుతూ లేస్తూ ఉంటాయి. తుపానుకు ముందు 'ప్రశాంతత' ఉంటుంది. కానీ అది తుపానుకు సూచన మాత్రమే.

శాంతియుతంగా చక్కదిద్దుదాం అనుకునేవారూ, నిశ్శబ్ద, నిశ్చల, బద్ధకపు జీవులూ, స్తబ్దతను గొప్పగా చెప్పుకునేవారూ ఎన్నటికీ విజయం సాధించలేరు. ప్రకృతి ఆందోళన కోరుతుంది. అందువల్లనే గాలివానలొస్తాయి. తుపానులొస్తాయి. మెరుపులూ, ఉరుములూ పుడతాయి. అగ్నిపర్వతాలు బద్దలవుతాయి. భూ కంపాలు సంభవిస్తాయి. వాటిని దుష్ట శక్తులన్నా ఉపయోగం ఏమీ లేదు. అవన్నీ స్తబ్దతకు వ్యతిరేకంగా సంభవించే నిరంతర నిరసనలు.

శాంతి, శాంతి అని అరవచ్చు. కాని శాంతి ఎక్కడా లేదు. పంచభూతాలమధ్య యుద్ధం కొనసాగుతుంది. శాంతి కోసం ఆరాటపడేవారంతా ఆందోళనా కారులే. నిత్యం దైవ ప్రార్థన చేసే పూజారి ఆందోళనా కారుడే. మతనమ్మకాలూ, మూఢవిశ్వాసాలపై తిరుగుబాటు చేసే వారు బహుశా మరింత ఉధృతమైన ఆందోళన కారులు. ... ప్రపంచాన్ని పరిశోధించేవారంతా ఆందోళనాకారులే. మతంలోనూ, నైతిక విలువల్లోనూ, సైన్సులోనూ, ప్రభుత్వంలోనూ, భూగోళశాస్త్రంలోనూ ఇంకా చెప్పాలంటే మానవ కార్యకలాపాలకు సంబంధించిన అన్ని విభాగాల్లోనూ మార్గదర్శకులంతా ఆందోళనాకారులే. కృషి ప్రారంభించిన ప్రారంభంలోనే ఎవరూ, ఎన్నడూ ప్రతిష్ట సంపాదించలేదు. వాళ్లంతా సహజంగానే ప్రారంభంలో అపహాస్యానికీ, అవమానాలకూ, నిర్లక్ష్యానికీ, పేదరికానికీ గురయ్యారు. తరచూ శిక్షలు కూడా అనుభవించారు. వీటినుండి తప్పుకున్న వారు చాలా కొద్ది మందిమాత్రమే.....కాని వారంతా చివరికి మానవజాతికి మేలు చేయడంలో విజయాలు సాధించారు.

కార్మిక ఆందోళనాకారులగురించి ఇప్పుడు కొందరు చులకనగా మాట్లాడుతున్నారు. యజమాని నిశ్చలత్వాన్ని, నిలకడను కోరుకుంటాడు. పూర్తిగా ఒంటరిగా ఉండాలనుకుంటాడు. కానీ ఆందోళనాకారుడు అలా ఎన్నటికీ కోరుకోడు. కార్మిక సమస్య వెనుక లెక్కకట్టలేనంత శత్రుత్వం దాగి ఉంటుంది. కార్మిక ఆందోళనా కారులు దీన్ని వెలికి తీసి నగ్నంగా ప్రదర్శించడానికి, ఎండగట్టడానికీ, అంతిమంగా ప్రపంచంలో అది లేకుండా చేయడానికీ ప్రయత్నిస్తారు.....

**(యూజిన్ డెబ్స్ (1855–1926) అమెరికా రైల్వే యూనియన్ నాయకుడు, అమెరికా సోషలిస్టు పార్టీ నాయకుడైనాడు. మొదటి ప్రపంచ యుద్ధాన్ని విమర్శించినందుకు అరెస్టయి జైల్లో ఉంటూనే అమెరికా అధ్యక్ష పదవికి పోటీచేసి 10 లక్షల ఓట్లు తెచ్చుకున్నారు. 'ఆందోళన – ఆందోళనాకారుడు' అన్న పేరుతో ఆయన రాసిన వ్యాసంలోనిది పై వ్యాఖ్యానం. 1890 ఆగస్టులో లోకోమోటివ్ ఫైర్‌మెన్స్ మ్యాగజైన్‌లో వ్యాసం ప్రచురించబడింది.)**

ఫిబ్రవరి 12 కార్మిక సమ్మె ప్రత్యేకం

# నాయకుల హత్యల నుండి లేబర్ కోడ్‌ల వరకు...

## నానాటికీ దిగజారుతున్న కార్మికవర్గ పరిస్థితులు



రచయిత్రి ట్రేడ్‌యూనియనిస్టు, మానవహక్కుల న్యాయవాది

**సుధా భరద్వాజ్**

**1990** దశాబ్దం నుండి భారత దేశ కార్మికవర్గ పరిస్థితులలో తీవ్రమైన మార్పులు వస్తున్నాయి. యూనియన్ల నాయకులను హత్య చేయటం నుండి ఉద్యోగాలను సామూహికంగా కాంట్రాక్టీకరణ చేయటం, వేతనాలను తగ్గించటం, కార్మికుల రక్షణకు ప్రమాదం కల్పించే నూతన లేబర్ కోడ్‌లను ఆమోదించటం వరకు జరుగుతున్న మార్పులన్నీ కార్మికుల పరిస్థితులను క్రమంగా దిగజారుస్తున్నాయి.

1990వ దశాబ్దంలో "సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ" (ఎల్‌పిజి) విధానాల అమలు ప్రారంభం కావటంతో కార్మికవర్గం పట్ల భారత ప్రభుత్వ వైఖరిలో గణనీయమైన మార్పు వచ్చింది. ఎల్‌పిజి విధానాల ప్రారంభ సంవత్సరాలలో కార్మిక నాయకులను హత్య చేయటం సంచలనం కలిగించింది. కనీస వేతనాల అమలు కోసం జన నాట్యమంచ్ కళాకారుడైన సఫ్దర్ హష్మి, ఆయన దళంలోని సభ్యులు 1989, జనవరి 1వ తేదీన సహిబాబాద్ పారిశ్రామిక ప్రాంతంలోని జండాపూర్ గ్రామంలో నాటక ప్రదర్శన చేస్తుండగా, కాంగ్రెస్ కార్పొరేటర్ అనుచరులు వారిపై ఇనుపరాడ్లతో దాడి చేశారు. రామ్ బహదూర్ అనే కార్మికుడు అక్కడికక్కడే చనిపోయాడు. హష్మి తీవ్రమైన గాయాలతో మరుసటి రోజు ఆసుపత్రిలో మరణించాడు. ఆయన మరణించిన మూడవ రోజు 1989, జనవరి, 4వ తేదీన తీవ్రమైన దు:ఖంలో మునిగివున్న హష్మి భార్య మలయశ్రీ హష్మి అర్ధంతరంగా ముగించిన నాటికను అదేచోట తిరిగి ప్రదర్శించటాన్ని వేలాది మంది కార్మికులు, విద్యార్థులు, కళాకారులు, ప్రజలు తిలకించారు. ఈ సంఘటన చూపరుల నరాలలో విద్యుత్‌ను ప్రవహింపజేసింది.

ఛత్తీస్‌ఘర్‌లో కాంట్రాక్టు కార్మికులలో ప్రముఖ నాయకునిగా గుర్తింపు పొందిన శంకర్ గుహ నియోగిని భిలాయ్‌లోని ఆయన ఇంట్లో నిద్రపోతుండగా, 1991, సెప్టెంబరు, 28వ తేదీ ఉదయం తుపాకితో కాల్చి చంపారు. మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీ నాయకుడైన నియోగి ఛత్తీస్‌ఘర్ ముక్తిమోర్చాను ఏర్పాటు చేసి, ఆ రాష్ట్రంలోని దల్లి రఝూరా గనులు కేంద్రంగా కార్మికులు, రైతులను సమీకరించారు. ఆయన నాయకత్వంలోని యూనియన్ ఆ ప్రాంతంలో అనేక పాఠశాలలనూ, ఒక ఆసుపత్రినీ, ఒక సాంస్కృతిక దళాన్ని, ఒక ఫుట్‌బాల్ టీంను



సఫ్దర్ హష్మి

ఏర్పాటు చేయటంతో పాటు, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా కార్మికులలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. సింప్లెక్స్, కేడియా గ్రూపు పారిశ్రామిక వేత్తలు, పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్, బిజెపి రాష్ట్ర ప్రభుత్వం కలిసి తనను హత్య చేయటానికి కుట్ర పన్నారని నియోగి టేప్ రికార్డర్‌లో తన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశాడు.

బొంబాయి టెక్స్‌టైల్స్ మిల్లు కార్మికుల సమ్మెకు నాయకత్వం వహించిన జనాకర్షణ కలిగిన నాయకుడు దత్తా సామంత్‌ను బాంబేలోని పొవాయ్‌లోని తన ఇంటి నుండి బయటికి వస్తున్నపుడు చంపివేశారు. అప్పటికి 65 మిల్లులు మూతపడి, 2.5 లక్షల మంది కార్మికులు పనులు కోల్పోయారు. ప్రీమియర్ ఆటోమొబైల్స్ లాకౌట్ ప్రకటించటం, మిల్లుకు సంబంధించిన భూముల వివాదం, కార్మిక సంఘాల మధ్య విభేదాలు, ప్రత్యేకంగా శివసేనతో ఉన్న శతృత్వం ఈ హత్యకు దారి తీసిందని ప్రచారం జరిగింది. సామంత్ హత్యలో నిందితునిగా ఉన్న ఛోటా రాజన్‌ను 26 సంవత్సరాల తర్వాత, 2023లో విడుదల చేశారు.

### కాంట్రాక్టు విధానం దుష్ఫలితాలు

1970లో తీసుకొచ్చిన కాంట్రాక్టు కార్మికుల (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్) చట్టం కాంట్రాక్టైజేషన్‌ను దాని నిజరూపంలో చూపించింది. కాంట్రాక్టు కార్మికులకు రెగ్యులర్ కార్మికులకు వచ్చే సదుపాయాలను నిరాకరించే సాధనమే ఈ చట్టం అని పేర్కొంది. ఏ రంగంలో అయినా శాశ్వత స్వభావం కలిగిన పనులు, నిరంతరం చేయాల్సిన పనులు ఉండి, పర్మినెంట్ కార్మికులు అవసరమైన రంగాలలో కాంట్రాక్టు కార్మికులను వినియోగించటాన్ని ఈ చట్టం నిషేధించింది. ఈ చట్టం సక్రమంగా అమలు జరగకుండా ఏ విధంగా ఆటంకాలు కలిగించారనే అంశంపై చర్చ ఈ వ్యాసం పరిధిలో లేదు. కానీ ఒక్క విషయం మాత్రం చెప్పవచ్చు. అదేమంటే, వివిధ రంగాలలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయటానికి ప్రభుత్వాలు ప్రయత్నం చేయటం లేదు, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సలహా సంఘాలకు ఈ పని చేయటానికి అవసరమైన అధికారాలు లేవు.

2001లో స్టీల్ అథారిటి ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు, నేషనల్ వాటర్ ఫ్రంట్ వర్కర్స్ యూనియన్ మరియు ఇతరులకు మధ్య కేసులో న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పు కార్మికవర్గాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. కాంట్రాక్టు విధానాన్ని

“ఈ రోజు అతి పెద్ద పారిశ్రామిక సంస్థలలో పని చేస్తున్న కార్మికులలో 10 శాతం మంది కూడా పర్మినెంట్ కార్మికులు లేరు. ఉదాహరణకు ఛత్తీస్‌ఘర్‌లోని భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీలో 1960లలో 96,000 మంది పర్మినెంట్ కార్మికులు ఉండేవారు. ఇపుడు వారి సంఖ్య 12,000 కు తగ్గిపోయింది. కానీ 50,000 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్న వేతనాలలో కొద్ది మొత్తం మాత్రమే వారికి ఇస్తున్నారు.”

రద్దు చేసిన పోస్టులలో అనేక దశాబ్దాలుగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నప్పటికీ, వారిని ఆ పోస్టులలో నియమించాల్సిన అవసరం లేదని ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. వాస్తవమేమిటంటే ఆ సంస్థ నిబంధనలను అనుసరించి ఇతర శాశ్వత అభ్యర్థులను పనిలోకి తీసుకుంటే వీరంతా పనులు కోల్పోతారు. “కోర్టులకు రావద్దు, మీకు ఇక్కడ న్యాయం జరుగుతుందనే ఆశ వద్దు” అన్న సందేశాన్ని ఈ తీర్పు కార్మికులకు ఇచ్చింది.

కోర్టులలో ఏ అంశంలోనూ కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరగలేదనేది దీని అర్థం కాదు. ఇందుకు ముఖ్యమైన ఉదాహరణ బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు కచ్రా వహతక్ శ్రామిక్ సంఘ్ నాయకత్వంలో కోర్టులలోనూ, వీధులలోనూ పోరాటాలు చేసి, పర్మినెంట్ కార్మికులుగా నియామకం చేయించుకున్నారు.

ఈ రోజు అతి పెద్ద పారిశ్రామిక సంస్థలలో పని చేస్తున్న కార్మికులలో 10 శాతం మంది కూడా పర్మినెంట్ కార్మికులు లేరు. ఉదాహరణకు ఛత్తీస్‌ఘర్‌లోని భిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీలో 1960లలో 96,000 మంది పర్మినెంట్ కార్మికులు ఉండేవారు. ఇపుడు వారి సంఖ్య 12,000 కు తగ్గిపోయింది. కానీ 50,000 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్న వేతనాలలో కొద్ది మొత్తం మాత్రమే వారికి ఇస్తున్నారు.

గ్యారంటీగా పని దొరుకుతుందన్న నమ్మకం లేకపోవటం వలన కాంట్రాక్టు విధానం తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తున్నది. మొదటగా కార్మికులు యూనియన్లలో చేరటాన్ని అసాధ్యం చేస్తున్నది. సాధారణంగా ఒక యూనియన్‌ను రిజిష్టర్ చేయటానికి ముందు మొత్తం ఆ బ్యాచ్ కార్మికులందరినీ కాకపోయి నప్పటికీ, నాయకులను తప్పని సరిగా పనుల



శంకరగుహ నియోగి      దత్తా సామంత్

నుండి తొలగిస్తారు. దశాబ్దాల తరబడి పని చేసిన తర్వాత కూడా వీరికి రాత పూర్వకమైన ఆధారాలు, అపాయింట్‌మెంట్ లెటర్లు, గేట్ పాస్‌లు, శాలరి స్లిప్స్ లాంటివేమీ ఉండవు. అందువలన న్యాయ ప్రక్రియ చాలా కష్టంగా ఉంటుంది. ప్రమాదకరమైన, కష్టమైన, ఎక్కువ గంటలు చేయాల్సిన పనులు ఈ కార్మికులకు అప్పగిస్తారు. పర్మినెంట్ కార్మికులు సూపర్వైజర్లుగా వారి పనిని పర్యవేక్షిస్తారు. మూడవది, వారి వేతనాలు అతి తక్కువగా ఉంటాయి. కొన్ని సందర్భాలలో ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల కన్నా తక్కువగా ఉంటాయి.

ఈ రోజు కార్మికులలో 83 శాతం సంఘటిత పారిశ్రామిక కార్మికుల జాబితాలో లేరు. 93 శాతం అసంఘటిత రంగంలో ఉన్నారు. కార్మికవర్గానికి ఇస్తున్న అతి హీనమైన వేతనాలను గురించి ఈ మధ్య విడుదల చేసిన ఐఎల్‌ఓ నివేదికలో ప్రస్తావించారు. “కోవిడ్–19 సమయంలో వేతనాలు, కనీస వేతనాలు” అని ఈ నివేదికకు పేరు పెట్టారు. కార్మికుల నిజ వేతనాల పెరుగుదలలో భారతదేశం ఆసియాలో అట్టడుగున ఉన్నదని నివేదికలో పేర్కొన్నారు. భారతదేశంలో “నిజవేతనాలు” 2015లో 2.8 శాతం, 2016లో 2.6 శాతం, 2017లో 2.5 శాతం మాత్రమే పెరిగాయని, 2018లో ఏ మాత్రం పెరగలేదని నివేదికలో చెప్పారు.

### సుదీర్ఘమైన అనిశ్చిత ప్రయాణం

కాంట్రాక్టు కార్మికులకు గృహ వసతి, వైద్యం, తమతో పాటు పని చేస్తున్న పర్మినెంటు కార్మికులకు ఇస్తున్నట్లుగా కనీసం క్యాంటిన్‌లో సబ్సిడి ఆహారం కూడా ఇవ్వరు. ఈ కార్మికులలో ఎక్కువ మంది వెనుకబడిన ప్రాంతాల నుండి వలస వచ్చిన వారై ఉంటారు. ఫలితంగా వారు మరింత సులభంగా దోపిడీకి గురవుతుంటారు.

కోవిడ్–19తో లాక్‌డౌన్ ప్రకటించినపుడు ఈ కార్మికుల పరిస్థితి ఏమిటో టెలివిజన్‌లలో చూశాం. కోటిమందికి పైగా వలస వచ్చిన కార్మికులు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తమ స్వస్థలాలకు చేరటానికి కాలినడకన ప్రయాణం చేశారు.

### నిజ వేతనాల పెరుగుదల

మన చుట్టూ ఉన్న దేశాలైన పాకిస్తాన్, శ్రీలంక, చైనా, నేపాల్ కన్నా మనదేశంలో నిజ వేతనాల పెరుగుదల తక్కువగా ఉన్నది. పాకిస్తాన్‌లో 2015లో 8.9 శాతం, తర్వాతి మూడు సంవత్సరాలు నాలుగు శాతం చొప్పున వేతనాలు పెరిగాయి. వియత్నాంలో 3.7 శాతం, 12.4 శాతం చొప్పున, చైనాలో 2015–18లలో సంవత్సరానికి 5–5.7 శాతం చొప్పున వేతనాలు పెరిగాయి. కోవిడ్‌కు ముందు 2018లో కొనుగోలు శక్తి ప్రాతిపదికన మనదేశంలో నెలకు 215 డాలర్ల ఆదాయం వస్తున్నది. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోని 30 దేశాలలో, బంగ్లాదేశ్, సోలోమన్ ఐలాండ్స్ తర్వాత తక్కువ వేతనాలు ఇస్తున్న మూడవదేశంగా భారతదేశం ఉన్నది.

కోవిడ్ మహమ్మారి తగ్గిపోయిన తర్వాత వ్యవసాయంలో పనులు దొరకకపోవటం, గ్రామాలలో కూలిరేట్లు తగ్గిపోవటంతో వలస కార్మికులలో ఎక్కువ మంది నగరాలకు తిరిగి వచ్చారు. ఐఎల్‌ఓ నివేదిక ప్రకారం కోవిడ్ తర్వాత సంఘటిత రంగంలోని ఉద్యోగుల వేతనాలు సగటున 3.6 శాతం మాత్రమే తగ్గగా, అసంఘటిత రంగంలోని కార్మికుల వేతనాలు 22.6 శాతం తగ్గాయి.

ఈ కాలంలో కార్మికవర్గంలోని వివిధ తరగతులు, నిర్మాణరంగ కార్మికులు, ఇళ్ళలో పనులు చేసేవారు, బజార్ల వెంట తిరుగుతూ సరుకులు అమ్మేవారు, ఇంటివద్ద ఉండి పనులు చేసేవారు, ఓలా, ఊబర్ డ్రైవర్లు, సరుకులు ఇంటికి తీసుకొచ్చి ఇచ్చేవారు, యాప్‌బేస్డ్ సర్వీస్ కార్మికులు తమ పనిలో ఎదురౌతున్న ప్రత్యేక సమస్యల పరిష్కారం కోసం వివిధ పద్ధతులలో సంఘటితం కావటానికి ప్రయత్నం చేశారు. ఫ్యాక్టరీలలో రెగ్యులర్‌గా పనిచేసే కార్మికులకు

వర్తించే నిబంధనలు వీరికి వర్తించవు. 1. పనిచేసే ప్రదేశాలు మారుతూ ఉంటాయి. 2. యజమానులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో పాటు తరచుగా మారుతూ ఉంటారు. 3. ముక్కలు ముక్కలుగా అందే వేతనాలు కనీస వేతనం మేరకు ఉండవచ్చు లేదా ఉండక పోవచ్చు. యాప్ బేస్డ్ కార్మికులను భాగస్వాములుగా చూయిస్తారు. యజమానులను క్రమశిక్షణలో ఉంచటానికి ప్రభుత్వం ప్రయత్నం చేయకపోవటం వలన కొన్ని సందర్భాలలో న్యాయపరమైన అంశాలు ఎదురౌతుంటాయి.

గ్రామీణ ప్రాంతంలోని ఆరోగ్యరక్షణ వ్యవస్థ బాధ్యత అంతా వలంటీర్లుగా ముద్ర వేసిన ఆశా, అంగన్‌వాడి వర్కర్ల భుజస్కంధాలపై ఉన్నది. తమను కార్మికులుగా గుర్తించాలనీ, కార్మికుల లాగే అన్ని విధాలైన హక్కులు, ప్రయోజనాలు కల్పించాలనీ వీరు పోరాటాలు చేస్తున్నారు. నిర్మాణ కార్మికులు లాంటి కొన్ని తరగతులు, ఇంటిపని కార్మికులు, హాకర్లు, గిగ్ వర్కర్లు తదితరులు తమ హక్కులు, రక్షణ, ఇతర ప్రయోజనాలను సాధించుకోవటం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో లాబీయింగ్‌కు ప్రయత్నం చేస్తున్నారు.

ప్లాంటేషన్ కార్మికుల చట్టం 1951, గనుల చట్టం 1952, వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1958, మోటారు ట్రాన్స్‌పోర్టు కార్మికుల చట్టం 1961, బీడి అండ్ సిగార్ కార్మికుల చట్టం 1966, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టం 1976, సినిమా కార్మికులు, సినిమా హాలు కార్మికుల చట్టం 1981, డాక్ కార్మికుల చట్టం1986, భవన నిర్మాణం, ఇతర నిర్మాణ కార్మికుల చట్టం 1996లను రద్దు చేస్తూ ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండిషన్స్‌పై కోడ్‌ను 2020లో తీసుకువచ్చారు. అయితే దురదృష్టమేమంటే పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించిన ఈ కోడ్‌ను ఇప్పటికీ నోటిఫై చేయలేదు.

### నూతన కార్మిక కోడ్‌లు

నూతన లేబర్ కోడ్‌ల వలన ప్రతిరంగంలోనూ కార్మికులు అనేక ప్రయోజనాలను కోల్పోతారు. వివిధ రకాలైన సమస్యలు ఎదుర్కొంటారు. అటువంటి వాటిలో ఒకటైన నిర్మాణ కార్మికుల చట్టాన్ని మనం పరిశీలిస్తే, ఈ కోడ్ అమలుతో చట్ట ప్రకారం కార్మికులను రిజిష్టర్ చేయటం, గుర్తింపు కార్డులు ఇవ్వటం, నిర్మాణ కార్యకలాపాలపై విధిస్తున్న ఒక శాతం సెస్ ద్వారా సమీకరిస్తున్న నిధులతో కల్పిస్తున్న సామాజిక సంక్షేమ రక్షణలు రద్దైపోతాయి. కానీ

**“గ్రామీణ ప్రాంతంలోని ఆరోగ్యరక్షణ వ్యవస్థ బాధ్యత అంతా వలంటీర్లుగా ముద్ర వేసిన ఆశా, అంగన్‌వాడి వర్కర్ల భుజస్కంధాలపై ఉన్నది. తమను కార్మికులుగా గుర్తించాలనీ, కార్మికుల లాగే అన్ని విధాలైన హక్కులు, ప్రయోజనాలు కల్పించాలనీ వీరు పోరాటాలు చేస్తున్నారు. నిర్మాణ కార్మికులు లాంటి కొన్ని తరగతులు, ఇంటిపని కార్మికులు, హాకర్లు, గిగ్ వర్కర్లు తదితరులు తమ హక్కులు, రక్షణ, ఇతర ప్రయోజనాలను సాధించుకోవటం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో లాబీయింగ్‌కు ప్రయత్నం చేస్తున్నారు.”**

రద్దవుతున్న వాటికి ప్రత్యామ్నాయంగా ఈ కోడ్‌లలో ఎటువంటి కొత్త ప్రయోజనాలనూ కల్పించలేదు.

కార్పొరేట్ సంస్థల నిర్లక్ష్యంతో జరిగిన భయంకరమైన భోపాల్ గ్యాస్ ప్రమాదం తర్వాత, చట్టంలో చేర్చిన ఏ ఒక్క రక్షణను ఈ కోడ్‌లో చేర్చకుండానే ఫ్యాక్టరీల చట్టాన్ని కూడా రద్దు చేశారు. 2024, డిసెంబరు 3వ తేదీ నాటికి ఆ ప్రమాదం జరిగి 40 సంవత్సరాలు పూర్తయాయి. 1970 కాంట్రాక్టు కార్మికుల చట్టాన్ని కూడా రద్దు చేయాలనే ఉద్దేశ్యాన్ని ఈ కోడ్‌లో పొందుపరిచారు. దానితో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయటం “అత్యంత కష్టం” నుండి “అసాధ్యం”గా మారుతుంది. యూని యన్లను ఏర్పాటు చేసుకోవటం కష్టంగా మారటం, నిర్దిష్ట కాలానికి వర్తించే కాంట్రాక్టు విధానాన్ని ఈ కోడ్‌లో ప్రతిపాదించటంతో శాశ్వత ఉద్యోగులనే వారు లేకుండాపోతారు.

ఇన్‌సాల్వెన్సీ, డెట్ రికవరి, దివాళా చట్టాలు ఈ మధ్యకాలంలో రూపొందించిన చట్టాలలో అత్యంత సమస్యాత్మకమైనవి. పాత ఫ్యాక్టరీల చట్టం, 1956లో కంపెనీలను మూసివేయటానికి, రుణదాతలు తమ రుణాలను వసూలు చేసుకోవటానికి అవసరమైన నిబంధనలు ఉన్నాయి. కార్మికులకు చెల్లించాల్సిన బాకాయిలు ఈ రుణాలకు భిన్నమైన ప్రాతిపదికతో ఉంటాయని అది గుర్తించింది.

ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యూటీలపై ఎటువంటి చర్చ ఉండకూడదని, అవి కార్మికులకు సురక్షితంగా చేరవలసిన బకాయిలని చెప్పారు. వాస్తవానికి యజమానుల ఆస్తుల నుండి మొదటగా పిఎఫ్‌ను వసూలు చేయాలి. 1956, కంపెనీల చట్టంలోని 529ఎ సెక్షన్, దానితో సమానమైన 2013, కంపెనీల చట్టంలోని 326వ సెక్షన్‌లు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు “అత్యంత ప్రాధాన్యత ఇచ్చి చెల్లించాల్సినవి” అని చెప్పాయి.

అయినప్పటికి సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002, మరియు ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసి కోడ్‌లు రుణాలను వసూలు చేసుకోవటంలో బ్యాంకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, కార్మికుల బకాయిలు చెల్లించటానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పాయి. బ్యాంకులకు చెల్లించాల్సిన అప్పులు కోట్ల రూపాయలలో, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు లక్షల రూపాయలలో ఉంటాయి. ఈ రెండింటి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. తమకు రావలసిన బాకాయిలను వసూలు చేసుకోగలమా లేదా అన్నది కార్మికుల కుటుంబాలకు జీవన్మరణ సమస్యగా ఉంటుంది. న్యాయ పరిభాషలో దామాషా ప్రకారం తీసుకోవటం అంటే వాస్తవంగా న్యాయాన్ని అన్యాయంగా అమలు చేయటమే అవుతుంది.

ఇంత తీవ్రమైన ఆటంకాలు ఎదురౌతున్నప్పటికీ కార్మికవర్గం పోరాటాలను ఆపలేదు. వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడి కార్మికులు ముంబైలోని ఆజాద్ మైదానానికి చేరటం, తమ యూనియన్‌ను గుర్తించాలని చెన్నైలోని శామ్‌సంగ్ ఫ్యాక్టరీ కార్మికులు పట్టుపట్టి పోరాటం చేయటం, పశ్చిమబెంగాల్ టీ ఎస్టేట్లలోని కార్మికులు కనీస వేతనాలను డిమాండ్ చేయటం, 12 సంవత్సరాల జైలు నిర్బంధం తర్వాత కూడా తమను తిరిగి ఉద్యోగాలలోకి తీసుకోవాలని మారుతి సుజుకి కార్మికులు డిమాండ్ చేయటం దీనిని స్పష్టం చేస్తున్నాయి. వారిని మీడియా, అధికారంలో ఉన్నవారు విస్మరిస్తున్నప్పటికీ వారు అక్కడా, ఇక్కడా, ప్రతిచోటా ధూళి కణాలవలె కనిపించకుండా ఉన్నారు. మనందరి కళ్ళలో పడటానికి గాలి దుమారం కోసం ఎదురు చూస్తున్నారు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# కార్మికవర్గాన్ని విపత్కర పరిస్థితుల్లోకి నెట్టిన ప్రభుత్వం



రచయిత్రి ట్రేడ్‌యూనియనిస్టు, మానవహక్కుల న్యాయవాది

**టికె రాజలక్ష్మి**

బీహార్ ఎన్నికలు పూర్తి అయి, నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ ఆ రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చి వారం రోజులు కూడా గడవకుండానే 2025, నవంబరు 21న కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను నోటిఫై చేసింది. 2019-20 సంవత్సరాలలో పార్లమెంటు ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌లు: 1. కోడ్ ఆన్ వేజెస్, 2. ది ఇండస్ట్రియల్ రిలేషన్స్(ఐఆర్) కోడ్, 3. ది కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, ఆక్యుపేషనల్ సేఫ్టీ, 4. హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్(ఓఎస్‌హెచ్‌డబ్ల్యుసి). అనేక దశాబ్దాల తర్వాత తీసుకొచ్చిన అతి పెద్ద సంస్కరణలు ఈ కోడ్‌లని, వీటి వలన అసంఘటిత రంగంలోని 40 కోట్లమంది కార్మికులు న్యాయమైన వేతనాలు పొందటానికి చట్టబద్ధ గ్యారంటీ లభిస్తుందని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. సామాజిక రక్షణలను విస్తరించటానికి, కార్మికులకు ఉన్న రక్షణలను మరింత బలపరచటానికి, సంక్షేమ, ఇతర పథకాలను దేశంలో ఎక్కడైనా వారికి అందజే యటానికి ఈ కోడ్‌లు ఉద్దేశించబడ్డాయని కూడా ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్నది. నిబంధనలను తగ్గించటం వల్ల ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, కార్మికుల అవసరాలకు అనుగుణమైన ఆధునికమైన పని పరిస్థితులను కూడా ఈ కోడ్‌లు వాగ్దానం చేస్తున్నాయని చెబుతున్నది.

కార్మికచట్టాలను సరళీకరించటం పేరుతో 29 చట్టాలను ఈ కోడ్‌లలో కలిపివేశారు. స్వాతంత్య్రానికి ముందు నుండి కార్యకర్తలు, లాయర్లు, కార్మికవర్గ నాయకులు చేసిన కృషి వలన చట్టాలలో చేర్చిన అనేక రక్షణలను ఈ కోడ్‌ల ద్వారా నీరుగార్చటమో, తొలగించటమో చేశారు. ఐదు సంవత్సరాలకు ముందే పార్లమెంటు ఆమోదించిన ఈ కోడ్‌లను కార్మికసంఘాలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాయి. బీహార్ ఎన్నికలలో సాధించిన విజయం ఇపుడు ఈ కోడ్‌లను అమలు జరిపే ధైర్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చిందని భావిస్తున్నారు.

కార్మికుల ప్రతిఘటన కొత్త విషయం కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పరిశ్రమల యజమానుల ప్రయోజనాలకు అనుగుణంగా కార్మికచట్టాలను సరళీకరించటానికి తీవ్రంగా ప్రయత్నం చేసింది. ఈ రోజు లేబర్ కోడ్‌లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఐక్య ప్రతిపక్ష కూటమిలో అదే కాంగ్రెస్ పార్టీ భాగంగా ఉన్నది. పార్లమెంటు శీతాకాల సమావేశాల సమయంలో తమ సభ్యులు లేబర్ కోడ్‌లను పార్లమెంటులో వ్యతిరేకిస్తున్నప్పుడు ఇండియా బ్లాక్ పార్టీలు పార్లమెంటు బయట నిరసన తెలియచేశాయి.

మరోవైపున లేబర్ కోడ్‌లను నిరంతరం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న 10 కేంద్ర కార్మికసంఘాల ఐక్యవేదిక “సంక్షేమ రాజ్యం అన్న భావం బద్దలైపోయింది” అని చెప్పింది. ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి), సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), హింద్ మజ్దూర్ సభ, యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటి ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ ఉమెన్స్ అసోసియేషన్, లేబర్ ప్రోగ్రెసివ్ ఫెడరేషన్, ఆల్ ఇండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ సెంటర్, ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ కమిటీలతో కూడిన పది యూనియన్‌లు నవంబరు 26వ తేదీన దేశవ్యాపిత సమ్మె జరిపాయి. 2026, ఫిబ్రవరిలో దేశవ్యాపిత సార్వత్రిక సమ్మె చేయటం కోసం కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు, వివిధ రంగాలలో పనిచేస్తున్న ఫెడరేషన్‌లు డిసెంబర్ 8వ తేదీన సమావేశం జరిపాయి. రైతాంగాన్ని నష్టపరుస్తున్న సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చాతో సమన్వయం చేసుకోవాలని ప్రణాళిక రూపొందించుకొన్నాయి.

లేబర్ కోడ్‌లతో కార్మికులకు చేకూరే ప్రయోజనాలను గురించి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నది. కార్మికులకు మెరుగైన వేతనాలు, సామాజిక రక్షణలు, సంక్షేమం తదితరాలలో ఈ కోడ్‌లు సంపూర్ణమైన మార్పులు తీసుకొస్తాయని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆత్మ నిర్భర్ భారత్ కోసం భవిష్యత్ కార్మికశక్తికి, స్థిరంగా పనిచేసే పరిశ్రమలు, ఉద్యోగాల పెంపుదల, కార్మిక సంస్కరణలకు ఈ కోడ్‌లు పునాది వేస్తాయని కూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భారత్‌లో శ్రామికవర్గ పరిస్థితులను ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా పెంపొందింప జేయటానికి, కార్మికులందరికీ సామాజిక న్యాయం కల్పించటానికి ఈ కోడ్‌లు దోహదం చేస్తాయని కూడా అందులో పేర్కొన్నారు.

తమ కార్మికచట్టాలను సంఘటితం చేసుకొంటూ ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థలు ముందుకు పోతుండగా మనదేశంలో కార్మికచట్టాలు అసమగ్రంగా, చిక్కులతో, కాలం చెల్లిన అంశాలతో ఉన్నాయని వాదనలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాలు సంకుచితంగా ఉన్నాయని, మారుతున్న ఆర్థిక పరిస్థితులకు, కొత్త ఉద్యోగ పద్ధతులకు అనుగుణంగా మారే విధంగా లేవని, అందువలన యజమానులు, కార్మికులు ఉభయులూ అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నా యని వాదిస్తున్నారు.

నూతనంగా అమలులోకి తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లు ప్రతి కార్మికునికి అప్పాయింట్ మెంట్ లెటర్లను తప్పనిసరి చేస్తున్నాయి. ప్రావిడెంట్ ఫండ్, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి) ప్రయోజనాలు, గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు

బీమా రక్షణ, కనీస వేతనాలు, సకాలంలో వేతనాలు చెల్లించటం, వార్షిక ఉచిత ఆరోగ్య చెకప్, మహిళా కార్మికులు రాత్రి షిఫ్టులలో పని చేయటాన్ని స్వచ్ఛందంగా ఎంచుకోవటం, సిద్ధపడిన వారికి అవసరమైన రక్షణలు కల్పించటం తదితర సామాజిక రక్షణ ప్రయోజనాలు కల్పించటం గురించి వీటిలో పేర్కొన్నారు. 10 మంది కన్నా తక్కువ ఉన్న పరిశ్రమలలోని కార్మికులు ఇఎస్ఐసిలో చేరటాన్ని స్వచ్ఛందం చేశారు.

ఫిక్స్‌డ్ టెర్మ్ ఎంప్లాయ్‌మెంటు (కొద్దికాలం మాత్రమే పని ఇవ్వటం, ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉద్యోగం నుండి తొలగించటం- హైర్ అండ్ ఫైర్ విధానం), గ్రాట్యూటిని ఐదు సంవత్సరాలకు బదులుగా సంవత్సరానికి ఒకసారి చెల్లించేలా ఈ కోడ్‌లలో మార్పుచేశారు. సెలవులు, సమాన వేతనం, వైద్యం, సామాజిక రక్షణలు తదితర పర్మినెంటు కార్మికులు పొందే అన్ని ప్రయోజనాలు వీరికీ లభిస్తాయి. నిర్దిష్ట కాల ఉద్యోగంలో తక్కువ కాలానికి పని ఇవ్వటంతో పాటు కాంట్రాక్టు విధానం కూడా కలిసి ఉండగా, ఈ విధానంలో కార్మికులను ప్రత్యక్షంగా తీసుకోవటం వలన కాంట్రాక్టు విధానం తగ్గుతుందని తప్పుడు వాదనలు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం-ఫ్లోర్ వేజ్- ఈ కార్మికులకు ఇస్తునందున కార్మికులు గౌరవప్రదంగా బతుకుతారని కూడా ఈ కోడ్‌లు చెబుతున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వం చెబుతున్న "ఒకదేశం-ఒకే వేతనం'' నినాదానికి అనుగుణంగా ఉండగా, నిర్దిష్ట కాలంలో వేతనాలను సవరించటం, సమాఖ్య వ్యవస్థలో వేతనాలను నిర్ణయించటానికి రాష్ట్రాలకు ఉన్న హక్కులను గురించి ఈ కోడ్‌లలో ఎటువంటి ప్రస్తావనా లేదు.

గిగ్, ప్లాట్‌ఫాం కార్మికుల చేత పని చేయించుకొనే యజమానులు వారి వార్షిక టర్నోవర్‌లో ఐదు శాతానికి మించకుండా, 1-2 శాతం కార్మికుల సంక్షేమానికి ఇవ్వాలని చెప్పారు. ఎంఎస్ఎంఇ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు), తోటలలో పనిచేసే కార్మికులను సోషల్ సెక్యూరిటి కోడ్ పరిధిలోకి తీసుకొచ్చారు. గనులు, బీడి, సిగరెట్ పరిశ్రమలలో పని చేసే కార్మికులకు రోజుకు 8 నుండి 12 గంటలు పనిదినంగా నిర్ణయించి, వారానికి 48 గంటల పరిమితిని విధించారు. ఓవర్‌టైం పని చేయటానికి అంగీకరిస్తే రెట్టింపు వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు.

ప్రమాదకరమైన వాటితో పాటు అన్ని పరిశ్రమలలో పని చేయటానికి మహిళలకు అనుమతి ఇచ్చినప్పటికీ, కార్మికుల రక్షణలను పెంచటానికి అవసరమైన జాతీయ స్థాయి ప్రమాణాలను గురించి కేంద్రం ఈ కోడ్‌లలో పేర్కొనలేదు. అయినప్పటికీ జాతీయ వృత్తి రక్షణ, ఆరోగ్య బోర్డులను ఏర్పాటు చేస్తారు. 500 కన్నా ఎక్కువ మంది పనిచేసే పరిశ్రమలలో సేఫ్టి కమిటీలను ఏర్పాటు చేస్తారు. కానీ తక్కువ మంది పనిచేసే పరిశ్రమలలో కమిటీ అవసరాన్ని గురించి ఏమీ చెప్పలేదు.

యజమానులు చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవటానికి మారుగా, పరిశ్రమలకు మద్దతు ఇవ్వటానికి ఉద్దేశించిన ఇన్స్‌పెక్టర్ కం ఫెసిలిటేటర్ ఆఫీస్‌ను గురించి కొత్తగా చెప్పారు. వివాదాలను సత్వరం పరిష్కరించుకొనే పద్ధతులు, చిన్న పరిశ్రమలకు రెగ్యులేటరీ భారాన్ని తొలగించటం తదితరాల వలన ఈ కోడ్‌లు కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయి. కానీ కార్మికులను మభ్యపెట్టటం కోసం వీటిని సరళీకరిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది.

ఉద్యోగ భద్రత లేకుండా చేయటం, కార్మికశాఖను నీరుగార్చటం, కార్మికవర్గం మొత్తాన్ని ఈ కోడ్‌లు భయానకమైన పని పరిస్థితులలోకి నెడతాయని సిఐటియు ఒక ప్రకటనలో పేర్కొంది. యజమానుల బాధ్యత, చట్టాలను అమలు చేసే యంత్రాంగం లేకపోతే గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులతో పాటు మొత్తం కార్మికులందరికీ సార్వత్రిక సామాజిక రక్షణ కల్పిస్తామన్న వాగ్దానాలకు అర్థం ఉండదు. గిగ్ కార్మికులు చేసే పనులలో యజమానులతో సంబంధం ఉండదు కాబట్టి వారికి సామాజిక రక్షణలు కల్పిస్తామన్న మాటలను అమలు చేయటానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి.

**అభ్యుదయ దృక్పథంతో చేయాలి-**
**నిర్దిష్ట కాల పరిమితి ఉండాలి**

కంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రోజుకు 168 రూపాయల కనీస వేతనం అనేక రాష్ట్రాలలో ఉన్న కనీస వేతనం కన్నా తక్కువగా ఉన్నదని సిఐటియు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనం (ఫ్లోర్ వేజ్) కనీస వేతనం (మినిమం వేజ్) కాదని కార్మికసంఘాలు పేర్కొంటున్నాయి. మనుషులకు రోజుకు అవసరమైన కాలరీలు, ఆహారేతర అవసరాలను పరిగణనలోకి తీసుకొని, ఆ ప్రాతిపదికన కనీస వేతనాలను నిర్ణయించే విధానం ఉన్నదని, కానీ ఈ కోడ్‌లు దానిని గురించి ప్రస్తావించటం లేదని చెప్పాయి.

గతంలో 100 మంది కార్మికులు పనిచేస్తున్న పరిశ్రమలో రిట్రెంచ్‌మెంట్, లే ఆఫ్, ఫ్యాక్టరీ మూసివేతకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉండగా, ఈ కోడ్‌లలో ఆ

# రాడికల్ సోషలిస్టు భావాల వ్యాప్తికి ఇదే మంచి తరుణం



**శామ్ వెబ్**

నేడు ప్రపంచాన్ని చుట్టేసిన ఆర్థిక సంక్షోభం పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులను కదిలించడమే కాదు, కార్మికవర్గాన్నీ, ప్రజలనూ ఉద్యమాల్లోకి నెట్టడమే కాదు, ప్రజల్లో రాడికల్ సోషలిస్టు భావాల వ్యాప్తికి మంచి అవకాశం కల్పించింది. ఇప్పుడు అనేక మంది ప్రజలతోనూ, ప్రజా నాయకులతోనూ అటువంటి భావాల గురించి చాలా సులువుగా చర్చించగలం. వరుసగా జరుగుతున్న (ఆర్థిక పరిణామాలు) గతంలో అసలు మాట్లాడ్డానికే ఇష్టపడని, అసలు పనికిమాలినవిగా కొట్టిపారేసిన భావాల గురించి ఈనాడు మరిన్ని కోట్లమంది ప్రజలు చర్చించుకోక తప్పని పరిస్థితిని కల్పిస్తున్నాయి. అయితే సోషలిజం గురించి మనం చర్చించే అంశాలు వర్తమాన ప్రపంచపు సవాళ్లకూ, సున్నితమైన అంశాలకూ సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. 20వ శతాబ్దంలో మనం చూసిన లాంటి సోషలిజాన్ని మక్కీకిమక్కీగా దించుకోవడం కాదు.

మనం ఇప్పుడు విప్లవ క్రమంలోని సోషలిస్టు దశలో లేకపోయినప్పటికీ, ఆ మార్గంలో మాత్రం ఉన్నాం. సోషలిస్టు సమాజానికి అంటే.... సమానావకాశాలు కల్పించే సమాజానికీ, శ్రామిక ప్రజలపై దోపిడీని రద్దుచేసే సమాజానికీ, అన్ని రకాల పీడనకు తుదివాక్యం పలికే సమాజానికీ, సమాజంలోని అనేక తరగతుల శ్రామిక ప్రజలు, వారి మిత్రులూ ఆర్థిక, ప్రభుత్వ పరిపాలనలో పాలుపంచుకునే సమాజానికీ వెళ్లే మార్గంలో మనం ఉన్నాం.

**(శామ్ వెబ్ అమెరికా కమ్యూనిస్టు పార్టీ ఛైర్మన్. పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో ఆయన "అవకాశాలకు అనువైన కాలం'' అన్న పేరుతో ఇచ్చిన నివేదికనుండి పై వ్యాఖ్యానం సేకరించబడింది)**

> “ వస్తూత్పత్తి రంగంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరపటానికి ఉండవలసిన కార్మికుల సంఖ్య పరిధిని పెంచారని, ఈ విధంగా సంఖ్య పెంచితే సార్వత్రిక సంక్షేమ పథకాలు అమలు చేయటం ఏ విధంగా సాధ్యమౌతుందని సిఐటియు జాతీయ కార్యదర్శి ఆర్ కురుమలైయన్ ప్రశ్నించారు. గతంలో కొద్దిమంది కార్మికులు పని చేస్తున్న పరిశ్రమల్లో కూడా సంక్షేమ పథకాలను అమలు చేసేవారు. కానీ కార్మికుల సంఖ్య పెంచటంతో అనేక పరిశ్రమలలోని కార్మికులు ఈ చట్టం పరిధిలోకి రారని చెప్పారు. ”

పరిమితిని 300 మంది కార్మికులకు పెంచారు. దీని వలన 90 శాతం మంది నిర్దిష్ట కాలం పనిచేసే కార్మికులుగా మారతారు. కార్మికుల హక్కులను నీరుగార్చటం వలన ఉపాధి అవకాశాలు పెరుగుతాయనటానికి ఎటువంటి సాక్ష్యాలు లేవని సిఐటియు చెప్పింది.

మాన్యుఫాక్చరింగ్ రంగంలో సామాజిక సంక్షేమ విధానాలను అమలు జరపటానికి ఉండవలసిన కార్మికుల సంఖ్యను పెంచారని, ఈ విధంగా సంఖ్య పెంచితే సార్వత్రిక సంక్షేమ పథకాలను అమలు చేయటం ఏ విధంగా సాధ్యమౌతుందని సిఐటియు జాతీయ కార్యదర్శి ఆర్ కురుమలైయన్ ప్రశ్నించాడు. గతంలో కొద్దిమంది కార్మికులు పని చేస్తున్న పరిశ్రమలలో కూడా సామాజిక సంక్షేమ పథకాలను అమలు చేసేవారు. కానీ కార్మికుల సంఖ్య పెంచటంతో అనేక పరిశ్రమలలోని కార్మికులు ఈ చట్టం పరిధిలోకి రారని కురుమలైయన్ చెప్పాడు. నాలుగు శాతం కన్నా తక్కువ మంది కార్మికులకు మాత్రమే సామాజిక సంక్షేమ చట్టాలు వర్తిస్తున్నాయి. ‘‘నిధులు కేటాయించకుండా సార్వత్రిక, సామాజిక సంక్షేమ విధానాలను అమలు చేస్తున్నామని ప్రభుత్వం ఎలా చెబుతుంది?” అని ఆయన ప్రశ్నించాడు.

కార్మికుల రక్షణ నిబంధనలను గురించి మాట్లాడుతూ, 1979లో ఆమోదించిన అంతరాష్ట్ర వలస కార్మికుల రక్షణ చట్టాన్ని నీరుగార్చారని కురుమలైయన్ చెప్పాడు. గతంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఐదుగురిని మాత్రమే పనిలో పెట్టుకున్నప్పటికీ, మొత్తం ఐదుగురి రక్షణకు యజమాని బాధ్యత వహించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిమితిని 50 లేదా అంతకన్నా ఎక్కువ మందికి పెంచారు. పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికులను తప్పనిసరిగా రిజిష్టర్ చేయాలన్న నిబంధనలు లేకుండా, కేవలం అప్పాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వటం వలన ఉపయోగం లేదని ఆయన చెప్పాడు. చట్టాలలో చెప్పిన ఉద్దేశ్యం మంచిదే అని నమ్మినప్పటికీ, అన్ని నిబంధనలను అమలు జరుపుతున్నామని యజమానులు తమకు తాము సర్టిఫికెట్ ఇచ్చుకుంటే సరిపోతుంది గనుక వాటికి అర్థం ఉండదని పేర్కొన్నాడు.

‘‘మహిళలకు ప్రత్యేకంగా విశ్రాంతి గదులు ఉన్నాయని, పని ప్రదేశంలో గాలి, వెలుతురు వచ్చే ఏర్పాటు ఉన్నాయని యజమాని ప్రకటించవచ్చు. దీనిపై అధికారుల పర్యవేక్షణ అవసరం లేదు. చట్టంలో ఉన్న నిబంధనలు అమలు జరుగుతున్నవా, లేదా అని పరిశీలించటానికి భౌతిక పర్యవేక్షణ జీవనాడి వంటిది అని ఐఎల్‌వో నిబంధనలు చెబుతున్నాయని” ఆయన చెప్పాడు. గతంలో ఫిర్యాదు వస్తే జిల్లా మేజిస్ట్రేట్ ఇన్స్‌పెక్షన్ చేసేవాడు. కానీ ఇప్పుడు ఏ సమయంలోనైనా ఆ విధంగా ఇన్స్‌పెక్షన్ చేస్తే సరిపోతుంది.

సంబంధిత సంస్థలు, వ్యక్తులతో ప్రభుత్వం చర్చలు జరపటం లేదని కురుమలైయన్ చెప్పాడు. ‘‘కార్మికులకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలు చేయటానికి అత్యున్నత అధికారాలు కలిగిన, త్రైపాక్షిక ప్రాతినిధ్యం ఉన్న సంస్థ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌వో) చివరి సమావేశం 2015లో జరిగింది. ఐఎల్‌వో సమావేశాలను ప్రతి సంవత్సరం ఏర్పాటు చేయాలని కార్మికసంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయటం లేదు. 2017లో కొన్ని చర్చలు జరిగాయి. అప్పుడు ప్రభుత్వం ఈ కోడ్‌లను వెబ్‌సైట్ (కార్మిక, ఉద్యోగ మంత్రిత్వశాఖ)లో పెట్టింది. ఇది సంబంధిత సంస్థలతో చర్చలు జరపటం కాదు. వాస్తవానికి ఈ కోడ్‌లు కొన్ని చట్టాలకున్న త్రైపాక్షిక స్వభావాన్ని హరించాయి” అని ఆయన చెప్పాడు.

ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్మికసంఘాలు మాత్రమే కాకుండా అధికారంలో ఉన్న పార్టీల నాయకత్వంలో ఉన్న కార్మిక సంఘాలు కూడా ఈ కోడ్‌లను వ్యతిరేకిస్తుండటం ఆసక్తికరమైన విషయం. 2014 నుండి ప్రభుత్వానికి పార్లమెంటులో పూర్తి మెజారిటి ఉన్నప్పటికీ, సైద్ధాంతికంగా ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘంగా ఉన్న బిఎంఎస్ మద్దతును కూడా ప్రభుత్వం పూర్తిగా పొందలేకపోతున్నది.

10 కేంద్ర కార్మికసంఘాల ఐక్యవేదిక కార్యక్రమాలలో బిఎంఎస్ పాల్గొనకపోయినప్పటికీ, లేబర్ కోడ్‌ల అమలును తన వెబ్‌సైట్‌లో స్వాగతించినప్పటికీ, ఐఆర్, ఒఎస్‌హెచ్‌డబ్ల్యుసి కోడ్‌లలోని అంశాలకు పదే పదే తన వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ప్రభుత్వం చర్చల క్రమాన్ని ప్రారంభించాలని లేబర్ కోడ్‌లను కేంద్రం నోటిఫై చేసిన నవంబరు 21వ తేదీన కేంద్ర కార్మికశాఖ మంత్రికి బిఎంఎస్ ఇచ్చిన మెమోరాండంలో పేర్కొనటంతో, సంబంధిత పక్షాలన్నింటితోనూ చర్చలు జరుపుతున్నామని ప్రభుత్వం చెబుతున్న వాదనలు పూర్తిగా నిజం కాదని స్పష్టమౌతున్నది. ఐఆర్, ఒఎస్‌హెచ్‌డబ్ల్యుసి కోడ్‌లలోని కొన్ని అంశాలు కార్మికుల ప్రయోజనాలకు నష్టకరంగా ఉన్నాయన్న అంశాన్ని ఇవి స్పష్టం చేస్తున్నాయి.

ఐఆర్, ఒఎస్‌హెచ్‌డబ్ల్యుసి కోడ్‌లకు వ్యతిరేకంగా తమ కార్యకర్తలలోనే ఉన్న అసంతృప్తిని పరిగణనలోకి తీసుకున్న బిఎంఎస్ నాయకత్వం సాధ్యమైనంత తొందరగా ఐఎల్‌సి సమావేశం ఏర్పాటు చేయాలని, కార్మికులకు సామాజిక రక్షణ, సంక్షేమాలకు, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఇచ్చిన మెమోరాండంలో పేర్కొంది.

నవంబరు 12-14 తేదీలలో రాయపూర్‌లో జరిగిన బిఎంఎస్ జాతీయ ఆఫీస్ బేరర్ల సమావేశంలో 2025, డిసెంబరు 15-20 తేదీల మధ్య ఈ అంశాలపై దేశవ్యాపిత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు మెమోరాండంలో చెప్పింది. వేతనాలు, సామాజిక రక్షణ కోడ్‌లను అమలు జరపాలని, మిగతా రెండింటిపై ప్రభుత్వం చర్చలు జరపాలన్న వైఖరితో బిఎంఎస్ ఉన్నది.

రిట్రెంచ్‌మెంటు, మూసివేస్తున్న ఫ్యాక్టరీలకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన పరిమితిని 300 మంది కార్మికులకు పెంచటం, సమ్మెహక్కుపై పరిమితులు పెట్టటం, 300 మంది వరకు కార్మికులు పని చేస్తున్న పరిశ్రమలలో రిట్రెంచ్‌మెంటుకు గురవుతున్న

కార్మికులక మూడు నెలల నోటీసు, వేతనానికి బదులుగా ఒక నెల వేతనమే చెల్లించటం, వేతనాలకు సంబంధించిన కోడ్‌లో ఇంటి అద్దెను మినహాయించటంతో పాటు, పరిమిత కాలం ఉద్యోగం, ఇళ్ళలో పనిచేసే కార్మికుల సమస్యలపై బిఎంఎస్ కూడా ఇతర కార్మిక సంఘాల వైఖరితోనే ఉన్నది. ఆరోగ్యం, రక్షణ అంశాలలో ఇచ్చిన అవార్డును మార్చటానికి, ఎక్కువ మినహాయింపులు ఇవ్వటానికి కొత్త కోడ్‌లు ప్రభుత్వానికి నిరంకుశ అధికారాలను ఇస్తున్నాయని బిఎంఎస్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర హింటే పేర్కొన్నారు. ఓఎస్‌హెచ్‌డబ్ల్యుసి కోడ్ వర్తించే పరిమితిని 20 నుండి 50 మంది కార్మికులకు పెంచటాన్ని గురించి కూడా బిఎంఎస్ లేఖలో ప్రస్తావించారు.


> **“ ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులు, వర్కింగ్ జర్నలిస్టులు, రవాణా రంగంలోని కార్మికులు, ఇతర కార్మికుల విషయంలో కూడా ఈ సంఖ్య పరిధిని పెంచారు. వర్కింగ్ జర్నలిస్టులకు నోటీసు ఇవ్వాల్సిన సమయాన్ని మూడు నెలల నుండి ఒక నెలకు తగ్గించి, రిట్రెంచ్‌మెంట్ పరిమితిని 20 నుండి 300 లకు పెంచారు. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులను తొలగించే సమయంలో ఇవ్వాల్సిన అలవెన్స్ గురించి ప్రస్తావించలేదు. ”**

ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులు, వర్కింగ్ జర్నలిస్టులు, రవాణా రంగంలోని కార్మికులు, ఇతర కార్మికుల విషయంలో కూడా ఈ సంఖ్యను పెంచారు. వర్కింగ్ జర్నలిస్టులకు నోటీసు ఇవ్వాల్సిన సమయాన్ని మూడు నెలల నుండి ఒక నెలకు తగ్గించి, రిట్రెంచ్‌మెంట్ పరిమితిని 20 నుండి 300 లకు పెంచారు. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులను తొలగించే సమయంలో ఇవ్వాల్సిన అలవెన్స్ గురించి ప్రస్తావించలేదు. శాశ్వత స్వభావం ఉన్న పనులలో కాంట్రాక్టు కార్మికులను నియమించటాన్ని వ్యతిరేకించే నిబంధనలను నీరుగార్చారు.

గత ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ జరిగి 10 సంవత్సరాలు గడించిందని, ఈ కాలంలో ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లు, ప్రభుత్వరంగ సంస్థలు, వివిధ బోర్డులు, కార్పొరేషన్‌లు, స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే సంస్థలు, సొసైటీలు, ప్రైవేటురంగంలోని సంస్థలలో కాంట్రాక్టు విధానం విపరీతంగా పెరిగిందని బిఎంఎస్ మెమోరాండంలో గుర్తు చేశారు. నూతన కోడ్‌ల వలన జీతాలు పెరుగుతాయని, సామాజిక సంక్షేమ వ్యయం పెరుగుతుందని యాజమాన్యాలు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ, ఇవి కార్మికులకు నష్టాన్ని కలిగిస్తాయని కార్మికసంఘాలు స్పష్టమైన వైఖరితో ఉన్నాయి. వాటి వలన కలిగే ప్రయోజనాల కన్నా నష్టాలు ఎక్కువగా ఉన్నాయని స్పష్టం కావడంతో వీటిని తిరిగి రూపొందించాల్సిన అవసరం ఉంది.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# వర్గపోరాటాలద్వారానే ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటారు



**– లెనిన్**


**అ**న్ని రకాల నైతిక, మతపరమైన, రాజకీయ, సామాజిక ప్రకటనల వెనుకా, హామీల వెనుకా ఏదో ఒక వర్గం యొక్క ప్రయోజనం దాగి ఉన్నదన్న విషయం తెలుసుకోనంతవరకూ రాజకీయాల్లో ప్రజలెప్పుడూ మోసగించబడుతూ, తమనుతాము మోసగించుకుంటూ ఉంటారు. అలాగే సంస్కరణల ద్వారా సమాజాన్ని మార్చగలమనీ, అభివృద్ధిచేయగలమనీ భావించేవారు కూడా ఈ సమాజంలో మనకు కనిపించే పాతసమాజపు ప్రతి సంస్థనూ –అది ఎంతటి క్రూరమైనదైనా, ఎంతగా కుళ్లిపోయినదైనా– దాన్ని కొన్ని పాలకవర్గాలు రక్షిస్తూ ఉంటాయన్న విషయం తెలుసుకోనంతవరకూ పాత సమాజపు సంరక్షకులచేత మోసగించబడుతూనే ఉంటారు. అయితే ఈ వర్గాల ప్రతిఘటనను సమూలంగా నాశనం చేసే మార్గం ఒక్కటే ఉంది. మన చుట్టూ ఉన్న సమాజంలోనే పాతదాన్ని నాశనం చేసి, కొత్తదాన్ని సృష్టించగలిగే సామర్థ్యం కలిగి ఉన్న శక్తులను – తమ సామాజిక అస్థిత్వం ద్వారా అటువంటి సామర్థ్యాన్ని స్వంతం చేసుకున్న శక్తులను– గుర్తించి, చైతన్యపరిచి, పోరాటంలోకి సమీకరించడమే ఆ మార్గం.

ఇప్పటివరకూ పీడితవర్గాలన్నీ అనుభవించిన, ప్రస్తుతం కార్మికవర్గం అనుభవిస్తున్న మానసిక బానిసత్వం నుండి దాన్ని బయటపడేసే మార్గాన్ని... మార్క్స్ ప్రతిపాదించిన తాత్విక భౌతికవాదం మాత్రమే చూపించగలుగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సాధారణ క్రమంలో కార్మికవర్గపు వాస్తవ స్థితి ఏమిటో చెప్పింది మార్క్స్ ఆర్థిక సిద్ధాంతం మాత్రమే.

కార్మికవర్గం యొక్క స్వతంత్ర సంస్థలు అటు అమెరికానుండి ఇటు జపాన్‌వరకూ, అటు స్వీడన్ నుండి ఇటు దక్షిణాఫ్రికా వరకూ అన్ని చోట్లా అనేక రెట్లుగా పెరిగిపోతున్నాయి. కార్మికవర్గం తన వర్గపోరాటంలో రాటుదేలి చైతన్యం పొందుతోంది, ఎడ్యుకేట్ అవుతోంది. బూర్జువా సమాజపు చీకటితెరలనుండి బయటపడుతోంది. ప్రతి నిత్యం మరింత సంఘటితమవుతోంది. విజయం సాధించడం ఎలాగో నేర్చుకుంటోంది. ఉక్కుశిక్షణతో రాటుదేలుతోంది. నిరాఘాటంగా అభివృద్ధి చెందుతోంది.”

**(లెనిన్ రాసిన “మార్క్సిజం యొక్క మూడు మూలాలు, మూడు అంశాలు” అన్న గ్రంథం నుండి. 1913 మార్చిలో ఇది ప్రచురించబడింది.)**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 9 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# కార్మికుల్ని రాజకీయంగా అణచడానికి జరిగే ప్రతి ప్రయత్నాన్నీ ఆందోళనకై ఉపయోగించుకోవాలి

**– విఐ లెనిన్**

....కార్మికులు రాజకీయంగా బానిసత్వం అనుభవిస్తున్నారని స్పష్టపరిచినంత మాత్రాన సరిపోదు. కార్మికుల్ని రాజకీయంగా అణచడానికి జరిగే ప్రతి ప్రయత్నాన్నీ ఆందోళనకై ఉపయో గించుకోవాలి. అంతేగాక రాజకీయ దోపిడీ అన్ని వర్గాల ప్రజల్లోనూ అసంతృప్తిని కలగజేస్తుంది. వారి నిత్య జీవితాన్నే అనేక విధాలుగా ఆటంకపరుస్తుంది. ప్రజల పారిశ్రామిక జీవితం, పౌర జీవితం, వ్యక్తి గత జీవితం, కుటుంబ జీవితం, మత, శాస్త్ర జీవితం మొదలైనవన్నీ నిరోధించబడతాయి. అందువల్ల వివిధ రూపాల్లో ప్రజలపై అమలయ్యే నిరంకుశత్వాన్నే మనం రాజకీయంగా బట్టబయలు చేయకపోతే కార్మికులలో రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధిచేయలేం. అంటే, మన కర్తవ్యాన్ని నెరవేర్చలేకుండా పోతాం. ప్రజలపై జరిగే ప్రతి నిరంకుశ చర్యను గురించి ఆందోళన చేయాలంటే దాన్ని ప్రజల ఎదుట బట్టబయలు చేయాలి. అందుకవసరమైన ఏర్పాట్లన్నిటినీ సోషల్ డెమోక్రాట్లు చేయాలి.

....సర్వ సాధారణంగా ప్రజలను రాజకీయ పోరాటాల్లో చురుకుగా పాల్గొనేట్లు చేయడానికి ఆర్థిక పోరాటాలే "ఇతర సాధనాలన్నిటికంటే ఎక్కువగా ఉపయోగపడతాయి" అనే మాట నిజమేనా? కాదు. ప్రజలు ఆర్థికంగా అనుభవించే కష్టాలను ఆధారం చేసుకుని మాత్రమే కాకుండా, ప్రభుత్వ నిరంకుశ చర్యలను, అనేక రకాల పోలీసు జులుములను ఆధారం చేసుకుని కూడా ప్రజలను రాజకీయ పోరాటాల్లో పాల్గొనేట్లు చేయవచ్చు. ఉదాహరణకు, గ్రామాల్లో జెంస్కీనాచల్నిక్‌ల (జారు చక్రవర్తి ఏజెంట్ల) నిరంకుశత్వం అంతాఇంతా అని చెప్పడానికి వీల్లేదు. వీరి తాబేదార్లు రైతుల్ని చీటికీ మాటికీ కొరడాలతో కొట్టి హింసించడం చూస్తున్నాం. ఇక ప్రభుత్వోద్యోగుల లంచగొండితనానికి హద్దు లేదు. పట్టణాల్లో పోలీసులు సామాన్య ప్రజల పట్ల అతి నిరంకుశంగా ప్రవర్తిస్తున్నారు. కరువుకాటకాలకు గురయ్యే నిరుపేదల్ని చెప్పరాని హింసలకు గురిచేస్తున్నారు. ప్రజలు విద్య, వైద్యం మొదలైన సౌకర్యాలకోసం ఆందోళన ప్రారంభించినప్పుడల్లా దాన్ని అధికారులెంత క్రూరంగా అణచివేస్తున్నారో చూస్తున్నాం. పన్ను వసూళ్లలో జరిగే జబర్దస్తీ వర్ణనాతీతం. కొన్ని మతాలకు చెందిన ప్రజల్ని చెప్పరాని హింసలకు గురిచేస్తున్నారు. సైనికులను క్రమశిక్షణ పేరుతో యమబాధలు పెడుతున్నారు. విద్యావంతుల్లో ఉదారభావాలు కలవారిని, విద్యార్థుల్ని సైనికాధికారులు ఎన్నో విధాల అవమాన పరుస్తున్నారు. దేశమంతటా ఇలాగే ప్రభుత్వోద్యోగుల నిరంకుశ చర్యలు ఎన్నో జరుగుతున్నాయి. వీటికీ "ఆర్థిక" పోరాటాలకూ ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, ప్రజలను రాజకీయ పోరాటాల్లో పాల్గొనేట్లు చేయడానికి అవి తక్కువ ఉపయోగపడతాయా? అంతకంటే ఎక్కువగానే ఉపయోగపడతాయి. ఎందుకంటే కార్మికులు తమ నిత్య జీవితంలో ఎదుర్కొనాల్సిన నిరంకుశ చర్యలు చాలా ఎక్కువగానే ఉంటాయి. అటువంటప్పుడు మనం మొదట్లోనే రాజకీయాందోళనలకు హద్దులు పెట్టడమెందుకు? ప్రజలను రాజకీయ పోరాటాల్లో పాల్గొనేట్లు చేయడానికి సర్వసాధారణంగా ఎన్నో సాధనాలున్నప్పుడు ఒక సాధనం మాత్రమే మిగతా వాటికంటే ఎక్కువగా ఉపయోగపడుతుందని అనడమెందుకు?

**(ఏం చేయాలి గ్రంథం నుండి)**

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................................................
వీధి..........................................................
గ్రామం..........................................................
మండలం లేదా పట్టణం..........................................
జిల్లా..........................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.